RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 27.09.2026 | సంపుటి : 13 సంచిక : 68 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వండి

## ఇప్పటివరకు ఇవ్వకపోవటం శోచనీయం

"భూగరిష్ఠ పరిమితి చట్టాలు చేయడంలో ఆనాడు భూమి ఉన్న వాళ్లే కీలకపాత్ర పోషించారు. ఆ లోపాన్ని సరిదిద్దేలా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని చేసింది. ప్రభుత్వం భూసేకరణ చేస్తే నిర్వాసితుల ఆమోదం తప్పనిసరి చేశారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయం. మన్మోహన్‌కు భారతరత్న ఇచ్చేందుకు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటీ?. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవిస్తేనే మనకు విజ్ఞత ఉన్నట్లు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. మన్మోహన్‌సింగ్ పేరు మీద దిల్లీలో ఒక విజ్ఞానకేంద్రం, స్మారకం నిర్మించాలని కేంద్రాన్ని కోరుతున్నా"
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి
- భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం మన్మోహన్ సింగ్
- తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర నెహ్రూ-పటేల్, సోనియా-మన్మోహన్
- ఆయన జీవితం జెన్‌జీ సహా.. అన్ని తరాలకు స్ఫూర్తి
- పీవీతో కలిసి మన్మోహన్ తీసుకున్న నిర్ణయాలే ఇవాళ దేశాన్ని పటిష్ఠంగా నిలబెట్టాయి
- విప్రో సర్కిల్‌లో విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నిజం చేసి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్ లో ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కొన్ని సమయాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ అంశాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతామన్నారు. పార్లమెంటులో ఈ అంశాన్ని

మిగతా 2లో..

### 30న సిరిసిల్లలో సీఎం రేవంత్ బహిరంగ సభ

4 కిమీ మేర భారీ ర్యాలీ..

2లో..



# 'సర్' నోటీసులకు ప్రత్యక్ష హాజరు అవసరం లేదు

## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఈసీ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్' కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్,ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి నేడు దిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని ఎన్నికల సంఘం వివరించింది. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల సమావేశం అనంతరం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు.దేశవ్యాప్తంగా 'సర్' నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది" అని ఈసీ తెలిపింది.గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో

మిగతా 2లో..

# ఎట్టకేలకు కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు నిర్ణయం

- నవంబర్ రెండోవారంలో పనులు మొదలు కానున్నాయి
- వచ్చే వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు పూర్తి
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు
- భద్రత, నాణ్యత విషయంలో రాజీపడం
- జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండోవారంలో ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు.మూడు బ్యారేజీల భద్రతను పటిష్టం చేయడంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు. హైదరాబాద్ బేగంపేట లోకి కుందన్ బాగ్ లో ఉన్న తన అధికారిక క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో

మిగతా 2లో..





# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేస్తాం

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాటలు ఘనం.. చేతలు శూన్యం:కవిత

హైదరాబాద్(జనంసాక్షి): రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వమేనని.. చేతలు శూన్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ ఫామ్‌హౌస్ పేరిట డ్రామాలు అడుతున్నారని మండిపడ్డారు. అంతా లోపాయికారీ ఒప్పందాలేనని.. ఫామ్‌హౌస్‌లపై చర్యలు ఉండవని ఎద్దేవా చేశారు. వచ్చే ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని ప్రకటిం చారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు వేదిక

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో సమావేశం.. కన్వీనర్‌గా రామచంద్రమూర్తి ఎన్నిక



హైదరాబాద్(జనంసాక్షి): సమాజంలో విలువలు క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను పరిరక్షిం చడంతో పాటు రాజకీయాలు, మానవ హక్కు లు, రాజ్యాంగానికి సంబంధించిన అంశాలపై చర్చించి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయాలని పలువురు ప్రము ఖులు నిర్ణయించారు. ఈ మేరకు జస్టిస్ సుదర్శ న్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో 'ఫోరం ఫర్ డెమోక్రసీ' లేదా 'ఫోరం ఫర్ కాన్‌స్టి ట్యూషనల్ డెమోక్రసీ' పేరుతో వేదికను ఏర్పా టు చేసే అంశంపై చర్చించారు. ఈ వేదికకు కన్వీనర్‌గా ప్రముఖ పాత్రికేయుడు రామచంద్ర మూర్తిని ఎన్నుకున్నారు.ప్రస్తుతం సమాజంలోని అనేక రంగాల్లో విలువలు క్షీణిస్తున్నాయని, చరిత్రను మార్చడం, తిరగరాయడం, స్వాతం త్ర్య సమరయోధులను అవమానించడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాజకీయా లను పరస్పర విరోధ ధోరణులతో రెండు వైపు లుగా విభజించే ప్రయత్నాలు పెరుగుతున్నా యని, దేశంలో సాధారణంగా, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంభాషణ స్థాయి రోజురోజుకూ దిగజారుతోందని పేర్కొన్నారు.ఈ పరిణామాలను అంగీకరించని పౌర సమాజం మౌనంగా ఉండటం సరైనది కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌర సమాజానికి ఉన్న బాధ్యతను నిర్వర్తించాల్సిన సమయం ఆసన్న మైందని సమావేశం అభిప్రాయపడింది. ప్రజా జీవితంలో ఉన్న ప్రముఖులు తమ అభిప్రా యాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసి, అవసరమైన సందర్భాల్లో రాజకీయ నాయకులు సమాజం లోని ఇతర వర్గాలను హెచ్చరిం చడం, అప్ర మత్తం చేయడం, సూచనలు ఇవ్వడం అవసర మని పేర్కొన్నారు. గతంలో ఉన్నత నైతిక, విలు వల ప్రమాణాలతో ప్రజా జీవి తాన్ని కొనసా గించిన పలువురు మహనీయులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని సమావేశంలో గుర్తు చేశారు. వారి పోరాటాలు, త్యాగాలు, ఆశ యా లను ప్రస్తుత తరానికి గుర్తుచేయా ల్సిన అవసరం ఉందని అభిప్రాయప డ్డారు. రాజకీయ నాయకులు లేదా సమాజంలో ప్రభావం చూపే వ్యక్తులు ప్రజాస్వామ్యానికి ముప్పు కలి గించే పరిణామాలపై హెచ్చరించడం, అప్రమత్తం చేయడం, అవస రమైన సూచనలు చేయడం ద్వారా తమ బాధ్యతను నిర్వర్తిం చామనే సం తృప్తి ఉం టుందని సమావేశంలో పేర్కొన్నారు.వేదిక పేరు, సంస్థ స్వరూపం, భవిష్యత్ కార్యక్రమా లను తదుపరి సమావే శాల్లో నిర్ణయించాలని భావించారు ఎమ్మెల్సీ కోదండరాం, ప్రవాస భారతీయుడు డాక్టర్ గోపాల్ రెడ్డి, ఎంవి గోన రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, ఇండియన్ జర్న లిస్ట్ యూనియన్ నాయకులు, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ వినాయక్, ప్రొఫెసర్ డీఎన్ రావు, ప్రముఖ న్యాయవాది జ్యోతికిరణ్, పీఓడబ్ల్యూ సంధ్య, ప్రముఖ పాత్రికేయుడు దిలీప్‌రెడ్డి, వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, జనం సాక్షి పత్రిక ఎడిటర్ ఎంఎం రహమాన్, మలుపు బాల్‌రెడ్డి, ప్రముఖ జర్నలిస్ట్ వసంతలక్ష్మి, మానవ హక్కుల సంఘం నాయకుడు జీవన్ పాల్గొన్నారు.

# ఎన్నికలెప్పుడొచ్చినా విజయం మాదే

## గ్యారెంటీలను గాలికొదిలేసిన ప్రజాప్రభుత్వం

## పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారు

## ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్ అధికారంలో రావడం ఖాయం: కేటీఆర్



మహబూబాబాద్(జనంసాక్షి): తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్ అధికారంలో రావడం ఖాయమని అన్ని సర్వేలు చెబుతున్నాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు నేతలు హైదరాబాద్ తెలంగాణ భవన్ వేదికగా బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనతో ప్రజలు బాధపడుతున్నారన్న కేటీఆర్ రైతులకు రైతు బంధు, కనీసం యూరియా ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆరోపించారు. ఎన్నికల హామీలను గాలికొదిలేసి, ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టిన

మిగతా 2లో..

# నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం

## 19 మంది దుర్మరణం

## ఘటనపై దర్యాప్తునకు 'సెట్' ఏర్పాటు

కోహిమ(జనంసాక్షి): మద్యపాన నిషేధం అమల్లో ఉన్న నాగాలాండ్‌లో కల్తీ మద్యం సేవించి 19 మంది ప్రాణాలు కోల్పోయారు. రెండ్రోజుల్లో మోకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్రంలో 1990 నుంచే మద్యపాన నిషేధం ఉన్నప్పటికీ ఈ దుర్ఘటన

మిగతా 2లో..

# 20 శాతం మంది టీనేజర్లకు డ్రగ్స్ ముప్పు

- సమగ్ర పునరావాసం అవసరం
- పిల్లలు డ్రగ్స్ బారిన పడటానికి గల కారణాలను గుర్తించాలి
- సీజేఐ సూర్యకాంత్ ఆందోళన

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశంలో ఉన్న టీనేజర్స్‌లో 20 శాతానికి పైగా మంది మాదకద్రవ్యాల బారిన పడే ముప్పును ఎదుర్కొంటున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్నాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. డ్రగ్స్ ఉచ్చులో చిక్కుకున్న పిల్లలను కేవలం రికార్డుల్లో గణాంకల్లా చూడకూడదన్నారు. వారిని ఆ మార్గంలోకి నెట్టిన విభిన్న పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి తమ బాల్యాన్ని తిరిగిచ్చే పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఆగస్టులో ప్రముఖ జర్నల్ 'లాన్సెట్ రీజినల్

మిగతా 2లో..





# దసరా నాటికి 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లిస్తాం

## పూరిళ్లు రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

## కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన: మంత్రి పొంగులేటి

జనగామ(జనంసాక్షి): రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన సాగుతోందని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జనగామలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దసరా నాటికి 2,18,000 ఇళ్లు పూర్తవుతాయన్నారు. బీఆర్‌ఎస్

మిగతా 2లో..

## ఎన్నికలెప్పుడొచ్చినా
# విజయం మాదే

ప్రతిసారీ ప్రజలు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారన్న కేటీఆర్ పని చేసే ప్రభుత్వానికి కళ్లల్లో కట్టెలు పెట్టొద్దనే కేసీఆర్ బయటికి రావట్లేదని తెలిపారు. మూడు సంవత్సరాలు కేసీఆర్ బయటికి రాకపోయినా ఆదరణ తగ్గలేదని తెలిపారు. కేసీఆర్ బయట కనిపించకపోయినా ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి మహిళ, ప్రతి ఆడబిడ్డ ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారని, కేసీఆర్ ఉన్నప్పుడు సమయానికి రైతు బంధు పడేదని ప్రజలు అనుకుంటున్నారని వెల్లడించారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు గెలిచినా పథకాలు ఆగవని భావించి బీఆర్ఎస్‌ను ఓడించారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన రెండు వాగ్దానాలను నిలబెట్టుకున్నారు. ఒకటి మేము మోసం చేస్తాం. ప్రజలు మోసపోవాలనే కోరుకుంటారని అందుకే మోసగాళ్లనే ఎన్నుకుంటారని చెప్పారు. రెండోది వెనకటి రోజులు తీసుకొస్తా అన్నారు. తీసుకొచ్చారు. కరెంట్ కోతలు మొదలయ్యాయి. ప్రజా సమస్యలపై తమ పోరాటం ఎలాంటి వెనకడుగు లేదని కేటీఆర్ తెలిపారు. ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

## 20 శాతం మంది టీనేజర్లకు డ్రగ్స్ ముప్పు

'హెల్త్- సౌత్‌ఈస్ట్ ఆసియా' ప్రచురించిన ఒక అధ్యయనాన్ని సీజేఐ ప్రస్తావించారు. దేశంలోని ప్రతి ఐదుగురు టీనేజర్లలో ఒకరి కంటే ఎక్కువ మంది మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆ అధ్యయనం అంచనా వేసిందన్నట్లు చెప్పారు. ఈ సమస్య టీనేజ్ వర్గానికి మాత్రమే పరిమితమైనది కాదన్నారు. యువత అవసరాలను గుర్తించి దీన్ని నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. డ్రగ్స్ బారిన పడిన పిల్లల గురించి గణాంకాలు చెప్పడం ఎంత ముఖ్యమో, వారి బాధలను అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యమని సీజేఐ సూచించారు. ఒకరు బాధితుడు కావడానికి రకరకాల కారణాలు ఉంటాయని చెప్పారు. చెడు స్నేహాలు, ఇంట్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం, ఆశ్రయం లేకపోవడం, వేధింపులు లేదా డ్రగ్స్ ఉండే వాతావరణంలో పెరగడం వంటి రకరకాల కారణాల వల్ల చదువుకు దూరమై పిల్లలు ఈ చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని చెప్పుకొచ్చారు. డ్రగ్స్ బారిన పడే మార్గాలు వేర్వేరుగా ఉన్నప్పుడు, వాటి పరిష్కారానికి అనుసరించే విధానాలు కూడా విభిన్నంగా ఉండాలని సీజేఐ సూచించారు. ఒక సమస్యతో తమ ముందుకు వచ్చిన పిల్లలను ఆ కోణంలోనే చూడకూడదన్నారు. పిల్లల రక్షణ కేవలం రెస్క్యూ చేయడంతోనే ఆగిపోకూడదన్నారు. చికిత్స, డిశ్చార్జ్ తర్వాత సుస్థిరమైన పునరావాస వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ, తమ స్వార్థం కోసం పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్న నేరస్థుల పట్ల చట్టం అత్యంత కఠినంగా, సత్వరమే స్పందించాలని జస్టిస్ సూర్యకాంత్ తేల్చిచెప్పారు. అయితే, బాధితులైన పిల్లలను చూసే కోణం మారాలన్నారు. వారి భద్రత, వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం ప్రధానాంశాలుగా కావాలన్నారు. బాల్యాన్ని వారికి తిరిగి ఇవ్వడం అంటే గడియారాన్ని వెనక్కి తిప్పడం కాదన్నారు. మళ్లీ తమ బాల్యాన్ని, విద్యను, మంచి సంబంధాలను, ఆటపాటలను, భవిష్యత్తుపై నమ్మకాన్ని అనుభవించేలాంటి అనుకూల వాతావరణాన్ని కల్పించడమని సీజేఐ చెప్పారు.




# మన్మోహన్ సింగ్‌కు భారత ఇవ్వండి

ప్రస్తావించాలని రాజ్యసభ సభ్యులకు సూచించారు. మన్మోహన్ సింగ్ జయంతి రోజున ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ముఖ్యమంత్రిగా తనకు గర్వకారణమని తెలిపారు.

**భారత దేశం గర్వించదగ్గ ఆర్థికవేత్త**

భారత దేశం గర్వించదగ్గ ఆర్థికవేత్త మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతోనే ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు ఆయన వన్నె తెచ్చారన్నారు. 1991 లో దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ పనిచేశారని, అప్పుడు ఆయన తీసుకువచ్చిన సంస్కరణల దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకునేలా చేశాయని గుర్తు చేశారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని సీఎం తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సంస్థలు హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి సేవలు అందిస్తున్నాయని, అలాంటి ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సముచితం అని భావించామని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఎకనామిక్ ఫైటర్ మన్మోహన్‌సింగ్**

మన్మోహన్‌సింగ్ సరళీకృత ఆర్థికవిధానాల వల్లే ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక పరిజ్ఞానం తెలిసి పీవీ నర్సింహారావు బాధ్యతలు ఇచ్చారని, మన్మోహన్‌సింగ్‌ను ఎకనమిక్స్ టైమ్స్ ఎకనమిక్ ఫైటర్‌గా వర్ణించిందని గుర్తు చేశారు. "విద్యాహక్కు, సమాచారహక్కు, ఉపాధిహామీ చట్టాలు మన్మోహన్‌సింగ్ తెచ్చినవే. అపోం నుంచి రాజ్యసభకు ఎన్నికైనప్పుడు మన్మోహన్‌సింగ్ ఎన్నిక చెల్లదని కేసు వేశారు. ఆ కేసుపై సుప్రీంకోర్టులో తన తరఫున వాదించేందుకు న్యాయవాది అవసరమైంది. న్యాయవాదికి ఫీజు చెల్లించేంత డబ్బు తన వద్ద లేదని ఆనాడు మన్మోహన్ సింగ్ అన్నారు. ఒక న్యాయవాది ఉచితంగా వాదించేందుకు ముందుకు వచ్చినే మన్మోహన్‌సింగ్ కోర్టులో పిటిషన్ వేశారు" అని జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దేశానికి విశేష సేవలు అందించారు తెలంగాణ ఏర్పాటు ప్రధాన కారకులలో మన్మోహన్ సింగ్ ఒకరన్న హైదరాబాద్‌లో మన్మోహన్‌సింగ్ స్మారకపార్క్ ఏర్పాటు చేసుకోవటం ఆనందంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. దేశాభివృద్ధికి మన్మోహన్‌సింగ్ చేసిన కృషి దేశమంతటికీ తెలుసనని, ఆర్థికశాఖ కార్యదర్శి, ఆర్థికశాఖ మంత్రి, ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. చరిత్రలో తెలంగాణను రెండు భాగాలుగా చూస్తుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో కలిపి స్వాతంత్ర్యం అందించిన ఘనత తొలి ప్రధాని నెహ్రూ, వల్లభాయ్ పటేల్ ది అయితే... దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ది అని సీఎం గుర్తు చేశారు. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ ఆయన చేసిన సంతకాన్ని ఇక్కడ పదిలపరిచామని సీఎం తెలిపారు. మన్మోహన్ సింగ్ ఎన్నో సరళీకృత విధానాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం 2013 తీసుకొచ్చిన ఘనత సోనియా, మన్మోహన్ సింగ్ ఘనత అని తెలిపారు. భూమి కలిగిన వారితో పాటు భూమిలేని పేదలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని పునరావాస చట్టం ద్వారా హక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆయన చేసిన ఆలోచనలు, తీసుకువచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, నవీన్ యాదవ్, ఎమ్మెల్యే కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 30న సిరిసిల్లలో సీఎం రేవంత్ బహిరంగ సభ

హైదరాబాద్(జనంసాక్షి):సిరిసిల్లలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. 30వ తేదీ సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో ఈ సభ నిర్వహించనున్న హస్తం పార్టీ, సభకు ముందు దాదాపు 4 కిలోమీటర్ల మేర కొనసాగే భారీ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం భారీగా జన సమీకరణ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న ఈ సభను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగుతున్నారు. సభకు జన సమీకరణ, ర్యాలీ నిర్వహణ, స్థానిక నేతల సమన్వయం, సభా ప్రాంగణంలో ఏర్పాట్ల పర్యవేక్షణ వంటి అంశాలను మంత్రులు దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. మరోవైపు ఎమ్మెల్యేలను కూడా నియోజకవర్గాలు, మండలాల వారీగా ఇన్‌ఛార్జ్‌లుగా నియమించి సభను విజయవంతం చేసేలా పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది. సిరిసిల్ల టౌన్‌లో సుమారు 4 కిలోమీటర్ల మేర జరిగే ర్యాలీపై పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సీఎం స్వయంగా ర్యాలీలో ముందుండి నడవనున్నందున మార్గం పొడవునా భారీగా పార్టీ శ్రేణులు, ప్రజలను సమీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాలీ ముగిసిన తర్వాత భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభలో ముఖ్యమంత్రి ప్రసంగంలో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, సిరిసిల్ల ప్రాంతానికి సంబంధించిన అనేక అభివృద్ధి పథకాలను ప్రస్తావించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సభ ఏర్పాట్లపై పార్టీ నేతలు కసరత్తు మొదలుపెట్టారు. ఎక్కడెక్కడి నుంచి ఎంతమందిని సమీకరించాలి? ర్యాలీ మార్గంలో ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? సభా ప్రాంగణంలో వేదిక, ప్రజలు కూర్చునే ఏర్పాట్లు ఎలా ఉండాలి? ట్రాఫిక్, పార్కింగ్, భద్రత వంటి అంశాలపై అధికారులు, పార్టీ నేతలు సమన్వయం చేసుకోనున్నారు.

## ఏఐ రంగంలో పెట్టుబడులు దేశానికి ముందడుగు:నిర్మల

న్యూఢిల్లీ(జనంసాక్షి):కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడులు దేశ భవిష్యత్తుకు ముందడుగు అవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అన్ని రంగాల్లో డిజిటల్ వ్యవస్థకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. "కృత్రిమ మేధతో పాటు సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ రంగాలకు దేశ భారీగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సాహం ఇవ్వాలి. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల్లో కూడా ఏఐ వినియోగం పెరగాలి. అన్ని రంగాల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే, భారత ఆర్థిక వృద్ధి రేటు 10 శాతాన్ని దాటడం సాధ్యమే. మరిన్ని రంగాల్లో స్టార్టప్ కంపెనీలు ఆవిర్భవించాలి" అని పిలుపునిచ్చారు.

## దసరా నాటికి 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లిస్తాం

పదేళ్ల పాలనలో కేవలం కొన్ని నియోజకవర్గాలకే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల కోసం పని చేస్తుందని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను కూడా కొనసాగిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## 'సర్' నోటీసులకు ప్రత్యక్ష హాజరు అవసరం లేదు

ఓటుదక్కకపోవడంపై స్పందిస్తూ.. "ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరించి ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది 'ఫారం-6' నింపారు" అని వెల్లడించింది.

## ఏసీబీ వలలో మెట్‌పల్లి సీడీపీఓ

**రూ.63 వేల లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్న అధికారులు**



మెట్‌పల్లి (జనంసాక్షి):అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దారోజు పద్మ చిక్కారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సందర్భంగా రిమార్కులు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.63 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పరిధిలోని 21 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ప్రతి కేంద్రానికి నెలకు రూ.1,000 చొప్పున లంచం ఇవ్వాలని సీడీపీఓ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మూడు నెలలకు సంబంధించిన మొత్తం రూ.63,000ను ఒక అంగన్‌వాడీ కార్యకర్త నుంచి శనివారం స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి సీడీపీఓను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ గణేష్ నిమజ్జన బందోబస్తులో ఉన్నందున, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ ట్రాప్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం నిందితురాలిని కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

## నవంబర్ తర్వాత ఇరాన్‌పై మళ్లీ బాంబులు..

**శాంతి ప్రణాళికను తిరస్కరించిన ట్రంప్..!**

కాల్పుల విరమణ కోసం ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. నవంబరులో అగ్రరాజ్యంలో జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు సిద్ధమవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తమ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే.. అందుకు బదులుగా హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు అణుచర్చలను పునరుద్ధరిస్తామని టెహ్రాన్ ప్రతిపాదించింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా ఈ శాంతి ప్రణాళిక ను అగ్రరాజ్యానికి తెలియజేశామని.. దీనిపై ఒప్పందం కుదిరితే హార్ముజ్‌ను తిరిగి తెరుస్తామని అబ్బాస్ అరాగ్చి పేర్కొన్న విషయం తెలిసిందే.

## అణ్వాయుధాల తయారీ దిశగా సౌదీ

**అమెరికా నిఘా వర్గాల అంచనా**

అణ్వాయుధ తయారీలో పశ్చిమాసియా దేశాల మధ్య పోటీపై మళ్లీ చర్చ మొదలైంది. సౌదీ అరేబియా అణ్వాయుధాల తయారీ దిశగా వెళ్లే అవకాశాన్ని కొట్టిపారేయలేమని అమెరికా నిఘా వర్గాలు అంచనా వేశాయి. అణు బాంబులు తయారు చేసేందుకు ఆ దేశం ఆసక్తి చూపించొచ్చని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు అగ్రరాజ్య కాంగ్రెస్‌కు అందించిన తమ రహస్య నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. పౌర అవసరాల కోసం సౌదీ అరేబియాకు యురేనియం ఇవ్వొచ్చు.. ఆ దేశంతో 30 ఏళ్ల సుదీర్ఘకాల ఒప్పందానికి ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ డీల్‌పై అమెరికా చట్టసభ సభ్యుల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీకి యురేనియం శుద్ధి సాంకేతికతను అందిస్తే.. భవిష్యత్తులో అణ్వాయుధాల తయారీకి అవసరమైన సామర్థ్యం వారికి అందుబాటులోకి వస్తుందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒప్పందం ప్రకారం సౌదీకి 5 శాతం లోపు మాత్రమే యురేనియం శుద్ధి పరిమితులు ఉన్నాయి. భవిష్యత్తులో దీనిని 20 శాతం వరకు పెంచే అవకాశంపై చర్చ జరుగుతోంది. అయితే అణ్వాయుధాల తయారీకి సాధారణంగా 60-90 శాతం వరకు శుద్ధి చేసిన యురేనియం అవసరమవుతుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ అణు బాంబులను తయారు చేస్తే.. భద్రతా కారణాల దృష్ట్యా తాము కూడా అణ్వాయుధాలను సమకూర్చుకోవాల్సి వస్తుందని సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గతంలో హెచ్చరించడం గమనార్హం.

# తెలంగాణను దేశంలోనే అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

- రూ.50 వేల కోట్ల పెట్టుబడులు..
- 5 లక్షల మందికి ఉపాధి లక్ష్యం
- టూరిజం పాలసీతో తొలి ఏడాదిలోనే రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు
- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో పర్యాటక రంగానికి కొత్త రూపు
- రివర్స్ టూరిజంతో ఆదివాసీలకు హైదరాబాద్ పర్యాటక ప్రాంతాల సందర్శన: మంత్రి జూపల్లి కృష్ణారావు




హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025?30 ద్వారా రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణకు ఘనమైన చరిత్ర, వారసత్వం, ఆధ్యాత్మికత, సంస్కృతి, ప్రకృతి, వన్యప్రాణులు, వంటకాలు, ఆధునిక పట్టణ ఆకర్షణలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని వారసత్వ సంపద నుంచి యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం వరకు, వరంగల్, యాదాద్రి, భద్రాచలం, నాగార్జునసాగర్, సోమశిల, నల్లమల అడవులు, జలపాతాల వరకు రాష్ట్రంలో విభిన్న పర్యాటక అనుభవాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రూ.50 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యంతెలంగాణ టూరిజం పాలసీ 2025?30 ద్వారా తొలుత రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంతో ఇప్పుడు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టడం, 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకలో తెలంగాణను అగ్రశ్రేణి రాష్ట్రాల్లో నిలపడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. టూరిజం పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రాష్ట్రానికి రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పెట్టుబడులతో పాటు పీపీపీ విధానం, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. ఏఐతో పర్యాటక రంగానికి కొత్త రూపుప్రపంచ పర్యాటక దినోత్సవం?2026 ప్రధాన ఇతివృత్తమైన 'డిజిటల్ ఎజెండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి పునరురూపకల్పన' తెలంగాణకు ఎంతో సముచితమని మంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, డేటా అనలిటిక్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ప్రయాణ ప్రణాళికలు రూపొందించడం, బహుభాషా పర్యాటక సహాయం అందించడం, వారసత్వ సంపదను డిజిటల్ విధానంలో పరిరక్షించడం చేయడం, వర్చువల్, ఇమ్మర్సివ్ అనుభవాలను అందించడం సాధ్యమవుతుందని చెప్పారు. కొత్త రూపంలో తెలంగాణ టూరిజం వెబ్‌సైట్ తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌ను పునరురూపకల్పన చేసి ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు ఆధునిక, సమగ్ర డిజిటల్ వేదికగా ఇది అందుబాటులోకి ఉంటుందని చెప్పారు. పర్యాటక ప్రాంతాలు, ఆకర్షణలు, టూరిజం ప్యాకేజీలు, కార్యక్రమాలు, ఇతర సేవల వివరాలను పర్యాటకులు సులభంగా తెలుసుకునేలా వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రధాన పర్యాటక ఆకర్షణలను సందర్శించేందుకు వీలుగా హాప్?ఆన్, హాప్?ఆఫ్ పర్యాటక సేవలను కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆదివాసీల కోసం 'రివర్స్ టూరిజం' పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగంగా 'రివర్స్ టూరిజం ? ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' కు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. నగరవాసులు పల్లెలు, ప్రకృతి ప్రాంతాలకు వెళ్లడం మాత్రమే కాకుండా.. అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని ప్రత్యక్షంగా చూసేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా నుంచి 100 మంది ఆదివాసీ/గిరిజన అతిథులను హైదరాబాద్‌కు తీసుకువచ్చి నగరంలోని పర్యాటక ప్రాంతాలను చూపిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ ఆధునిక అభివృద్ధి, చారిత్రక వారసత్వం, నాగరికతలో వచ్చిన మార్పులను వారు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. స్థానికులకు ఉపాధి, అవకాశాలుపర్యాటక రంగం ద్వారా స్థానిక యువత, మహిళలు, కళాకారులు, గైడ్లు, ఆతిథ్య రంగ సిబ్బంది, రవాణా నిర్వాహకులు, స్థానిక పారిశ్రామికవేత్తలకు అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. గ్రామీణ, పర్యావరణ, సమాజ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా స్థానిక సమాజాలు అభివృద్ధిలో భాగస్వాములై, దాని ప్రయోజనాలను నేరుగా పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

**నేడు 40 అడుగులకు చేరే అవకాశం.. అధికారుల్లో అప్రమత్తత.**

భద్రాచలం సెప్టెంబర్ 26 (జనంసాక్షి):భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కాళేశ్వరం సహా పలు జలాశయాలకు భారీగా వరదనీరు చేరుతోంది. ఆయా ప్రాజెక్టుల నుంచి విడుదలవుతున్న నీటితో పాటు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం గోదావరిలోకి చేరుతుండటంతో భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు 19.80 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం తెల్లవారుజామున 3 గంటలకు 19.70 అడుగులు, ఉదయం 6 గంటలకు 20.10 అడుగులు, ఉదయం 11 గంటలకు 22.30 అడుగులు, మధ్యాహ్నం 2 గంటలకు 24.30 అడుగులకు చేరుకుంది. సాయంత్రం 6 గంటల సమయానికి గోదావరి నీటిమట్టం 20.60 అడుగులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి మరింతగా వరదనీరు వచ్చి చేరే అవకాశం ఉండటంతో గోదావరి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నేడు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తుండటంతో యంత్రాంగం అప్రమత్తమైంది.



## నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం

జరగడం కలకలం రేపుతోంది. వరుస మరణాల నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం, కల్తీ మద్యం సరఫరా, దాని మూలాలను గుర్తించేందుకు సిట్ ఏర్పాటు చేసింది. పోలీసులు పలుచోట్ల దాడులు నిర్వహించి 19 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 3000 కల్తీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం, మృతదేహాల అవయవాల నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం గువాహటికి పంపించారు. గుర్తుతెలియని, లేబుల్ లేని మద్యాన్ని సేవించవద్దని పోలీసు అధికారులు ప్రజలను సూచించారు. మద్యం సేవించిన తర్వాత తల తిరగడం, దృష్టి మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

**కల్తీ మద్యంతో కంటిచూపు కోల్పోయి!**

ఇదిలా ఉండగా, ఇటీవల మధ్యప్రదేశ్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించిన వారిలో 37 మంది రోగులకు కంటి సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు, వైద్యులు తెలిపారు. వారందరిలో క్రితం, బినఫూరిత మద్యం సేవించి 13 మంది మృతి చెందినట్లు జిల్లా యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ, మృతుల సంఖ్య 50కి పైగా ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అధికారుల ప్రకారం, కలుషితమైన మద్యం సేవించిన తర్వాత దాదాపు 15 మంది ఆసుపత్రిలో చికిత్స పొందారని, వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. అయితే, కల్తీ మద్యం ప్రభావం కారణంగా ప్రాణాలతో బయటపడిన వారు కంటిచూపు కోల్పోతుండటాన్ని వైద్యులు, పారామెడికల్ సిబ్బంది తెలుసుకున్నారని అధికారులు చెప్పారు. దీంతో నాసిరకం మద్యం వల్ల ప్రభావితమైన వారి కోసం బండా, షాఫూర్ బ్లాక్‌లలో 10 ప్రభావిత గ్రామాల్లో స్థానిక యంత్రాంగం ప్రత్యేక పరీక్షా శిబిరాలను నిర్వహించింది. "మొత్తం 226 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, 37 మందికి కంటి సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. మరో 189 మందికి వివిధ ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధరణ జరిగింది. జిల్లా యంత్రాంగం గుర్తించిన గ్రామాల్లో ఏడు రోజుల పాటు ఈ శిబిరాలను ఏర్పాటు చేశాం" అని చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (సీఎంహెచ్ఓ) డాక్టర్ మమతా తిమోరీ తెలిపారు. బండా బ్లాక్‌లోని పటాన్, దౌరా, బమూరా, ఫతేపూర్ పాటు షహగఢ్ బ్లాక్‌లోని సొరాయి, గుగ్రా ఖుర్ద్, దిలోనా, ఖటోరా ఖుర్ద్, బుద్ధా, ఘుర్యాల్‌లతో సహా అనేక ప్రాంతాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. బుందేల్‌ఖండ్ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న వారిలో, తీవ్రమైన దృష్టి సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు రోగులను ప్రత్యేక చికిత్స కోసం భోపాల్ ఎయిమ్స్‌కు పంపించినట్లు డాక్టర్ పటేరియా పేర్కొన్నారు. కొంతమంది బాధితులు కల్తీ మద్యం సేవించామా లేదో స్పష్టంగా ధ్రువీకరించడానికి సంకోచిస్తున్నారని వైద్యులు పేర్కొన్నారు.

# టీవీవీపీకి కొత్త కమిషనర్

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర
- టీజీజీడీఏ ప్రతినిధులకు మంత్రి హామీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)కి కొత్త కమిషనర్ రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. వైద్యులు, ఆసుపత్రుల సమస్యలపై మంత్రిని కలిసిన తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీజీజీడీఏ) బృందానికి మంత్రి ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ ఏడాది మే 31 డా. అజయ్ కుమార్ టీవీవీపీ కమిషనర్ గా రిటైర్ అయ్యాక ఇప్పటి వరకు కమిషనర్ నియామకం జరగలేదు. దీంతో ఇదే శాఖకు చెందిన ఓ యూనియన్ లీడర్ షాడో కమిషనర్ గా వ్యవహరిస్తూ టీవీవీపీలో అంతా తన ఇష్టానుసారంగా చేస్తున్న తీరుపై దిశ దినపత్రికలో ఈ నెల 24 టీవీవీపీలో షాడో కమిషనర్ పేరిట కథనం వెలువడిన సంగతి తెలిసిందే. ఈ కథనంతో వైద్య, ఆరోగ్య శాఖలో కదలిక వచ్చిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఎందరో సీనియర్లను కాదని ఓ యూనియన్ లీడర్ కు ఎలాంటి రాతపూర్వక ఉత్తర్వులు లేకుండానే దాదాపుగా కమిషనర్ స్థాయి అధికారాలు అప్పగించడంపై టీవీవీపీ వైద్యులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారు. పదోన్నతుల్లో అడ్డగోలుగా వ్యవహరించడంతో పాటు, బదిలీల్లో సైతం పెద్ద ఎత్తున అక్రమాలకు సదరు షాడోనే కారణమని వైద్యులు భగ్గుమంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సైతం ఈ అంశంపై సీరియస్ గా దృష్టిపెట్టింది. కమిషనర్ నియామకం ఆలస్యంపై మంత్రి సైతం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. దీంతో ఉన్నతాధికారులు ఈ ఫైల్ ను కదిలించారని, అందుకే అక్టోబర్ మొదటి వారంలో కమిషనర్ నియామకం ఉంటుందని టీజీజీడీఏ ప్రతినిధి బృందానికి మంత్రి వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సమస్యలతో పాటు రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సి. దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. టీజీజీడీఏ రాష్ట్ర బృందం శుక్రవారం మంత్రిని కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా టీవీవీపీ కమిషనర్‌ను అక్టోబర్ మొదటి వారంలోనే నియమించనున్నట్లు మంత్రి ప్రతినిధి బృందానికి స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 డీఎంహెచ్ఓ పోస్టులను వెంటనే మంజూరు చేయాలని, అర్హులైన సివిల్ సర్జన్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని అసోసియేషన్ నేతలు కోరారు. డీఎంఈ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అడిషనల్ డైరెక్టర్లు, అర్హులైన ప్రొఫెసర్ల పదోన్నతుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు నిరంతరాయంగా అందేందుకు వీలుగా పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బడ్జెట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని విన్నవించారు. ఈ అంశాలన్నింటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, పెండింగ్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. త్వరలోనే టీజీజీడీఏతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంశాలను సమగ్రంగా చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని టీజీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. బి నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ లాలు ప్రసాద్ రాథోడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి షార్ట్‌ఫిల్మ్ పోటీలో జీడీసీ హయత్‌నగర్ విద్యార్థికి ప్రథమ బహుమతి

**ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు**




**హయత్‌నగర్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జీడీసీ) హయత్‌నగర్‌కు చెందిన యువ టూరిజం క్లబ్ విద్యార్థులు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పా రామంలో నిర్వహించిన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు అధ్యాపకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ పోటీలో జీడీసీ హయత్‌నగర్ విద్యార్థి ఉపేందర్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఉపేందర్ అవార్డును అందుకున్నారు. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు ఉపేందర్‌ను అభినందించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యాటక పోటీలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. శిల్పారామం సందర్శన ద్వారా పర్యాటకం, చారిత్రక వారసత్వం, కళలు, హస్తకళలు, తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రాధాన్యతపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన లభించింది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వివిధ యువ టూరిజం క్లబ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మ్యూజియమ్స్ శాఖ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి పర్యాటక రంగ అభివృద్ధి, చారిత్రక వారసత్వ పరిరక్షణ, తెలంగాణ సంస్కృతి, పర్యాటక రంగంలో యువత పాత్రపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ మెహబూబ్, కళాశాల కో-ఆర్డినేటర్ డా. నోముల వెంకటేశ్వర్లు, డా. కృష్ణమోహన్, లెఫ్టినెంట్ డా. ధన్‌రాజ్, డా. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. యువ టూరిజం క్లబ్ ద్వారా విద్యార్థులను పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేస్తున్న కళాశాల బృందాన్ని పలువురు అభినందించారు.

## తెలంగాణ ఉద్యమ జానపద కళాకారుడు రెడ్డి పోశం కన్నుమూత



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 26, (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ జానపద, తెలంగాణ ఉద్యమ కళాకారుడు రెడ్డి పోశం తీవ్ర అనారోగ్యంతో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం శనివారం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధుకర్ ఆకెనపల్లిలోని పోశం నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన ఆట, పాటలతో ప్రజలను చైతన్యపరిచిన గొప్ప కళాకారుడు రెడ్డి పోశం అని కొనియాడారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయం తెలిసిన వెంటనే, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్ గత 10 రోజుల క్రితమే రూ. 10,000 ఆర్థిక సాయం అందించినట్లు గుర్తుచేశారు. రెడ్డి పోశం మృతి జానపద కళారంగానికి, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ కళాకారుల లోకానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జంజర్ల దినేష్ కుమార్, అడపు సమ్మయ్య, కుమార్ పాల్గొన్నారు.

## పింఛన్ కోసం వెళ్తుండగా విషాదం

- రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి!




**బాలానగర్, సెప్టెంబర్ 26(జనంసాక్షి) :** పింఛన్ తీసుకునేందుకు బైక్‌పై వెళ్తున్న ఓ వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాద ఘటన బాలానగర్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట తండాకు చెందిన హూనియా (74) పింఛన్ కోసం బైక్‌పై వెళ్తుండగా కేతిరెడ్డిపల్లి జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హూనియాకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హూనియాను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు.

## గ్రామ పంచాయతీ, వీఓ అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**మావల సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** జిల్లాలో వివిధ దశల్లో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ, వీఓ అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, సర్పంచులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మధ్యలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనాల పనులను వెంటనే పునఃప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలు ప్రారంభం కాని భవనాల మంజూరులను రద్దు చేసి, ఉపాధి హామీ పథకం, బీవీజీ రాష్ట్ర లేదా ఇతర ప్రత్యామ్నాయ నిధుల ద్వారా కొత్తగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులతో మంజూరై మధ్యలో నిలిచిపోయిన పనులను పరిశీలించి, అవసరమైన చోట మంజూరులను రద్దు చేసి ప్రత్యామ్నాయ నిధులతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభమై వివిధ దశల్లో నిలిచిపోయిన జీపీ భవనాలను మరమ్మతుల కింద చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీఓ భవనాల నిర్మాణాలను అక్టోబర్‌లోగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ నవంబర్ 15లోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులకు సంబంధించి వేజ్ జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఉపాధికి అనుగుణంగా పనులు కల్పించాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో అవసరమైన తీర్మానాలు పూర్తిచేసిన అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, పంచాయతీ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈలు శివరాం, తనాజీ, ఇంజినీరింగ్ అధికారులు, వివిధ మండలాల సర్పంచులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్.
- టైర్-1, 2, 3లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులు అమలు చేసేలా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక
- టెండర్ల ప్రక్రియలో జాప్యం లేకుండా పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభించాలి
- కాంట్రాక్టర్లు టెండర్లకు స్పందించేలా చర్యలు చేపట్టాలి
- గోదావరి పుష్కరాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 26(జనంసాక్షి) :** గోదావరి పుష్కరాల సందర్భంగా టైర్-1, 2, 3లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులు అమలయ్యేలా అవసరమైన కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతిపాదనలు, పరిపాలనా ప్రక్రియలకే పరిమితం కాకుండా వీలైనంత త్వరగా పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించి పూర్తి అయ్యే విధముగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శనివారం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య, కమిషనర్ హనుమంతరావుతో కలిసి సంబంధిత జిల్లా కలెక్టర్లతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ములుగు సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల కోసం టైర్-1,2,3లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేసి, పనులు క్షేత్రస్థాయిలో వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ కు సంబంధించి ఆమోదం పొందిన ప్రతిపాదనల ప్రకారం పనులు ప్రారంభించాలని ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా అవసరమైన కార్మికులు, నిర్మాణ సామగ్రిని ముందుగానే సమీకరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, పనుల్లో ప్రతి చిన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని నాణ్యతతో పాటు నిర్ణీత సమయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. టెండర్లకు కాంట్రాక్టర్లు స్పందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే, మంత్రులతో కూడా సమన్వయం చేసుకొని పనులకు సంబంధించిన ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. టెండర్ల పేరుతో పనులు ఆలస్యం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి అంశాన్ని ముందుగానే పరిష్కరించుకొని పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల పనులన్నీ నిర్ణీత సమయంలోగా పూర్తి చేయడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసు నుంచి ముస్లిం పర్సనల్ చట్టం రక్షణ కల్పించదు

- ఢిల్లీ హైకోర్టు


**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** పోక్సో కేసు నుంచి ఒక నిందితుడికి ముస్లిం పర్సనల్ లా వివాహం రక్షణ కల్పించలేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. 18 ఏళ్ల లోపు యువతిని వివాహం చేసుకుని, లైంగిక చర్యకు పాల్పడిన వ్యక్తిపై పోక్సో చట్టం లేదా బీఎన్ఎస్ కింద చర్యలు తీసుకోకుండా ముస్లిం పర్సనల్ లా అడ్డుకోలేదని కోర్టు వివరించింది. జస్టిస్ సంజీవ్ నారులా ఆధ్వర్యంలోని ఢిల్లీ హైకోర్టు బెంచ్ ఒక కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిపై బీఎన్ఎస్ సెక్షన్ 64(1), సెక్షన్ 6, పోక్సో యాక్ట్ కింద దాఖలైన కేసును కొట్టివేయాలంటూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశాడు. వ్యక్తిగత, మత పరమైన చట్టాలను ఉపయోగించి ఒక వ్యక్తిపై దాఖలైఐన పోక్సో కేసును కొట్టివేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితుడి క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. 18 ఏళ్ల లోపు వారిని వివాహం చేసుకునేందుకు ముస్లిం పర్సనల్ లా అనుమతించినంత మాత్రాన ఆ వివాహాన్ని గుర్తించలేమని, ఆ భార్యతో జరిపే లైంగిక చర్యను పోక్సో నుంచి రక్షణ కల్పించలేమని కోర్టు తెలిపింది.

**భర్తకు 28.. భార్యకు 16**

ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. 16 ఏళ్ల 3 నెలల వయసున్న ఒక బాలికను 28 ఏళ్ల ఒక యువకుడు వివాహం చేసుకున్నాడు. వారి కలిసి ఉంటున్నారు. వారి కాపురం ఫలితంగా భార్య కొంతకాలానికి గర్భం దాల్చింది. దీంతో గర్భధారణ పరీక్షల కోసం ఆ బాలిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లింది. దీంతో ఆస్పత్రి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. వైద్యులు వారికి ఉన్న నిబంధనల ప్రకారం ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా పోలీసులు బాలిక భర్తపై పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో బెయిల్ కోరుతూ ఆ భర్త కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ సందర్భంగా గర్భ దాల్చిన మైనర్ భార్య తన భర్తకు మద్దతుగా నిలిచింది. తన ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నానని, ఇష్టంతోనే గర్భం దాల్చానని చెప్పింది. ఈ విషయంలో ఎవరి బలవంతం లేదని కోర్టుకు తెలిపింది. తమ చట్టాల ప్రకారం ఇది చెల్లుబాటు అవుతుందని వాదించింది. దీంతో తన భర్తకు బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరింది. అయితే, దీనికి కోర్టు నిరాకరించింది. 18 ఏళ్ల లోపు యువతిని వివాహం చేసుకున్నా, ఆ తర్వాత లైంగిక చర్యకు పాల్పడి గర్భం దాల్చేందుకు కారణమైతే భర్త అయినా, ఎవరైనా సరే చట్ట ప్రకారం శిక్షార్హులే అని కోర్టు తెలిపింది. ఇతర చట్టాలు దీన్నుంచి రక్షణ కల్పించలేవని వ్యాఖ్యానించింది. నిందితుడి బెయిల్ పిటిషన్, క్వాష్ పిటిషన్‌ను కొట్టేసింది.

## వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రత్యేక కార్యక్రమాలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి , సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** వయోవృద్ధుల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, సంక్షేమ శాఖ అధికారులతో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం--2026 ను పురస్కరించుకొని వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, డిజిటల్ అవగాహన, సామాజిక అనుసంధానం, చట్టపరమైన హక్కులు, సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 28న సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, వయోవృద్ధులపై వేధింపుల నుంచి రక్షణపై అవగాహన, 29న తరతరాల మధ్య అనుబంధం, పరస్పర అభ్యాసం కార్యక్రమాలు, 30న చురుకైన వృద్ధాప్యం, ఆరోగ్య పరిరక్షణ, వాకథాన్, అక్టోబర్ 1న రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం--2007, నియమాలు--2011 ప్రకారం వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న హక్కులు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వయోవృద్ధులపై నిర్లక్ష్యం, వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్ 14567 కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, పోలీస్ హెల్ప్‌లైన్ 100ను సంప్రదించవచ్చని తెలిపారు. వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ గౌరవం, భద్రత, సహకారం అందిస్తూ వారి సంతోషకరమైన, ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడాలని తెలిపారు. శనివారం వృద్ధాప్య గృహాల కోసం సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఉచిత మెగా శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. వైద్య శిబిరంలో వయోవృద్ధులకు బి.పి., షుగర్, కంటి పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించడం జరిగిందని, వయస్సుతో వచ్చే కీళ్ల నొప్పులు, మానసిక ఒత్తిడి, జ్ఞాపకశక్తి సంబంధిత సమస్యలపై వైద్యులు కౌన్సెలింగ్ అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.



## ఏసీబీకి చిక్కిన సీడీపీవో..

- రూ.63 వేలు లంచం తీసుకుంటూ పట్టివేత

**జగిత్యాల (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారిణి దరోజు పద్మా అవినీతికి పాల్పడుతూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మండల కేంద్రంలో ఉన్న 21 అంగన్‌వాడీల తనిఖీ సందర్భంగా వ్యతిరేకంగా నివేదికలు తయారు చేయవద్దని కోరినందుకు సీడీపీవో లంచం డిమాండ్ చేశారని ఏసీబీ అధికారులు వివరించారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నెలకు వెయ్యి రూపాయల చొప్పున మూడు నెలలకు కలిపి 63 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించడం తో శనివారం రూ. 63 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరుపరిచామని వెల్లడించారు.

## గిరిజన సంక్షేమంపై కోవా లక్ష్మి కీలక ప్రతిపాదనలు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** గిరిజన సంక్షేమ కమిటీ హైదరాబాదులో శనివారం జరిగిన తొలి సమావేశంలో ఎమ్మెల్యే కోవా లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్య, మౌలిక వసతులు, బడ్జెట్ కేటాయింపులు తదితర అంశాలపై పలు ప్రతిపాదనలు చేశారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన నేపథ్యంలో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు రాబోయే చలికాలంలో విద్యార్థులకు వేడినీటి సదుపాయం కోసం గీజర్లు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో పనిచేస్తున్న సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతన స్కేలు అమలు చేయాలని, అనివార్య కారణాలతో మృతిచెందిన సీఆర్టీల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని సూచించారు. ఇంజినీరింగ్ శాఖలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, కల్వర్టుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఎస్టీ నియోజకవర్గాల్లో జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు జరగాలని, గిరిజన జనాభా తక్కువగా ఉన్న ప్రాంతాలకు అధిక నిధులు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గాదిగూడ, నార్నూర్ మండలాల్లో గిరివికాసం కింద మంజూరైన బోర్‌వెల్లకు మోటార్లు బిగించాలని, లింగాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు అటవీ అనుమతులు త్వరగా మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

సంపాదకీయం

# న్యాయస్థానం ముందే మహిళపై దాడి

## లాయర్లు.. పోలీసులు ప్రేక్షకులు!

న్యాయం కోసం న్యాయస్థానం గడప తొక్కిన మహిళకే అక్కడ భద్రత లేకపోవడం అత్యంత ఆందోళనకరం. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ ఫ్యామిలీ కోర్టులో పోలీసులు, లాయర్లు చూస్తుండగానే ఓ మహిళపై ఆమె భర్త, అతని బంధువులు దాడికి పాల్పడిన ఘటన న్యాయస్థానాల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. వైవాహిక వివాదంలో భరణం కోసం కోర్టును ఆశ్రయించిన మహిళ తన తండ్రి, సోదరితో కలిసి కోర్టుకు వచ్చిన సమయంలో వెనుక నుంచి దాడి చేయడం, కిందపడేసి గొంతు నులిమేందుకు ప్రయత్నించడం మరింత ఆందోళన కలిగించే విషయం. న్యాయం కోరుతూ వచ్చిన చోటే బాధితురాలు మరోసారి హింసకు గురైతే, సాధారణ మహిళలు తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది.

ఈ ఘటనలో అత్యంత బాధాకరమైన అంశం దాడి జరగడమే కాదు.. న్యాయస్థాన ప్రాంగణంలోనే దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు, న్యాయవాదులు అక్కడే ఉండటం. కోర్టు అనేది సామాన్యుడికి చివరి ఆశ్రయం. అక్కడ చట్టం, భద్రత, న్యాయం కనిపించాలి. కానీ న్యాయం కోసం వచ్చిన వ్యక్తిపై కోర్టు ఆవరణలోనే దాడి జరిగితే అది కేవలం ఒక కుటుంబ వివాదంగా చూడలేం. న్యాయస్థానాల భద్రతా వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోందన్న ప్రశ్నను కూడా ఇది ముందుకు తెస్తుంది.

కుటుంబ కోర్టుల్లో భరణం, గృహహింస, విడాకులు వంటి సున్నితమైన కేసులు విచారణకు వస్తుంటాయి. ఇరుపక్షాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తతలు ఉండే అవకాశం ఉన్నందున బాధితులు, ముఖ్యంగా మహిళలకు తగిన భద్రత కల్పించడం అత్యంత కీలకం. కోర్టు ప్రాంగణంలోకి ప్రవేశించే వారి పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది అప్రమత్తత, సున్నితమైన కేసుల్లో ఇరుపక్షాలను వేర్వేరుగా నిర్వహించడం వంటి ముందస్తు చర్యలు ఉండాలి. ఘటన జరిగిన తర్వాత నిందితులను అరెస్టు చేయడం అవసరమే అయినా, దాడి జరగకుండా ముందే అడ్డుకోవడమే అసలైన బాధ్యత.

న్యాయస్థానం అంటే భయపడాల్సిన ప్రదేశం కాదు.. భరోసా పొందాల్సిన ప్రదేశం. అక్కడే మహిళకు రక్షణ లేకపోతే న్యాయవ్యవస్థపై సామాన్యుల్లో ఆందోళన పెరగడం సహజం. మహారాజ్‌గంజ్ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా న్యాయస్థాన ప్రాంగణాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించాల్సిన అవసరం ఉంది. న్యాయం కోసం కోర్టు గడప తొక్కే ప్రతి మహిళకు అక్కడ భద్రత ఉందనే నమ్మకం కలిగినప్పుడే న్యాయవ్యవస్థపై విశ్వాసం మరింత బలపడుతుంది.

# ఉద్యమాల జంగ్ సైరన్ విమలక్క

**సమస్త రంగాలను పురుషాధిపత్యమే ఆక్రమించిన సమాజం మనది. అందుకు సాంస్కృతిక ఉద్యమం కూడా మినహాయింపు కాదు. అందుకే మహిళా కళాకారులను గురించి మాట్లాడాల్సి వస్తే పిడికెడు మంది కూడా గుర్తుకు రారు. ఇది సాంస్కృతిక సంస్థల ఫెయిల్యూర్! సమాజంలోనే కాదు, సాంస్కృతిక సంఘాల్లోను వేళ్ల మీదికే పరిమితం చేయబడ్డారు మహిళలు, మహిళా కళాకారులు. ఇలాంటి నేపథ్యంలో సకల ఆధిపత్యాలను ధిక్కరిస్తూ తారాజువ్వలా దూసుకువచ్చిన ఎర్రెర్రని గానం విమలక్క. పాటను తూటాలా పేల్చగలిగిన శక్తిసామర్థ్యాలు కలిగిన విమలక్క పాటకు యాభై యేళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఆ పాటల కోయిల కృషిని, పోషించిన పాత్రను తప్పకుండా ఈ సందర్భంగా బేరీజు వేసుకోవాలి. ఆగిపోని, అలసిపోని ఆ మహా కళాకారిణికి ఈ సమాజం ఎంతో బాకీ పడింది. ఆమె, ఆమెలాంటి ప్రజాకళాకారులు గొంతెత్తి దుంకి ఆడకుంటే ఇంతటి ప్రజాచైతన్యం ఎక్కడో ఆగిపోయేది. అరుణోదయ సాంస్కృతిక పతాకను అంతెత్తున ఎగరేసిన పాటల పోరాటకెరటం తాను. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిందంటే అందులో విమలక్క పాట పోషించిన పాత్ర చారిత్రాత్మకమైంది.**



### అరుదైన కళాకారిణి

దేశంలోనే అరుదైన సాంస్కృతిక కార్యకర్త విమలక్క. బంద్రు నర్సింహులు బిడ్డగా చిన్ననాటి నుండే విప్లవదారిలో నడిచిన నేపథ్యం తనది. పూర్వ నల్లగొండ జిల్లా ఆలేరు మట్టి అందించిన చైతన్యంతో ప్రజాపోరాటాల్లోకి దూసుకు వచ్చింది. విద్యార్థి దశ నుండే ప్రగతిశీల బాట నడిచింది. తనదైన ముద్రను వేయగలిగింది. అలా మొదలైన పాటల ప్రవాహగానం ఇవాళ ఈ దశకు చేరింది. విమలక్క పాటందుకుంటే ఒక సన్నని సెలయేరులా మొదలై, ఉప్పొంగే జలపాతంలా మనల్ని ఆవహిస్తు ంది. వింటున్న వారిలో ఆలోచనల్లో అలజడులు రేపుతుంది. రక్తాన్ని మరిగించి మెదళ్లను సాయుధం చేస్తుంది. మన భుజాల మీద మిగిలే ఉన్న కర్తవ్యాన్ని బోధిస్తుంది. దోపిడి పాలకుల గుట్టును విప్పుతుంది. దోచుకుంటున్న పెట్టుబడిదారుల కుట్రల మీదికి సివంగిలా దుంకుతుంది. జైలుకైనా సరే సై అంటుంది.

విమలక్క గొంతులో బాధితుల ఆర్తనాదాల ఆకలి మంట ఉంటుంది. దగాపడ్డ పీడితుల తిరుగుబాటు ధిక్కారం ఉంటుంది. అందుకే ఆమెకు 'ప్రజాగాయిని' అనే గుర్తింపు దక్కింది. గద్దర్ తరువాత పాటను ప్రదర్శన కళగా మలిచింది విమలక్క బృందమే. ఎర్రని జెండా పిడికిట ఎత్తిపట్టి చిన్నారి చెల్లెల్ల గుంపుతో తాను వేదిక మీదికి వచ్చేటప్పుడు, తల్లికోడిని తలపిస్తుంది విమలక్క. అలా పెనుమంటల సవ్వడిలో, పాటల జడివానై కురుస్తుంది. పాటకు పర్యాయపదంగా జీవించింది. వేదన పెల్లుబికె గుండెల్లో పిడికెడు భరోసాను నింపే ధైర్యమయ్యింది. దిక్కుమొక్కులేని జనం పక్షాన గొంతెత్తి నిలబడ్డప్పుడు పెద్దదిక్కయి గర్జించింది. ఉద్యమాలు, పోరాటాల మీదుగా కొత్తపొద్దయి పొడిసింది విమలక్క. తెలంగాణ ఉద్యమకాలానికి ధూంధాం వేదికల మీద అరుణారుణ కిరణపు మోదుగుపువ్వై నిలిచింది. నాట్లేసే కూలితల్లుల ఆహార్యంలో ఎర్రచీర కట్టి, భుజాన గొంగడేసి గంతులేసి పాటల మత్తడి దుంకింది. ప్రజా ఉద్యమాలకు గొంతుకను ఇచ్చిన అక్కలు, చెల్లెలందరి స్వరమై ముందుకొచ్చిన ప్రతిఘటనా భాస్వరం. సభానంతర సాంస్కృతిక కాలాల దగ్గరి నుండి ముఖ్య అతిథిగా పాటల నాయకు రాలునే పిలవాలని జనం తలిచేలా నిలిచింది ఆమె కార్యాచరణ. అందుకే ఆమె విమలక్క.

### సవాళ్లను అధిగమించి...

భారత దేశ సాంస్కృతిక ఉద్యమాల చరిత్రలో మహిళా కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవాలు దక్కలేదు. జానపదంలో ఒక జీతెన్ భాయి, తెలంగాణ పోరాటంలో బెల్లి లలిత ఇట్లా కొందరే కనిపిస్తారు. పితృస్వామ్య, కులస్వామ్య కంచెలన్నీ దాటుకుని నిలబడ్డది విమలక్క. సమాజ అడ్డుగోడలనే కాదు, సాంస్కృతిక అడ్డుగోడల సవాళ్లను సైతం బద్ధలు కొట్టింది. ఎక్కడ పాట అవసరం ఉంటే అక్కడ వాలిపోయింది. గడిచిన యాభై యేళ్ల కాలంలో ఆమె పాటల ప్రయాణానికి విరామం అన్నదే లేదు. రాజ్యం ఎన్ని నిర్బంధాలు పెట్టినా ఆ సంకెళ్లను తెంచుకుని ఆడిపాడింది. తన పాటను నిషేధించాలనుకున్నా, తన ఆఫీసుకు తాళాలు వేసి ముట్టడించినా, అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపినా నిరాశ చెందలేదు. అంతే ఆక్రోశంతో 'కాలంబు రాగానే కాటేసి తీరాలె'అంటూ పాటందుకుంది.

ఒక గొంతు ఇంత సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమాల్లో నిలబడి ఉండడం అంటే మాటలు కాదు. చాలా మంది మహిళాకళాకారులు ఎక్కడో ఒక చోట ఆగిపోక తప్పదు. మన పురుషాధిక్య సమాజం వారిని అలా కట్టడి చేస్తుంది. పెళ్లి, కుటుంబ బాధ్యతలనే బరువులను తల మీదికి ఎత్తి నాలుగు గోడల మధ్యన బందీని చేస్తారు. 'మాజీ కళాకారిణి' అనే ట్యాగ్ తలిగిస్తారు. విమలక్క మాత్రం ఏనాడు రాజీపడింది లేదు. తన సహచరుడు మిత్ర అందించిన పాటల అంబుల పొదిని భుజానేసుకుని శత్రువుల గుండెల్లో ముచ్చెమటలు పోయించింది. లక్షలాదిమందిని కదిలించింది. ఊరూర ప్రజా చైతన్యానికి జీవం పోసింది. పాటలోనే బతుకును చూసుకుంది. పోరాటమే తన చిరునామాను చేసుకుంది. మానని గాయాల పల్లేరు ముళ్లను దాటుకుంటూ ముందుకు సాగింది. తనను తాను మరిచి ఉద్యమాలకే అంకితమై సాగింది. అందుకే తెలంగాణలో విమలక్క పాటలేని ఉద్యమాలను ఊహించలేం. రాష్ట్ర సాధనను కలగనలేం.

### పోరాటాల పాలికేక

అరుణోదయ బృందగానానికి ఎనగర్ర విమలక్క. సందర్భానికి తగినట్టుగా ఏ పాట పాడాలి? ఎలా పాడాలి? వింటున్న బాధితులు ఎవరు? వారి బాధ ఏమిటి? దానికి విముక్తి ఏమటనే ఆలోచన తన మెదళ్లో క్షణాల మీద జరిగిపోతుంది. అలా పాటలో లీనమైపోతుంది. పాట ముగింపుకు వచ్చేసరికి ఆమె పిడికిలి బిగుసుకుంటుంది. అది చూసిన జనాల పిడికిళ్లు సైతం బిగుసుకుంటాయి. అట్లా జనాన్ని మారుస్తూ, పోరాటాలకు సన్నద్ధం చేస్తూ సాగిన విమలక్క పయనానికి తెలుగు నేలే కాదు, యావత్ దేశమే సాక్ష్యం. అడవులు, మైదనాలు ఆమె పాటకు పులకించాయి. తెలంగాణ ఉద్యమ వేదికలు వేడెక్కాయి. అణగారిన జాతుల అస్తిత్వ పోరాటాలు పదునెక్కాయి.

అరవైయేండ్ల ఆకలి మంటల పోరాటం తెలంగాణ ఉద్యమం. ఆ ఉద్యమంలో వందలాది సభల్లో విమలక్క "ఆడుదాం డప్పుల్ల దరువెయ్రా" అని గళం ఎత్తిత్తే, ఇక తెలంగాణ తప్పకుండా వస్తుందనే భరోసా కలిగింది. "ఛలో ధూంధాం తెలంగాణ జాతరొచ్చెరా/మత్తడి దునికి అలుగు తన్నుకుని పారినట్టు/మెత్తని గుండెలు సైతం నగారై మోగినట్టు..."అంటూ అంతెత్తున దునికి పాడుతుంటే లడాయికి లగాంచి దునుకాలనిపించింది. అదీ విమలక్క పాటకున్న సమ్మోహన శక్తి. సమైక్య పాలకుల కపట ప్రేమకు తెలంగాణ వట్టిపోయిన దు:ఖానికి పల్లవి, చరణం విమలక్క పాటే. పాలమూరు బతుకులు వసివాడిపోయాయని "పల్లె పల్లెన పల్లేర్లు మొలిసే పాలమూరులోన"అని విమలక్క పాడితే జనం ఇల్లుదాటి, పల్లెదాటి రోడ్ల మీదికొచ్చింది. "సినుకూ సినుకు తడిసిన నేలన చిత్రమైన వాసన" అంటూ విమలక్క పాటెత్తుకుంటే మట్టిపరిమళం మన ముక్కుపుటలను తాకుతుంది. ఆ గొంతులో మబ్బుపట్టిన వానాకాలం మన మనసులోకి వచ్చి నిలుస్తుంది. కాసేపు మైమరిపోయేలా చేస్తుంది ఆమె గొంతు. విమలక్క పాటల్లోనే కాదు, తన ఆచరణలోనూ ఒక ప్రజాస్వామిక దృక్పథం ఉంది. బాధితుల పక్షాన నిలబడాలనే తపన తన జీవలక్షణంగా మార్చుకుంది. అది తన రోజువారి జీవితంలో భాగం చేసుకుంది. అందుకే దగాపడ్డ దళితుల కోసం 'పాటసాయం'చేసి మద్దతుగా నిలబడ్డది. "మాదిగోళ్ల డప్పులొచ్చెనే...మానవహక్కుల దండోరేసి" అంటూ మండే మాదిగ డప్పై మోగింది విమలక్క. సమాజ మార్పు కోసం తప్పకుండా "ఎవరో ఒకరు ఎపుడో అపుడూ..."తప్పకుండా పుడుతూనే ఉంటారనే నమ్మకాన్ని తన గొంతులో పలికిస్తుంది.

ఈ యాభై యేళ్ల పాటల ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన ప్రజాగాయని విమలక్క. ఇంకా ప్రజాక్షేత్రంలో తన గొంతునే ఆయుధంగా ఉద్యమిస్తున్న అంకితభావానికి జేజేలు. బహుజన బతుకమ్మై ఊరూర పోరుముగ్గులు పోస్తున్న ఈ నిరంతర పాటల యుద్ధానికి జై భీమ్లు! ప్రజా కళల జాతరకు పరిపరి దండాలు!!

(విమలక్క పాటకు యాభై యేళ్లు నిండినవేళ..
యాభై గంటల పాటు "ప్రజాకళల జాతర"నిర్వహిస్తున్న సందర్భంగా)



డా.పసునూరి రవీందర్
రచయిత, సామాజిక విశ్లేషకులు
సెల్ నంబర్ : 7702648825

# సంచలనం రేపుతున్న మహిళా జర్నలిస్టులు: ప్రశ్నించే కలం, గళం





రితికా చోప్రా పేరు ఇప్పుడు భారతీయ జర్నలిజంలో మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్లో ఆమె నేతృత్వంలో వెలువడిన తాజా పరిశోధనాత్మక కథనాలు భారత ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై తీవ్రమైన ప్రశ్నలను ప్రజల ముందుంచాయి. ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు-సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి-గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో నిర్ణయాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరా లు వ్యక్తం చేశారని ఆ దర్యాప్తు వెల్లడించింది. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ, ఓటర్ల డేటాబేస్‌పై నియంత్రణ, ఎన్నికల సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలపై ఆ అభ్యంతరాలు ఉన్నాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అంతర్గత పత్రాలను పరిశీలించి వెల్లడించింది.

ఇది ఒక్క సంచలన కథనం కాదు. రితికా చోప్రా దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయాలు, ప్రభుత్వ పాలన, ప్రజా విధానాలు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలపై దృష్టి కేంద్రీకరించిన జర్నలిస్టు. కోల్‌కతాలో పుట్టిన ఆమె 2006లో హిందుస్తాన్ టైమ్స్‌లో ఇంటర్న్‌గా జర్నలిజం ప్రారంభించారు. తరువాత మైల్ టుడే, ది ఎకనామిక్ టైమ్స్ రాజకీయ బ్యూరోలో పనిచేసి, 2015లో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్లో చేరారు. అక్కడ జాతీయ విద్యా సంపాదకురాలిగా, ప్రభుత్వ వ్యవహారాల జాతీయ బ్యూరో చీఫ్‌గా, జాతీయ విద్యా ఎడిటర్‌గా పనిచేసి, ప్రస్తుతం ముంబై రెసిడెంట్ ఎడిటర్‌గా ఉన్నారు.

ఆమెకు వచ్చిన అవార్డుల జాబితా కూడా ఆమె జర్నలిజం విస్తృతిని తెలియజేస్తుంది. 2021లో రాజకీయాలు, ప్రభుత్వంపై రిపోర్టింగ్‌కు రామ్‌నాథ్ గోయెంకా ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అవార్డు పొందారు. 2022లో ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్--ఇండియా అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం లభించింది. 2024లో గ్రీష్మా కుతార్‌తో కలిసి చామేలీ దేవి జైన్ అవార్డు అందుకున్నారు. అంతకుముందు హర్యానా పంచాయతీ ఎన్నికల్లో నిరక్షరాస్యుల పోటీపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభావాన్ని పరిశీలించిన కథనానికి యూఎన్‌ఎఫ్‌పీఏ--లాడ్లీ మీడియా అవార్డు, ఇంజినీరింగ్ విద్య నాణ్యతపై "డీవాల్యూడ్ డిగ్రీ" సిరీస్‌కు ఏసీజే ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం అవార్డ్స్‌లో ప్రత్యేక ప్రస్తావన లభించాయి. ది ఎకనామిక్ టైమ్స్ పనిచేసిన సమయంలో కూడా ఆమెకు రెండు వర్డ్‌స్మిత్ అవార్డులు లభించాయి.

రితికా చోప్రా ప్రత్యేకత ఏమిటంటే, రాజకీయ నాయకుల ప్రకటనలను మాత్రమే వార్తలుగా మార్చడం కాదు; అధికార వ్యవస్థ లోపల ఏం జరుగుతుందో పత్రాలు, అధికారిక రికార్డులు, నిర్ణయ ప్రక్రియలను అనుసరించి వెలికి తీయడం. ఎన్నికల సంఘంపై ఆమె గత పరిశోధనలకు 2021 రామ్‌నాథ్ గోయెంకా అవార్డు రావడం కూడా దీనికి ఉదాహరణ. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం పని తీరు, మోడల్ కోడ్ ఉల్లంఘనలపై చర్యల్లో కనిపించిన ఆలస్యం, కమిషన్‌లోని విభేదాలపై ఆమె చేసిన ప్రత్యేక కథనాలకు ఐపీఐ అవార్డు లభించింది.

తాజా దర్యాప్తులో కూడా అదే పద్ధతి కనిపిస్తుంది. 'ఫాం -6' లో కొత్త ఓటర్ల నుంచి తల్లిదండ్రులు, తాతముత్తాతల వివరాలకు సంబంధించిన కొత్త ప్రకటనను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు అంతర్గత రికార్డులను ఆధారంగా చేసుకుని ఆమె వెల్లడించారు. మరో కథనంలో ఓటర్ల జాబితా నిర్వహణకు ఉపయోగించే "ఈసీఐ- నెట్" సాఫ్ట్‌వేర్, దాని కేంద్రీకృత నియంత్రణపై కమిషనర్ల ఆందోళనలను వెలుగులోకి తెచ్చారు. గోవాలో సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన ఓటర్లు జాబితాలోకి రాలేకపోయిన ఘటనను కూడా ఆమె పరిశీలించారు.

తెలుగు జర్నలిజంలో సీనియర్ జర్నలిస్టు సి. వనజ ప్రయాణం కూడా మహిళా జర్నలిస్టులు ఎదుర్కొన్న అడ్డంకులకు ఒక ఉదాహరణ. రాజకీయ రిపోర్టింగ్‌లో మహిళలకు అవకాశాలు పరిమితంగా ఉన్న కాలంలో ఆమె ఆ రంగంలోకి వచ్చారు. అసెంబ్లీ, రాజకీయ పరిణామాలపై రిపోర్టింగ్ చేస్తూ తన స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. దండకారణ్యంలో మావోయిస్టుల 'జనతన సర్కార్' పై చేసిన రిపోర్టింగ్‌కు రామ్‌నాథ్ గోయెంకా అవార్డు రావడం ఆమె పరిశోధనాత్మక జర్నలిజానికి గుర్తింపు.

తులసీ చందు సంప్రదాయ మీడియా నుంచి డిజిటల్ జర్నలిజం వైపు వచ్చిన మరో ముఖ్యమైన ఉదాహరణ. రాజకీయాలు, మత సామరస్యం, అవినీతి, సామాజిక సమస్యలపై ఆమె స్వతంత్రంగా వీడియో విశ్లేషణలు చేస్తూ పెద్ద ప్రేక్షక వర్గాన్ని ఏర్పరచుకున్నారు. అదే సమయంలో ఆన్‌లైన్‌లో తీవ్రమైన వేధింపులు, బెదిరింపులను ఎదుర్కొన్నట్లు మీడియా సంస్థలు నమోదు చేశాయి. ఆమెకు లాడ్లీ మీడియా అవార్డులు పలుమార్లు లభించాయి.

జాతీయ స్థాయిలో సుచేతా దలాల్ ఆర్థిక, పరిశోధనాత్మక జర్నలిజానికి చిరస్మరణీయమైన పేరు. 1992 హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టుల్లో ఆమె ఒకరు. ఆర్థిక రంగంలోని సంక్లిష్టమైన మోసాలను సాధారణ పాఠకుడికి అర్థమయ్యే భాషలో వివరించడం ఆమె ప్రత్యేకత. రితు సరిన్ అంతర్జాతీయ స్థాయి దర్యాప్తు జర్నలిజంలో భారతదేశానికి గుర్తింపు తెచ్చిన మరో పేరు. పనామా పేపర్స్, పారడైజ్ పేపర్స్, ఫిన్‌సెన్ ఫైల్స్, పాండోరా పేపర్స్ వంటి అంతర్జాతీయ దర్యాప్తుల్లో ఆమె భాగస్వామ్యం ఉంది.

నేహా దీక్షిత్ లింగం, సామాజిక న్యాయం, మానవ హక్కులు, రాజకీయాలు వంటి అంశాలపై దీర్ఘకాలిక పరిశోధనాత్మక కథనాలు చేశారు. బర్కా దత్ కార్గిల్ యుద్ధం నుంచి సంఘర్షణ ప్రాంతాలు, విపత్తులు, రాజకీయాల వరకు ఫీల్డ్ రిపోర్టింగ్‌కు గుర్తింపు పొందారు. ధన్యా రాజేంద్రన్ ది న్యూస్ మినిట్ వ్యవస్థాపక సంపాదకురాలిగా డిజిటల్ జర్నలిజంలో మహిళా నాయకత్వానికి ఉదాహరణగా నిలిచారు. సుప్రియా శర్మ సామాజిక, మానవహక్కుల అంశాలను పరిశోధనాత్మకంగా రిపోర్ట్ చేశారు. చామేలీ దేవి జైన్ అవార్డు ఈ తరహా అనేక మంది మహిళా జర్నలిస్టుల కృషిని గుర్తించింది.

రాజకీయ విశ్లేషణ రంగంలో నీరజా చౌదరి ప్రత్యేకమైన స్థానం సంపాదించారు. దశాబ్దాలుగా ప్రధానమంత్రులు, రాజకీయ పార్టీలు, అధికార కేంద్రాల నిర్ణయ ప్రక్రియను విశ్లేషించిన ఆమె రచనలు భారత రాజకీయాల అంతర్గత స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. సెవంతి నినన్, నిరుపమా సుబ్రమణియన్, అర్ఫా ఖానుమ్ షెర్వాని, రోహిణి మోహన్, ప్రియాంక దూబే వంటి మహిళా జర్నలిస్టులు కూడా రాజకీయాలు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఘర్షణలు, పౌర హక్కులపై తమదైన ముద్ర వేశారు.

ఈ మహిళలందరిలోనూ ఒక సామాన్య లక్షణం కనిపిస్తుంది- ప్రశ్నించడం. అధికారంలో ఉన్నవారిని మాత్రమే కాదు, అధికారాన్ని నియంత్రించే సంస్థలను కూడా ప్రశ్నించడం. అయితే మహిళా జర్నలిజం విజయాలను కేవలం వ్యక్తిగత ధైర్యానికి పరిమితం చేయకూడదు. లింగ వివక్ష, కార్యాలయ అసమానత, ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు, ఉద్యోగ భద్రత, స్వతంత్ర జర్నలిజానికి ఆర్థిక పరిమితులు వంటి సమస్యలు ఇప్పటికీ ఉన్నాయి.

రితికా చోప్రా తాజా దర్యాప్తు ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమె కథనం లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం తన అధికారిక స్పందనలో 14 నోట్ల ఉనికి, తేదీలు, విషయాలను ఖండించలేదు; అయితే వాటిని "సూచనలు"గా పేర్కొంటూ గత ఏడాది నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని తెలిపింది. అంటే కథనం వెలుగులోకి తెచ్చిన పత్రాలు ఒకవైపు, వాటిపై ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణ మరోవైపు ఉన్నాయి. ఈ రెండింటినీ ప్రజలు పరిశీలించడం, సంబంధిత సంస్థలు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం ప్రజాస్వామ్య పారదర్శకతకు అవసరం.

అందుకే మహిళా జర్నలిజం అంటే కేవలం మహిళల సమస్యలపై రాయడం కాదు. దేశంలోని అత్యంత శక్తివంతమైన సంస్థలను కూడా పత్రాలతో, ఆధారాలతో, ప్రశ్నలతో పరిశీలించే సామర్థ్యం. రితికా చోప్రా తాజా దర్యాప్తు ఆ విషయాన్ని మరోసారి గుర్తుచేసింది. వనజ నుంచి తులసీ చందు వరకు, సుచేతా దలాల్ నుంచి రితు సరిన్ వరకు, నేహా దీక్షిత్ నుంచి నీరజా చౌదరి వరకు సాగిన ఈ ప్రయాణం భారత జర్నలిజంలో మహిళల పాత్రను "వార్తలు చెప్పేవారు" అనే స్థాయి నుంచి "అధికారాన్ని ప్రశ్నించే ప్రజాస్వామ్య కాపలాదారులు" అనే విస్తృత స్థాయికి తీసుకెళ్లిన పరిణామాన్ని చూపిస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ప్రభుత్వ వైద్యంపై భరోసా ఏది?

ప్రభుత్వ ఆసుపత్రే పేదవాడికి పెద్ద దిక్కు. ప్రైవేట్ వైద్యం ఖర్చులు భరించలేని కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రే ఆశ్రయం. తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదం, అత్యవసర పరిస్థితుల్లో అక్కడ వైద్యం అందుతుందనే నమ్మకంతో ప్రజలు వస్తారు. కానీ చికిత్స కోసం వచ్చిన రోగికి ఆసుపత్రి భవనమే ప్రమాదకరంగా మారితే? వైద్య పరికరాలు పనిచేయకపోతే? మందులు అందుబాటులో లేకపోతే? నిపుణులైన వైద్యులు కొరతగా ఉంటే? ఒక పరీక్ష కోసం మరో ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తే? అప్పుడు ప్రశ్న ఒక్క ఆసుపత్రి నిర్వహణకే పరిమితం కాదు.. మొత్తం ప్రభుత్వ వైద్య వ్యవస్థ పనితీరుపై ప్రశ్న మొదలవుతుంది.

వరంగల్ మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రి(ఎంజీఎం)లో సెప్టెంబర్ 21న జరిగిన ఘటన ఈ ప్రశ్నను మరింత తీవ్రంగా ముందుకు తెచ్చింది. ఆరోగ్యశ్రీ వార్డులోని పాత భవనంలో పైకప్పు సీలింగ్ భాగం కూలడంతో ఒక రోగితో పాటు ఇద్దరు సహాయకులు గాయపడ్డారు.సీలింగ్ పై భాగంలోకి నీరు నీరు చేరడం వల్ల సీలింగ్ బలహీనమై ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి చికిత్స అందించి మరో వార్డుకు తరలించారు.

ఒక ఘటనతో సమస్య ముగియలేదు.సెప్టెంబర్ 22న ఎంజీఎంలోని ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లోనూ పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. వరుస ఘటనల నేపథ్యంలో అధికారులు పాత భవనాల పరిస్థితిని పరిశీలించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరినట్లు గుర్తించారు. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టడంతో పాటు పాత భవనాల్లో కొనసాగుతున్న విభాగాలను తరలించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ఎంజీఎంలో సమస్య భవనాల భద్రతతోనే మొదలైనది కాదు. కార్డియాలజీ విభాగంలో వైద్యుల కొరత కారణంగా 2డీ ఎకో పరీక్షలకు అంతరాయం ఏర్పడినట్లు గతంలో మీడియా కథనాలు వెలువడ్డాయి. అత్యవసరంగా పరీక్షలు అవసరమైన రోగులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. మరో సందర్భంలోనూ 2డీ ఎకో సేవలు నిలిచిపోవడంతో రోగులను ఇతర ప్రభుత్వ వైద్య సంస్థలకు పంపాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు వివరాలు వెలువడ్డాయి. ఒక కీలక వైద్య పరీక్ష కోసం రోగి మరో ఆసుపత్రి వైపు చూడాల్సి రావడం ప్రభుత్వ వైద్య వ్యవస్థలో నిర్వహణ లోపాలను సూచించే అంశంగా మారింది.

ఇటీవల వెలువడిన మీడియా కథనాలు కూడా ఎంజీఎంలో సమస్యల విస్తృతిని మరోసారి చర్చకు తెచ్చాయి. 2డీ ఎకో పరికరాలు పనిచేయకపోవడం, అవసరమైన సిబ్బంది కొరత, కొన్ని విభాగాల్లో పరికరాల నిర్వహణ సమస్యలు, లిఫ్టులు, స్ట్రెచర్లు వంటి మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పాత భవనాల పరిస్థితితో పాటు వైద్య సేవలకు అవసరమైన మౌలిక వసతుల నిర్వహణపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఇవి గుర్తుచేస్తున్నాయి.

ఈ పరిణామాలను కలిపి చూస్తే ప్రభుత్వ వైద్యం అంటే కేవలం కొత్త భవనాలు నిర్మించడం కాదని స్పష్టమవుతుంది. భవనాలు సురక్షితంగా ఉండాలి. వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది తగినంతగా ఉండాలి. కొనుగోలు చేసిన పరికరాలు నిరంతరం పనిచేసేలా నిర్వహణ వ్యవస్థ ఉండాలి. మందులు, శస్త్రచికిత్స సామగ్రి అందుబాటులో ఉండాలి. విద్యుత్, నీరు, పారిశుధ్యం, అగ్నిమాపక భద్రత వంటి మౌలిక అంశాల్లో రాజీ ఉండకూడదు.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల పాత భవనాలపై సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించాలి. పైకప్పులు, విద్యుత్ వ్యవస్థ, ఆక్సిజన్ లైన్లు, లిఫ్టులు, అగ్నిమాపక పరికరాలు తదితరాలను నిపుణులతో పరిశీలించాలి. పనిచేయని వైద్య పరికరాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి. మందుల సరఫరా నిరంతరంగా కొనసాగాలి. ఖాళీ వైద్య, సాంకేతిక సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఊడిపడే ప్రతి పైకప్పు పెచ్చు ఒక హెచ్చరిక. పనిచేయని ప్రతి వైద్య పరికరం ఒక రోగి కోల్పోయే సమయం. అందని ప్రతి మందు ఒక కుటుంబంపై పడే అదనపు ఆర్థిక భారం. అందుకే ఎంజీఎం ఘటనను ఒకరోజు వార్తగా ముగించకుండా, తెలంగాణ ప్రభుత్వ వైద్య వ్యవస్థను సమగ్రంగా పునఃపరిశీలించాల్సిన సందర్భంగా చూడాలి.

ప్రభుత్వ ఆసుపత్రి తలుపులు పేదవాడికి తెరిచి ఉండటం మాత్రమే సరిపోదు. ఆ తలుపులు దాటిన తర్వాత అతనికి భద్రత, వైద్యం, మందు, పరీక్ష, నిపుణుల సేవ-అన్నీ సమయానికి అందాలి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే ప్రభుత్వ వైద్య వ్యవస్థకు ఇదే అసలు కొలమానం.



కోగిల చంద్రమౌళి (జర్నలిస్టు)
వరంగల్
9573187218

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- విద్యార్థుల భవిష్యత్ పునాది వేసేది ఉపాధ్యాయులు
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, పరిగి, తాండూర్ శాసనసభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బుయ్యాని మనోహర్ రెడ్డిలు హాజరై జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలతో జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.... పాఠశాలల్లో విద్యతోపాటు విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల నిమిత్తం అధిక నిధులను కేటాయించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి పాఠశాలలో మరమ్మత్తు పనులను చేపట్టి త్రాగునీరు, టాయిలెట్ సౌకర్యాలను కల్పించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు పౌర హక్కులు, విధుల పట్ల కూడా విద్యా బోధనలో భాగంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల అభిష్టాల మేరకు తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్య పట్ల నైపుణ్యం కలిగి ఉండాలని ఉద్దేశంతో ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)లను ఏర్పాటు చేసి శిక్షణలో ఇవ్వడం జరుగుతుందని దీనివల్ల పరిశ్రమంలో పని చేయడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. మనిషి జీవనశైలిలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయని వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు క్రీడలు, వ్యాయామం వంటిపై ఆసక్తిని పెంచి శారీరక దృఢత్వం కార్యకలాపాలపై శ్రద్ధ వహించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు మును ముందు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ పురస్కారాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.పరిగి శాసనసభ్యులు టి. రామ్ మోహన్ రెడ్డి, బి. మనోహర్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, అన్ని వర్గాల విద్యార్థులు ఒకే దగ్గర విద్యను అభ్యసించేందుకు వీలుగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిరుద్యోగ యువత ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఏటీసీల ద్వారా శిక్షణలు ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అదేవిధంగా వీటి వల్ల మహిళలు కూడా ఉపాధి పొందుతారని ఎమ్మెల్యే అన్నారు. తాండూర్ శాసన సభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్ తరాల తలరాత మార్చేది విద్య మాత్రమేనని దీనికి దశాదిశను నిర్దేశించే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. విద్యపై ఖర్చు పెట్టడం పెట్టుబడి కాదని అది ఒక సంపదని గుర్తించి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తూ అధిక నిధులను వెచ్చించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ జిల్లాను మెరుగైన స్థానంలో ఉంచే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, ఫైనాన్స్ కమిషనర్ సభ్యులు రంగ రాజన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దమర్రిలో రైతు ఆర్గానిక్ ఫార్మింగ్ క్షేత్ర ప్రదర్శన



**శామీర్ పేట్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** మూడు చింతలపల్లి మండలంలో ఉద్దమర్రి గ్రామంలో వ్యవసాయధికారి ప్రవీణ ఆధ్వర్యంలో రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.రైతు క్షేత్ర ప్రదర్శనలో ప్రకృతి వ్యవసాయం మరియు ఆర్గానిక్ ఫార్మింగ్ క్షేత్ర ప్రదర్శనలో శిక్షణ ఇచ్చారు.ఈ క్షేత్ర ప్రదర్శన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రకళ,అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మేడ్చల్ డివిజన్ వెంకట్రామరెడ్డి, ఏపీఎం మునిస్వామి, మహిళా సమాఖ్య సభ్యులు రజిత, నరసమ్మ,రైతులు, ఏఈఓ సురేష్ లు పాల్గొన్నారు. ఆర్గానిక్ ఫార్మింగ్ మరియు నాచురల్ ఫార్మింగ్ రైతు ప్రసాద్ రెడ్డి తన అనుభవాలను రైతులతో క్షేత్ర ప్రదర్శనలో పాలుపంచుకున్నారు.

## గ్రామాభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- తులేకలాన్ గ్రామ పాలకవర్గం
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వినతి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** గ్రామాభివృద్ధికి నిధులు విడుదల చేయాలని తులేకలాన్ గ్రామ పాలకవర్గం జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామ సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై చర్చించి, వాటిని త్వరగా పరిష్కరించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ డి. జగదీష్, పాలకవర్గ సభ్యులు గజ్జల మహేష్, సుర్వి జనార్ధన్ గౌడ్, హనుమండ్ల ఆంజనేయులు, బి. యాదగిరి, బోడ స్కైలాబ్ పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** భారత ఎన్నికల కమిషన్ స్వతంత్రతను ప్రజాస్వామికరణను బలహీనపరిచి నియంతృత్వంగా నిర్ణయాలు తసుకుంటున్నటువంటి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ శనివారం షాపూర్ నగర్ సాగర్ హోటల్ ఎదురుగా శనివారం సిపిఐ , సిపిఎంల ఆధ్వర్యంలో జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ , సత్యంలు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని ఈడి, సిబిఐ ఎన్నికల కమిషన్ తమ స్వతంత్ర తను కోల్పోయి అధికార పమోడీ అమిత్షా ల చెప్పు చేతుల్లో నడుస్తున్నట్టు గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్నటువంటి పరిణామాలు ఉదాహరణలుగా కనిపిస్తున్నాయని తెలిపారు, నేడు అది ఎన్నికల కమిషన్ సమావేశాల్లో ఇతర ఎన్నికల కమిషనర్లు గత 14 సమావేశాల్లో 10 సార్లు వారి వ్యతిరేకతను అభిప్రాయాలను చెప్పినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా జ్ఞానేశ్వర్ కుమార్ తన ఏకచత్రాధిపత్యం నిర్ణయాలను తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ఇది దేశ ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వ సంస్థల యొక్క స్వతంత్రతను దెబ్బతీసినట్టేనని కాబట్టి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించినటువంటి జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ రాజీనామా చేయకపోతే మరో ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందని, నీతిగల వారు అయితే, రాజ్యాంగాన్ని కాపాడుతున్న వాళ్లయితే వెంటనే జ్ఞానేశ్వర్ తో రాజీనామా చేయించి ప్రజల ఓట్లను తిరస్కరిస్తున్నటువంటి సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షత వహించగా సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాములు, సిపిఎం నాయకులు రాజశేఖర్ అంజయ్య, సిపిఐ నాయకులు బక్కరి మల్లేష్ రమేష్ గౌరీ శ్రీనివాస్ సిపిఎం నాయకులు శ్రీనివాసులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యులు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్యాధికారి లలితా దేవి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ప్రభుత్వ వైద్యులు రోజులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి లలితా దేవి సంబంధిత డాక్టర్లకు సూచించారు. శనివారం జిల్లాలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతిపై జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. కె. లలితా దేవి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. మాతా, శిశు ఆరోగ్యం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, క్షయ వ్యాధి నియంత్రణ, టీకాల కార్యక్రమాల అమలు, లక్ష్యాల సాధన, క్షేత్రస్థాయి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల మరమ్మతులు, నిర్వహణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది హాజరును యాప్‌లో క్రమం తప్పకుండా నమోదు చేసేలా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా డా. మురారి రాజేంద్రప్రసాద్ కుక్కకాటు, రేబిస్ వ్యాధి నివారణ చర్యలపై గూగుల్ సమావేశం ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో డాక్టర్ నాగనిర్మల, డాక్టర్ అరుణ, డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే, డాక్టర్ సౌజన్య, డాక్టర్ సీతారాం, డాక్టర్ నర్సింగ్ చౌహాన్, డాక్టర్. మనోహర్‌రెడ్డి, డాక్టర్ రాజిని, డాక్టర్ శశికర్ తదితరులు పాల్గొన్నారు.

## హిజ్రాలు సృష్టిస్తున్న అరాచకాలతో నిజమైన హిజ్రాలు బలి



**శామీర్ పేట్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** హిజ్రాల పేరుతో కొందరు చేస్తున్న డబ్బు వసూళ్లు, అరాచకాల వ్యవహారం వల్ల తమ సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందని హిజ్రాలు ఆవేదన వ్యక్తం చేశారు. బయట రాష్ట్రాల నుంచి వచ్చి హిజ్రాల పేరుతో ప్రజలను డబ్బులు పీడిస్తున్న వారి కారణంగా నిజమైన హిజ్రాలపై కూడా అపనమ్మకం ఏర్పడుతోందని తెలిపారు. తాము ఏ తప్పు చేయకపోయినా ప్రజలు అనుమానంతో చూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి శామీర్‌పేట్ మండలంలోని ప్రెస్ క్లబ్‌లో ట్రాన్సజెండర్ల ఫోరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హిజ్రాల పేరుతో అనధికారికంగా డబ్బులు పీడిస్తూ వసూలు చేస్తున్న వారిని గుర్తించి నియంత్రించా లని ప్రభుత్వాన్ని కోరారు. తమను కేవలం సానుభూతితో చూడటం కాకుండా విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. సరైన అవకాశాలు లభిస్తే ఎవరి మీద ఆధారపడకుండా స్వయంగా జీవిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా నిలుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భాగ్యశ్రీ యాదవ్, మహాలక్ష్మి,సంధ్య,సాయి సిరి,అంజలి, కోమలి, నవ్య, లావణ్య, సెల్వి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన "నీర"తో ఆరోగ్యం పదిలం

- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్ గౌడ్
- రైతు జగన్నాథ్ గౌడ్ పొలంలో 600 ఈతచెట్ల సాగు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ప్రజారోగ్యానికి స్వచ్ఛమైన నీర (కలుషితం లేని ఈత కల్లు) ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తుందని, అందుకు ప్రముఖ వైద్యులు సైతం సూచిస్తున్నారని.. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని రాజోళ గ్రామానికి చెందిన మండల కల్లుగీత కార్మిక సంఘం కార్యదర్శి, రైతు జగన్నాథ్ గౌడ్ సొంత వ్యవసాయ పొలంలో సాగుచేసిన 600 ఈతచెట్లను పరిశీలించారు. అనంతరం తాజాగా వ్యవసాయ పొలంలో నిర్మించిన ఓ దాబాను ప్రారంభించారు. ప్రతి కల్లుగీత కార్మికులు ఈతచెట్లను నాటి వాటిని సంరక్షించుకొని ప్రజల ఆరోగ్యానికి మేలు కలిగించే స్వచ్ఛమైన "నీర"ను అందించాలని జిల్లా ఉపాధ్యక్షులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు జగన్నాథ్ గౌడ్, నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు నరసింహా గౌడ్, సంఘం శ్రేణులు భూమా గౌడ్, చంద్రకాంత్ గౌడ్, శంకర్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, మహేష్ గౌడ్, అంజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


## ఆర్టీసీ ఎన్నికల్లో టీజేఎంయూ విజయానికి కృషి చేస్తా..



**సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలోని రెడ్లాన్ హోటల్‌లో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ, టీజేఎంయూ గౌరవాధ్యక్షుడు తోపాజీ అనంతకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా తోపాజీ అనంతకృష్ణ మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే ఉద్యమంలో టీజేఎంయూ కీలక పాత్ర పోషించిందన్నారు. హనుమంత ముదిరాజ్ స్థాపించిన టీజేఎంయూ బలోపేతానికి, రాబోయే ఆర్టీసీ ఎన్నికల్లో యూనియన్ విజయానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.
సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి, రీజినల్ కార్యదర్శి అంజాగౌడ్, సంగారెడ్డి డిపో కార్యదర్శి విశ్వనాథ్ విక్రమ్, డిపో అధ్యక్షుడు మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్, జాయింట్ సెక్రటరీ రవి, గ్యారేజ్ సెక్రటరీ కాళిదాస్, గ్యారేజ్ అధ్యక్షుడు రవీందర్, జాయింట్ సెక్రటరీ ప్రభుగౌడ్, రీజినల్ కమిటీ సభ్యులు సక్కుబాయి, స్వరూపతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22ఏ నుండి పట్టా భూములను వెంటనే తొలగించాలి

- మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య



**నంగునూరు, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు, భయభ్రాంతులకు గురిచేస్తోందని, ఆ భూములను వెంటనే 22ఏ నుండి తొలగించాలని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ తీరుపై ఆయన మండిపడుతూ.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పట్టా భూములను 22ఏ జాబితాలో చేర్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంలో ఒక సర్వే నంబర్‌కు చెందిన కొంత భాగం భూమి పోతే, ఆ సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం భూమిని 22ఏ లో చేర్చడం దారుణమన్నారు. ఒక్క పాలమాకుల గ్రామంలోనే సుమారు 150 ఎకరాల రైతుల పట్టా భూములను ఈ జాబితాలో చేర్చారని తెలిపారు.అధికారులు స్పందించి 22ఏ లో చేర్చిన పట్టా భూములను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో బాధితులైన రైతులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్లంకి రవీందర్ రెడ్డి, వరదలు వేణు చక్రవర్తి, వేల్పుల ఐలయ్య, దుంబాల శ్రీనివాస్, వేల్పుల శంబయ్య, మహేష్, వరదలు ఐలయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ సేవలకు సమ్మె సెగ

- బ్యాంకు ఖాతాదారులకు ముందస్తు హెచ్చరిక
- 28 నుంచి 30 వరకు ఉద్యోగుల సమ్మె
- 27 ఆదివారం పనిచేయునున్న బ్యాంకులు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** బ్యాంకు ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ఈ నెలాఖరులో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేయాలన్న డిమాండ్‌తో ఉద్యోగ సంఘాలు ఈ నెల 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. 27న ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలను తెరిచి ఉంచాలని నిర్ణయించారు. దీంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడే పరిస్థితి తప్పింది. అయితే 28 నుంచి మూడు రోజుల పాటు సమ్మె ప్రభావం కొనసాగనుంది.

25లోగా అత్యవసర పనులు పూర్తి చేసుకోవాలి

సమ్మెతో నెలాఖరులో ఇబ్బందులు పెరిగే అవకాశం ఉన్నందున చెక్కులు, నగదు లావాదేవీలు, శాఖలో ప్రత్యక్షంగా నిర్వహించాల్సిన పనులను 25లోగా పూర్తి చేసుకోవాలని బ్యాంకులు ఖాతాదారులకు సూచిస్తున్నాయి. ఈ మేరకు సందేశాల ద్వారా ఖాతాదారులకు సమాచారం అందిస్తున్నాయి.

### 27న ప్రత్యేకంగా బ్యాంకింగ్ సేవలు

27న ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలు పనిచేయనున్నాయి. సమ్మెకు ముందు రోజు శాఖలు తెరిచి ఉండటంతో అత్యవసర పనులు ఉన్న ఖాతాదారులకు కొంత వెసులుబాటు లభించనుంది.

### ఉద్యోగ సంఘాల డిమాండ్లు

2024 మార్చిలో కుదిరిన ఒప్పందం ప్రకారం వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పనితీరు ఆధారిత ప్రోత్సాహక విధానంపై కూడా ఉద్యోగ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.




డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని సంఘాలు ప్రకటించాయి.
కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ముందస్తు చెల్లింపులు:

### నెలాఖరు లావాదేవీలపై ప్రభావం

సెప్టెంబర్ 30తో అర్ధవార్షిక ఆర్థిక ముగింపు కావడంతో కంపెనీలు, వ్యాపార సంస్థలు, పన్ను చెల్లింపుదారుల బ్యాంకింగ్ లావాదేవీలు సాధారణంగా పెరుగుతాయి. సమ్మె కారణంగా శాఖల ద్వారా జరిగే సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉండటంతో ఖాతాదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి.

# జిల్లా పర్యాటక ప్రదేశాలపై ప్రచారం అవసరం

- పురాతన కట్టడాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** విద్యార్థులు జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాల విశిష్టతను తెలుసుకుని వాటి ప్రాధాన్యతపై సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గద్వాలలోని ప్రభుత్వ మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని వెలుగులోకి రాని పర్యాటక ప్రాంతాల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిజాం కొండ, బీచుపల్లి, అలంపూర్ ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గద్వాల చేనేత చీరల ప్రాముఖ్యతపై కూడా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ, ఇక్కడ చేనేత పార్క్ నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం టూరిస్ట్ గైడ్ ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తుందన్నారు. జిల్లాలోని పలు ప్రాచీన కట్టడాలను ఇప్పటికే పురావస్తు శాఖ గుర్తించిందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి ఒక ప్రాంత అభివృద్ధికి మాత్రమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి, వ్యాపారులకు అవకాశాలు, ప్రభుత్వానికి ఆదాయం కల్పించే కీలక రంగమని అన్నారు. పర్యాటకులు పెరిగే కొద్దీ హోటళ్లు, రవాణా, గైడ్ సేవలు, స్థానిక ఉత్పత్తులు, హస్తకళలు తదితర రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు పర్యాటక రంగాన్ని ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారంగా చేసుకుని ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. అలంపూర్ జోగులాంబ ఆలయం, బీచుపల్లి, నదీ పరివాహక ప్రాంతాలు తదితర ప్రాంతాలను ప్రోత్సహించడం ద్వారా జిల్లాకు ప్రత్యేక పర్యాటక గుర్తింపు తీసుకురావచ్చని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో భద్రత, పారిశుధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారులు, వసతి, పారిశుధ్య సౌకర్యాలను మెరుగుపరిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. తద్వారా స్థానిక యువతకు ఉపాధి, వ్యాపారులకు ఆదాయ అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. పర్యాటక అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యాసంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే గద్వాల మెడికల్ కళాశాలలో వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రామలింగేశ్వర గౌడ్, కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్ భాష, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, సంతోషకరమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సాధికారత సంక్షేమ శాఖ జిల్లా అధికారి డి. సునంద అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గద్వాల పట్టణంలోని రెండవ రైల్వే గేట్ సమీపంలోని ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి, వయోవృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలతో పాటు అక్టోబర్ 1న నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం సెంటర్‌లోని సౌకర్యాలు, భోజన వసతులను పరిశీలించారు. డే కేర్ సెంటర్‌లో ఖాళీ స్థలంలో మరిన్ని పండ్ల మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని నిర్వాహకులు, సిబ్బందికి సూచించారు. మరింత మంది వయోవృద్ధులు సెంటర్‌కు వచ్చేలా అవగాహన కల్పించి, వారికి అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ సిబ్బంది, డే కేర్ సెంటర్ నిర్వాహకులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మనసుకు ప్రశాంతత

- ఆలయ ధర్మకర్త ముడ్ లలితా కిషన్



**నిజాంపేట్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ఆధ్యాత్మిక చింతనతోనే మనసుకు ప్రశాంతత చేకూరుతుందని శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ ధర్మకర్త మూడు లలితా కిషన్ పేర్కొన్నారు. నిజాంపేట్ మండలం బల్కంచెల్క తండా గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ విశ్వపాలిని జ్వాలాముఖి, శ్రీ సేవాలాల్ మహారాజ్ మహామందిర ఆలయ ధర్మకర్త మండలి సభ్యుడు ముడ్ లలితా కిషన్ కాశీ తీర్థయాత్రకు బయలుదేరారు. దీక్ష తీసుకున్న ఆయన 15 రోజులపాటు యాత్ర కొనసాగించనున్నట్లు తెలిపారు. కాశీలో తొమ్మిది రోజులపాటు ఉండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో భక్తుల కోరికలు నెరవేరుతున్నాయని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని కాశీ విశ్వేశ్వరుడిని ప్రార్థించనున్నట్లు లలితా కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, తండా మాలధారులు శంకర్, రాములు, దేవీసింగ్, సాయిసింగ్, మంజులాల్, ఎస్జీ సర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యవస్థపై ఆరోపణలు ఆందోళనకరం

గద్వాల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) : ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణలు ప్రజాస్వామ్యానికి తీవ్ర ఆందోళనకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు అన్నారు. శనివారం గద్వాలలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలు, పారదర్శకతపై వస్తున్న అనుమానాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. ఎన్నికల సంఘం కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ఈసీఐపై ఉందన్నారు.




# సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు పాఠశాలల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. ముఖ్యంగా వివిధ సబ్జెక్టుల్లో సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని తెలిపారు. శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుపై కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, డీఈఓ రమేష్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి, వారి పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి సమస్యలను అర్థం చేసుకుని ప్రత్యేక బోధన అందించాలన్నారు. విద్యార్థుల ప్రగతిని క్రమం తప్పకుండా పరిశీలించి, అభ్యసన స్థాయిలో వచ్చిన మార్పులను నమోదు చేయాలని సూచించారు. చదువులో వెనుకబడటానికి గల కారణాలను గుర్తించి అదనపు బోధన, పునశ్చరణ తరగతులు, వ్యక్తిగత శ్రద్ధ వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపరచకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, గణిత నైపుణ్యాలు తదితర ప్రాథమిక విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. తదుపరి సమీక్ష సమావేశం నాటికి సీ గ్రేడ్ విద్యార్థుల అభ్యసన స్థాయిలో వచ్చిన పురోగతిని స్పష్టంగా చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు, చదువులో వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ రమేష్ కుమార్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్, సెక్టోరియల్ అధికారులు నూరుద్దీన్, వెంకటేశ్వర్లు శెట్టి, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

- కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు రానివ్వద్దు
- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. 2026-2027 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ధాన్యం కొనుగోలుపై కేంద్రాల నిర్వహకులకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు కేంద్రాలకు దాన్యం తరలివస్తే, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టానుసారం నచ్చిన మిల్లులకు ఎక్కువ కేటాయింపులు చేయడం, ఇతర అక్రమాలకు పాల్పడితే అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం దాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ రైతులు ఎంతో కష్టపడి వరి సాగు చేశారని, అన్నదాతలకు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరికి క్వింటాల్ కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సంబంధిత ఇంచార్జిలు లేకుండా ఇతరులు నిర్వహిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఆయా రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించాలని, ఓపిఎంఎస్ లో వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తే రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆయా కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షిస్తారని, విజయవంతంగా నిర్వహించి రైతులకు మేలు జరిగేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, డీఏవో వీరప్ప, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, సహకార శాఖ అధికారి టైటాసు పాల్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ బట్టీలతో కనుమరుగవుతున్న అటవీ సంపద

- అటవీ భూమిని చేరబట్టిన అక్రమార్కులు
- అక్రమంగా మట్టి తరలింపు
- నిద్ర మత్తులో అధికార గణాలు

**శివ్వంపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** పచ్చని అడవి తల్లిని గొడ్డలిపోటుకు బలి చేస్తూ, అడవి భూములను క్రమక్రమంగా ఆక్రమిస్తూ, వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ, సారవంతమైన నేలలు, చెరువు, కుంటాలను వాటి శిఖలను కూడా వదలకుండా కొందరు వ్యక్తులు అక్రమ పద్ధతిలో యథేచ్ఛగా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. శివ్వంపేట మండల పరిధిలోని రూప్లాతండాకు చెందిన కొందరు గిరిజనులమని చెప్పుకునే ఐదారు మంది వ్యక్తులు, ఫారెస్ట్ భూమిని ఆక్రమించడంతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కొందరికి ఎకరం, రెండు ఎకరాల చొప్పున సాగు చేసుకొని జీవించడానికి పట్టాలు ఇవ్వడంతో అదే అదునుగా చేసుకొని క్రమక్రమంగా అటవీ భూమిని ఆక్రమించి పెద్ద ఎత్తున ఇటుక బట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, ఆ ప్రాంతాన్ని ఒక పారిశ్రామిక ప్రాంతంగా మార్చి ఫారెస్ట్ భూముల్లో ఇటుకల తయారీ కోసం వ్యవసాయ బోర్లకు అక్రమ కనెక్షన్లు వేసుకొని ఉచిత విద్యుత్తును దుర్వినియోగం చేస్తున్నా, సంబంధిత శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరుపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

మండల పరిధిలోని రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కంద్యా తండా, పాండ్యా తండా, రూప్లాతండా లతో పాటు కొత్తపేట గ్రామ శివార్లలలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో అక్రమ ఇటుక బట్టీల సామ్రాజ్య వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.



రూప్లా, కాండ్యా, పాండ్యా తండాలకు అనుకోని ఉన్న చెరువు కుంటల నుంచి అలాగే వ్యవసాయ భూముల నుంచి మట్టి తవ్వకాలు చేస్తుండడంతో ఆ ప్రదేశంలో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే నర్సాపూర్ మండల పరిధిలోని తుజాల్ పూర్ చెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అంతేకాదు సారవంతమైన భూములు సాగుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారుస్తున్నారు. చదువుకునే వయసులో పాఠశాలకు వెళ్ళవలసిన చిన్నారులు ఇటుక బట్టీల వద్ద దర్శనమిస్తున్నారు. ఈ చిన్నారులతో అక్రమ ఇటుక బట్టీల వ్యాపారులు, వాటి నిర్వాహకులు పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఈ బట్టీల నిర్వహణకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వందలాది ఎకరాల్లో బట్టీలను పేర్చి అవి కాల్చడానికి ఉపయోగపడే కలపను రాత్రి సమయంలో అడవుల నుంచి అక్రమంగా కలపను ట్రాక్టర్ల ద్వారా బట్టీల వద్ద కు చేరవేస్తున్నారు. ఆయా తండాల్లో అక్రమార్కులు ఇటుక బట్టీలను నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇటుక బట్టీలను నిర్వహించాలంటే మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల ఉన్నతాధికారుల నుంచి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలనే నిబంధనలు ఉన్నప్పటికీ అక్రమార్కులు వాటిని పాటించడం లేదు, ఈ అక్రమ ఇసుక బట్టీలపై స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా, పర్యవేక్షణ లోపంతో అక్రమార్కులు ఇటుక బట్టీల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఆయా తండాల్లో అక్రమార్కులు ఇటుక బట్టీలను నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇటుక బట్టీల వ్యాపారాన్ని నిర్వహిస్తున్న అక్రమార్కులతో ఫారెస్ట్, రెవెన్యూ, మైనింగ్, విద్యుత్ శాఖల అధికారులు కుమ్మక్కై, వారిచ్చే మామూళ్ల కు మరిగి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయితే అక్రమ ఇటుక బట్టీల నిర్వాహకులను ఎవరైనా ప్రశ్నిస్తే తమ వద్ద మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్, విద్యుత్ శాఖల అనుమతులు ఉన్నాయని చెబుతున్నా అవి నమ్మశక్యంగా లేవు. ఈ అక్రమ ఇసుక బట్టీలను పంట భూముల పక్కనే ఏర్పాటు చేస్తుండటంతో పాటు నర్సాపూర్ వెల్దుర్తి ప్రధాన రహదారికి అనుకోని ఉండడంతో ఇటుక బట్టీలు కాల్చుతున్న సమయంలో వెలువడే దుమ్ము, ధూళి, పొగలతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా తండాల రైతులు, వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- అక్టోబర్ 1లోగా 227 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి
- సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్
- అదనపు కలెక్టర్ సంగీత




**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ఖరీఫ్ సీజన్ 2026 - 27లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సంగీత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 1లోగా 227 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. జిల్లాలో దొడ్డు రకం ధాన్యానికి 196, సన్న రకానికి 31 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం తీసుకురాగానే నమోదు చేసి పారదర్శకంగా టోకెన్ జారీ చేయాలని, తేమ శాతాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. గన్నీ సంచులు, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, వాహనాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. ధాన్యం నాణ్యత నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వర్తించేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళు చేపట్టాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బాలసరోజ , జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ , సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

# ఐలమ్మ అందరికీ ఆదర్శం



**పాలకుర్తి, సెప్టెంబరు 26(జనంసాక్షి) :** భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని వివిధ పార్టీల నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 131 వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీలు వేర్వేరుగా ఐలమ్మ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే దర్మారావు, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్రెడ్డి మాట్లాడుతూ ఆనాడు దేశ్ ముఖ్ ను ఎదిరించి భూమి నాది, పండించిన పంట నాది అని పోరాడిన వీరనారి ఐలమ్మ అని చాటి చెప్పారు. 4 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పంట సాగు చేసిన సమయంలో దేశముఖ్, జాగీరార్లను ఎదిరించి ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర మహిళా కమీషన్ సుభ్యరాలు శ్వేత మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఏళ్ల తరబడి కొనసాగిన తెలంగాణ పోరాటంలో చాకలి ఐలమ్మ పేరు వినని రోజు, ఉద్యము లేదన్నారు. ఆమెను స్మరించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ పోగు శ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్పర్సన్ లావుడ్యా మంజుల, జలగం కుమారస్వామి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పసునూరి నవీన్, మాచెర్ల ఎల్లయ్య, బొబ్బాల అశోక్ రెడ్డి, పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న. ఉప సర్పంచ్ గాదపాక కిరణ్. వార్డు సభ్యులు వీరమనేని హనుమంతరావు. వీరమనేని సోమేశ్వరరావు. కత్తి దస్తగిరి. సలేంద్ర రమ–సోమన్న. కమ్మగాని సుధాకర్. ఎలుమ కంటి సతీష్. సీపీఎం మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య, చిట్యాల సోమన్న, బీసీ మేధావుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కూరపాటి రమేష్. సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య. బీజేపీ నాయకులు దొంగరి మహేందర్, రవికుమార్, వేల్పుల దేవరాజ్, నిరంజన్ రెడ్డి. కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు. పోగు శ్రీనివాస్, వీరమనేని యాకాంతరావు. ఉన్నారు.

# పాండవుల గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

- ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**రేగొండ, సెప్టెంబర్26( జనం సాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో ఉన్న చారిత్రక, ప్రకృతి సౌందర్యానికి నిలయమైన పాండవుల గుట్ట వద్ద జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ గౌడ్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రకృతి సంపద, చారిత్రక వారసత్వం, సాంస్కృతిక వైభవం కలిగిన ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పాండవుల గుట్టకు చారిత్రక, పురావస్తు ప్రాధాన్యతతో పాటు అపూర్వమైన ప్రకృతి అందాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అజంతా,ఎల్లోరా గుహలను తలపించేలా ఉన్న పాండవుల గుట్టలో పురాతన శిలాచిత్రాలు, మహాభారత కాలాన్ని గుర్తు చేసే ఆనవాళ్లు కనిపిస్తాయని, సమీపంలో ఉన్న కోనేరు ఈ ప్రాంత ప్రత్యేకతను మరింత పెంచుతోందని వివరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా మన ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను పరిరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం, వాటి చారిత్రక ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక కళాకారులు, చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలకు కూడా ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు అధికారులు పాండవుల గుట్ట పరిసర ప్రాంతాలను సందర్శించి అక్కడి సహజసిద్ధమైన రాతి నిర్మాణాలు, పురాతన ఆనవాళ్లు, ప్రకృతి అందాలను పరిశీలించారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి, పర్యాటకశాఖ అధికారులు, కొడవటంచ ఆలయ కమిటీ చైర్మన్ నాయినేని సంపత్ రావు,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పున్నం రవి,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,విద్యార్థులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

- హాజరైన ఎమ్మెల్యే పళ్లా, మాజీ ఎమ్మెల్యేలు




**బచ్చన్నపేట సెప్టెంబరు 26 (జనంసాక్షి) :** వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ బచ్చన్నపేట మండలంలోని కేసి రెడ్డి పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మామిడాల ప్రభాకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జనగామ ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి. విశిష్ట అతిథులుగా మాజీ ఎమ్మెల్యే నాగపురి రాజలింగం గౌడ్, మాజీ ఎమ్మెల్యే జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం వారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గానికే కాకుండా అణగారిన, పేద, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. మహిళలు కూడా సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడగలరని తన జీవితంతో నిరూపించిన ధైర్యవంతురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిద్దేశ్వర రజక సంఘం నాయకులు స్థానిక సర్పంచ్ ఆరే రవి. ఉప సర్పంచ్ చింతల రాజు. నాగపురి కిరణ్ కుమార్ గౌడ్. మల్లవరం వెంకటేశ్వర్ రెడ్డి. పైసా రాజశేఖర్. గుర్రపు బాలరాజు. జంగిటి విద్యనాథ్. గాలి కృష్ణ. గాలి తిరుపతి. అన్ని పార్టీల మండల అధ్యక్షులు వివిధ పార్టీల మండల నాయకులు రాష్ట్ర నాకు తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యూపిఐ ఛార్జీల పేరుతో సామాన్యులపై మోయలేని భారాలు

- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం




**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** దేశంలో సామాన్య ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారుల రోజువారీ జీవితంలో భాగమైన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)పై కొత్త వ్యాపారి రుసుము (ఎండీఆర్) విధానం తీసుకురావడం పనికి మాలిన చర్యఅని, డిజిటల్ విధానంతో క్యాష్ లెస్ పేరుతో యూస్ లెస్ పనులు చేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వమని, కేంద్ర ప్రభుత్వం యూపీఐ చెల్లింపులపై ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మాజీ జిల్లా కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ డిమాండ్ చేశారు. శనివారం ఏఐవైఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తా లోని బి ఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద “కేంద్ర ప్రభుత్వం యూపీఐ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని” డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ క్యాష్ కి స్వస్తి పలికి ప్రజలందరూ డిజిటల్ చెల్లింపుల ద్వారా తమ కార్యకలాపాలు కొనసాగించాలని పెద్ద ఎత్తున భారీ కటౌట్లతో మీడియాలో ప్రకటనల ద్వారా ప్రజలను మభ్యపెట్టిన మోడీ, యూపీఐ చెల్లింపుల ద్వారా ఎటువంటి చార్జీలు విధించమని ఆనాడు తెలిపారన్నారు. ఒక ప్రణాళిక బద్ధంగానే ముందు ఉచితంగానే సేవలు అందిస్తామని ఆ తర్వాత విపరీతమైన చార్జీలు వసూలు చేయడం సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం రూ. 2,000కు మించిన వ్యక్తి, వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, 75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా 300 వరకు వర్తిస్తుందన్నారు. వ్యక్తి, వ్యక్తి లావాదేవీలు, 2,000 వరకు వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతోందని, అయితే ఈ కొత్త రుసుము విధానం వల్ల భవిష్యత్తులో చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై పడే ఆర్థిక ప్రభావంపై స్పష్టమైన హామీ, పారదర్శకత అవసరమన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ మాట్లాడుతూ ప్రజల డిజిటల్ చెల్లింపులు, ప్రజల ప్రయోజనాల కోసమే వుండాలన్నారు. రుసుముల భారానికి కాదు అనే నినాదంతో పారదర్శకమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపు వ్యవస్థ కోసం ప్రజా చర్చను ముందుకు తీసుకెళ్లాలని ఏఐవైఎఫ్ పిలుపునిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు కంచెర్ల కుమారస్వామి, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యురాలు తాటికంటి మమత, హనుమకొండ జిల్లా ఆఫీస్ బేరర్స్ గుగులోత్ సురేష్, పసునూరి సునీల్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు, నాయకులు జెట్టి కృష్ణ, ఈర్ల లావణ్య, అల్లం శివ, శ్వేతా, కావ్య, తురుక శోభన్,రంజిత్, విజయ్, అరవింద్, కుమార్, రాజు, వెన్నల, కృష్ణవేణి, సరిత తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

**కడెం, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** కడం మండల కేంద్రంలోని పాత తహసిల్దార్ ఆఫీస్‌ను లైబ్రరీగా కేటాయించి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడేలా చేయాలని కోరుతూ,కడం మండల సర్పంచులందరితో కలిసి సిహెచ్ రాజేష్ కుమార్ ఛత్రపతి ఖానాపూర్ శాసనసభ సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రరీ ఆవశ్యకత, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రశాంతమైన చదువు వాతావరణం అవసరల గురించి సామాజిక సేవకులు రాజేశ్ కుమార్ ఛత్రపతి ప్రజాప్రతినిధి చిట్యాల సర్పంచ్ చీమల భీమేష్ ఎమ్మెల్యేకు వివరించి తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు గురించి చెప్పిన ప్రతి మాటను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. పాత తహసిల్దార్ ఆఫీస్‌ను కేవలం లైబ్రరీగా మార్చడం మాత్రమే కాదు... సుమారు ?40--50 లక్షలతో ‘అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్’గా అభివృద్ధి చేసి, కడం ప్రాంత విద్యార్థులకు అండగా నిలుద్దాం” అని హామీ ఇవ్వడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రెడ్‌క్రాస్ నిర్వహణ కమిటీ ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 26(జనంసాక్షి) :** భారత రెడ్‌క్రాస్ సొసైటీ ములుగు జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసినట్లు ఎన్నికల అధికారి ఎ ధర్మ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 17 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందగా, ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 4న చైర్మన్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎ. ధర్మ నాయక్ ఆ ప్రకటనలో వెల్లడించారు.

# ఇంట్లోకి చొరబడి తలుపులు ధ్వంసం

- అసభ్య పదజాలంతో దూషించి బెదిరింపు.. కేసు నమోదు

**గీసుకొండ మండలం, సెప్టెంబర్ 26, (జనం సాక్షి) :** గీసుగొండ, సెప్టెంబర్ 26: ఆదర్శనగర్‌లో ఓ ఇంటి వద్ద అర్ధరాత్రి హల్‌చల్ చేసిన ఘటనపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం. ఆదర్శనగర్‌కు చెందిన శివరాత్రి రాజమ్మ (38), ఇంట్లో ఆమె మేనకోడలు రమ్య తన 10 ఏళ్ల కుమార్తె ప్రణవితో కలిసి ఉంటోంది. సుమారు 11 ఏళ్ల క్రితం రమ్యకు జాన్పాకకు, చెందిన శివరాత్రి రాజు (30), తో వివాహం జరిగింది. గత రెండు నెలలుగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఉండటంతో రమ్య కుమార్తెతో కలిసి రాజమ్మ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో, శివరాత్రి రాజు మరికొందరితో కలిసి రాజమ్మ ఇంటి వద్దకు వచ్చి తలుపులు కొడుతూ, అసభ్య పదజాలంతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం బీరు సీసాలు విసిరి ఇంటి తలుపులు, పక్కనే ఉన్న అద్దాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. తలుపులు తీయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో, భయాందోళనకు గురైన రాజమ్మ, చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకునేలోపే, నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుగొండ, ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# ఇంట్లోకి చొరబడి తలుపులు ధ్వంసం

- అదృశ్యమైన సిఆర్టి వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మృతదేహం వాగులో లభ్యం





**కెరమెరి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** కెరమెరి పెద్ద వాగు వారి పాలిట శాపంగా మారింది. 15 ఏళ్ల క్రితం తండ్రిని పొట్టన పెట్టుకున్న ఆ వాగే, నేడు కొడుకు ప్రాణాన్ని కూడా బలితీసుకుంది. ఈ విషాద ఘటన యావత్ మండలాన్ని కన్నీటిలో ముంచింది. వివరాల్లోకి వెళితే.. కేరమేరి మండలంలోని కొత్తగూడ (సాకడ) గ్రామానికి చెందిన దుర్వా శ్రీనివాస్(38) జోడేఘాట్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో సిఆర్టి వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం నాడు పాఠశాలకు సెలవు పెట్టి అదిలాబాద్ వెళ్లి తిరిగి వచ్చిన శ్రీనివాస్ కెరమెరి ప్రాంతంలో అదృశ్యమై నాలుగు రోజుల తర్వాత ఆయన మృతదేహం శనివారం నిసాని సమీపంలోని డాబ్ కస్స వాగులో లభ్యమైంది. మృతుడు శ్రీనివాస్ కు భార్య నలుగురు పిల్లలు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రోజులాగే తన గ్రామమైన కొత్తగూడ నుంచి జోడేఘాట్కు విధుల నిమిత్తం రాకపోకలు కొనసాగిస్తున్నాడు. బుధవారం పాఠశాలకు సెలవు పెట్టి అదిలాబాద్ వెళ్లి తిరిగి రాత్రి 10 గంటల సమయంలో బైకును వాగు పక్కనే ఉన్న షెడ్ వద్ద నిలిపి గ్రామానికి వెళ్లే మార్గంలో అడ్డుగా ఉన్న కెరమెరి పెద్ద వాగును దాటే క్రమంలో వరద ప్రవాహం అధికంగా ఉండడంతో వాగులో గల్లంతయ్యాడు. రాత్రైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో బంధువులకు సమాచారం అందించారు. ఈ విషయమై కెరమెరి పోలీస్ స్టేషన్లో అదృశ్యం కేసు నమోదయింది. రంగంలోకి దిగిన పోలీసులు, గ్రామస్తులు,బంధువులు శుక్రవారం నాడు వాగు పరివాహక ప్రాంతంలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఎట్టకేలకు శనివారం ఉదయం నిషాని వాగు ప్రాంతంలో జాలర్లకు మృతదేహం కనిపించింది. వారు అందించిన సమాచారంతో పోలీసులు గ్రామస్తులు మృతదేహాన్ని వాగు నుంచి బయటకు తీశారు. అనంతరం సాకడాలో అంతక్రియలు నిర్వహించారు.

### అప్పుడు తండ్రి.. ఇప్పుడు కొడుకు..

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సరిగ్గా 15 ఏళ్ల క్రితం ఇదే పెద్ద వాగులో శ్రీనివాస్ తండ్రి కూడా ప్రవాహంలో గల్లంతై మృతి చెందాడు. ఆయన మృతదేహం 12 రోజుల తర్వాత లభ్యమైనట్టు తెలిపారు. తండ్రి లేని లోటును భరిస్తూ ఎదిగిన శ్రీనివాస్ వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. కానీ విధి వెక్కిరించింది. తండ్రిని మింగిన వాగే కొడుకును కూడా కబళించింది. ఒకే కుటుంబంలోనీ తండ్రీకొడుకులు ఒకే వాగులో ప్రాణాలు కోల్పోవడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటుతున్నాయి. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే ఈ పెద్ద వాగు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ములుగు పర్యాటక ప్రగతికి రాష్ట్రస్థాయి గుర్తింపు

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుకు ఘన సత్కారం



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 26(జనంసాక్షి) :** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామం వేదికగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి, ములుగు జిల్లా పర్యాటక ప్రగతికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన కాకతీయుల శిల్పకళా వైభవం రామప్ప దేవాలయం, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర, లక్నవరం సరస్సు–వేలాడే వంతెన, తెలంగాణ నయాగరాగా ప్రసిద్ధి చెందిన బొగత జలపాతం, ప్రకృతి వనమూలికల నడుమ దట్టమైన గుట్టపై వెలసిన శ్రీ మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం తదితర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషికి ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు మెరుగైన వసతులు కల్పిస్తూ స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో ప్రతిభ కనబరుస్తున్న అధికారుల సేవలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవ, ప్రోత్సాహం, నిరంతర పర్యవేక్షణతో ములుగు జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. మంత్రి అందిస్తున్న సలహాలు, సూచనలు, ఆదేశాలు జిల్లా పర్యాటక ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ గౌరవం జిల్లా అధికారుల సమిష్టి కృషికి దక్కిన గుర్తింపని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, ప్రకృతి, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి దేశవిదేశాల పర్యాటకులను ఆకర్షించేలా నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు.

# అమ్మకు అక్షరమాల ద్వారా
# ములుగు జిల్లాలో 3,597 మందికి అక్షరాస్యత పరీక్ష

- 171 గ్రామ పంచాయతీలు, 20 పట్టణ వార్డుల్లో పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు





**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 26(జనంసాక్షి) :** ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ‘అమ్మకు అక్షరమాల’ ద్వారా ములుగు జిల్లాలోని 171 గ్రామ పంచాయతీలు, 20 పట్టణ వార్డుల పరిధిలో గుర్తించిన 3,597 మందికి ఆదివారం (27.9.2026)న మూల అక్షరాస్యత, సంఖ్యా జ్ఞాన మదింపు పరీక్ష నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో జాతీయ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉల్లాస్ విద్యా కేంద్రాల్లో 100 రోజులపాటు చదవడం, రాయడం, ప్రాథమిక లెక్కలపై శిక్షణ పొందిన అభ్యర్థులు 150 మార్కులకు పరీక్ష రాయను న్నట్లు వివరించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధిం చిన వారికి జాతీయ సార్వత్రిక విద్యా పీఠం నుంచి అక్షరాస్యత ధ్రువపత్రం అంద జేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభ్యర్థుల కోసం స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో, ములుగు పట్టణ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల సౌకర్యాన్ని బట్టి రెండు గంటలపాటు పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా ఏటూరు నాగారంలో 435 మంది, గోవింద రావుపేటలో 223 మంది, కన్నాయిగూడెం లో 220 మంది, మంగపేట లో 421 మంది, ములుగు మండలం లో 115 మంది, ములుగు పట్టణ పరిధిలో 120 మంది, తాడ్వాయి లో 23 మంది, వెంకటాపూర్ లో 325 మంది, వెంకటాపురం లో 719 మంది, వాజేడు లో 996 మంది చొప్పున మొత్తం 3,597 మంది పరీక్ష రాయనున్నట్లు వివరించారు. అక్షరజ్ఞానం వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చడంతోపాటు రోజువారీ జీవితంలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కల్పిస్తుందని కలెక్టర్ తెలిపారు. చదవడం, రాయడం, ప్రాథమిక లెక్కలు నేర్చుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు, బ్యాంకు లావాదేవీలు, ఆరోగ్య సూచనలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకొని పరీక్షకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అక్షరాస్యులుగా సమాజంలో గౌరవం, గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అభ్యర్థుల కుటుంబ సభ్యులు వారిని ప్రోత్సహించి పరీక్ష కేంద్రాలకు పంపిం చాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, కూర్చునే సదుపాయం వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గుర్తించిన అభ్యర్థులం దరూ పరీక్షకు హాజర య్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా శాఖల సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

# మణుగూరు ప్రజల మృత్యు ఘోష..!

- బొగ్గు పొడి పరమాన్నం.. దుమ్ము ధూళే ఆక్సిజన్
- శ్వాస కోస, చర్మ ,గుండె జబ్బుల బారినపడుతున్న ప్రజలు
- నరకప్రాయంగా మారిన ప్రజల జీవనం..
- పట్టించుకోని పాలకులు, అధికారులు..

**మణుగూరు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** మణుగూరు.. బొగ్గు గనుల కేంద్రంగా దేశానికి వెలుగులు పంచుతున్న పవర్ ప్లాంట్ ఉన్న ప్రాంతం. కానీ, అదే వెలుగుల వెనుక ఇక్కడి ప్రజల జీవితాలు మాత్రం తీవ్ర చీకట్లోకి, రోగాల కూపంలోకి నెట్టబడుతున్నాయి. ఒకవైపు అధ్వాన్నపు రహదారులు, మరోవైపు గాల్లో తేలియాడే బొగ్గు పొడి, మట్టి దుమ్ము దూళి వెరసి మణుగూరు ప్రజల పాలిట ఇవి శాపాలుగా, ప్రాణాలు తీసే మృత్యు శకటాలుగా మారాయి. ఇక్కడ బతకాలంటే శ్వాస తీసుకోవడం ఒక సాహసంగా మారింది. 'రహదారి బాగాలేక ఆక్సిజర్ బదులు దుమ్మును పీల్చుకుంటూ.. స్నాక్స్ బదులు మట్టి, బొగ్గు చిప్స్ తింటూ జీవనం సాగించడం' అంటే ఏమిటో మణుగూరు వాసులను చూస్తే అర్థమవుతుంది.రోడ్లా ఇవి.. మృత్యుకూపాలా? మణుగూరు పరిధిలోని ప్రధాన రహదారుల పరిస్థితి చూస్తే అసలు ఇవి రోడ్లేనా లేక చెరువులా అనే అనుమానం రాక మానదు. భారీ బొగ్గు టిప్పర్లు, లారీలు నిరంతరం ప్రయాణించే ఈ మార్గాల్లో పెద్ద పెద్ద గోతులు పడినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బైకులపై వెళ్లే సాధారణ వాహనదారులు ఎప్పుడు ఏ గుంతలో పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందో తెలియని భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు. వర్షం వస్తే బురద మయం, ఎండ కొడితే దుమ్మూధూళితో ఈ రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయి.

### శ్వాసిస్తున్నది గాలి కాదు.. బొగ్గు పొడి

మణుగూరు ప్రజలు పీల్చే గాలిలో ఆక్సిజన్ కంటే బొగ్గు పొడి, ఇసుక రేణువులే ఎక్కువగా ఉంటున్నాయి. నిత్యం వందలాది లారీల ద్వారా బొగ్గు, ఇసుక రవాణా జరుగుతున్నప్పుడు కనీస నిబంధనలు పాటించకపోవడం వల్ల బొగ్గు చిప్స్, మట్టి రోడ్లపై పడి, అవి వాహనాల వేగానికి గాల్లోకి లేస్తున్నాయి. ఇళ్లపై, దుకాణాలపై, చివరకు తినే ఆహార పదార్థాలపై కూడా ఈ నల్లటి బొగ్గు పొడి దుమ్ము పేరుకుపోతోంది. ఒక రకంగా చెప్పాలంటే మణుగూరు ప్రజలు నిత్యం మట్టిని, బొగ్గు చిప్స్‌ను తింటూ బతుకుతున్నారు. దీనివల్ల చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆస్తమా, బ్రోన్కైటిస్, క్షయ (టీబీ) వంటి తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులతో పాటు చర్మ రోగాల బారిన పడుతున్నారు. బయటికి వెళ్తే బట్టలు దుమ్ము బురదమయం అవుతున్నాయి.

### పాలకులు, అధికారుల నిర్లక్ష్యం

సింగరేణి, బిటిపిఎస్ సంస్థల ద్వారా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నా, ఇక్కడి మౌలిక వసతుల కల్పనలో, ముఖ్యంగా రహదారుల మరమ్మతుల్లో ఆర్ అండ్ బి మున్సిపల్ ,పంచాయతీ అధికారులు, పాలకులు పూర్తిగా



విఫలమయ్యారు. బొగ్గు రవాణా చేసే లారీలపై తార్పాలిన్ కప్పాలనే నిబంధనలు ఉన్నా వాటిని పర్యవేక్షించే అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రోడ్లపై దుమ్ము లేవకుండా కనీసం నీళ్లు చల్లే బాధ్యతను కూడా విస్మరించడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట.ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులు పాలకులు సీఎస్పీ నుంచి హనుమాన్ టెంపుల్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు మేర సింగిల్ రహదారి దీన్ని వేయటానికి ఆపసోపాలు పడుతున్నారు. గుంతల్లో కంకర పొడి వేసి మ..మ.. అంటున్నారు. అవి రెండు రోజులకే దుమ్ము లేచి గుంతలు పడుతున్నాయి. కథల్లోనూ సినిమాల్లోనూ ఇలా జరుగుతుంది అనుకున్నాం కానీ ఇది నిజంగా మణుగూరు లోనే జరుగుతుందని ప్రజల ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ దుస్థితిపై స్థానికులు ఎంత మొరపెట్టుకున్నా, నిరసనలు తెలిపినా స్పందన కరువైంది. ఓట్ల కోసం వచ్చే నాయకులకు, లాభాల కోసం చూసే సంస్థలకు ఇక్కడి ప్రజల ఆరోగ్యం, ప్రాణాలు పట్టవా అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, సింగరేణి, బి టి పి ఎస్ యాజమాన్యం తక్షణమే స్పందించాలి. యుద్ధప్రాతిపదికన మణుగూరు రహదారులను నిర్మించి, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలనీ స్థానికులు కోరుతున్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కరాటే వేణుకు మంత్రి పొంగులేటి అభినందనలు



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** ఖమ్మం పట్టణానికి చెందిన సుమన్ షూటర్స్ అకాడమీ ఇండియా ఉపాధ్యక్షులు, కరాటే క్రీడాకారుడు కరాటే వేణు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం పట్ల తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఏప్రిల్ 26న నిర్వహించిన, ప్రతిష్టాత్మక కరాటే కార్యక్రమంలో సుమారు 2,000 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు లక్ష్యంగా నిర్వహించిన, ఈ కార్యక్రమంలో ఖమ్మం నుంచి పాల్గొన్న కరాటే వేణు తన ప్రతిభను చాటుకుని గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వామిగా నిలిచారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, కరాటే వంటి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఖమ్మం జిల్లాకు గర్వకారణమని, కరాటే వేణు సాధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడల పట్ల యువతలో ఆసక్తిని పెంపొందిస్తూ, మరింత మంది క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వేణు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భారీ సంఖ్యలో కరాటే క్రీడాకారులు, ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం క్రీడా రంగంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఖమ్మం నుంచి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించిన కరాటే వేణును పలువురు క్రీడాభిమానులు అభినందించారు. క్రీడా రంగంలో ఖమ్మం ఖ్యాతిని మరింత పెంచేలా కరాటే వేణు చేస్తున్న కృషి అభినందనీయమని ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, చల్లా రామకృష్ణారెడ్డి, దుర్గాబాయి, వట్టికొమ్మ శ్రీనివాసరెడ్డి, మందడపు నాగేశ్వరరావు, మొగిలిచర్ల సైదులు, కొప్పెర ఉపేందర్, విష్ణు, ప్రసాద్ ఎయిర్టెల్ నరసరావు తదితరులు పేర్కొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ, కరాటే వేణు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# భద్రాచలంలో గణేశ్ భక్తులకు కష్టాలు

- గంటల తరబడి కరకట్టపైనే నిరీక్షణ..
- కనీస వసతులు కరువు
- ఒక్క లాంచ్‌తో నిమజ్జనం..
- భారీగా పెరుగుతున్న విగ్రహాల క్యూ



భద్రాచలం, సెప్టెంబరు 26 (జనంసాక్షి) : గణేశ్ నిమజ్జనానికి వచ్చిన భక్తులకు భద్రాచలంలో కష్టాలు తప్పడం లేదు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలను తీసుకొచ్చిన భక్తులను కొరవరం రోడ్డు జాతీయ రహదారి నుంచి గోదావరి విమోచన ఘాట్ వరకు కరకట్టపై గంటల తరబడి నిలిపివేస్తున్నారు. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరకట్టపై తాగునీరు, ఇతర కనీస వసతులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల పరిస్థితి దయనీయంగా మారింది.

### భారీ విగ్రహంతో తప్పిన పెను ప్రమాదం

శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన భారీ గణేశ్ విగ్రహం నిమజ్జనం సమయంలో అదుపుతప్పడంతో పెను ప్రమాదం తప్పింది. సిబ్బంది కొరతతో పాటు సమన్వయం లోపించడంతోనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను త్వరితగతిన తరలించేలా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు మరిన్ని లాంచ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. అలాగే కరకట్టపై తాగునీరు, వైద్య, పారిశుద్ధ్య తదితర కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# 30లోపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు పూర్తి చేయాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. నిజామాబాద్ నగరం సహా ఆర్మూర్, బోధన్, రుద్రూర్, మోర్తాడ్, బాల్కొండలలో అర్హులైన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన చోట లబ్దిదారులకు కేటాయింపులు జరుపుతున్నామని, ఇదే తరహాలో మిగతా చోట్ల కూడా ఈ నెలాఖరు లోగా కేటాయింపులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన లబ్దిదారుల జాబితాను సమగ్ర పరిశీలన జరపాలని, ఆ జాబితా ఆధారంగా డ్రా పద్ధతిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, హౌసింగ్ ఇంచార్జి పీ.డీ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, హౌసింగ్ ఏ.ఈ నివర్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించు కుని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పండుగలను ప్రశాంతంగా నిర్వ హించేందుకు మున్సిపల్ చైర్మన్ జాము రవి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని స్ట్రీట్ లైట్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యాలు తదితర అంశాలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతు లను ముందస్తుగా కల్పించడంపై అధికారులు, కౌన్సిలర్లతో సమీక్షించారు.పండుగల సందర్భంగా విద్యుత్ దీపాల ఏర్పాటు, ఆలయాల పరిసరాల్లో ప్రత్యేక విద్యుత్ సౌకర్యాలు, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను చైర్మన్ జాము రవి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పండుగలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట గోపాల్ , వైస్ చైర్మన్ మోర్సుబాయ్ శశి రేఖతో పాటు కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, ముద్దం పాపిరెడ్డి, గిరిపల్లి రమేష్, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీలత, ఆది అజయ్ కుమార్, కొంపల్లి మాధవి, దోసకాయల లత, మెడబోయిన మౌనిక, కొల్లాస్ రాజు, గిరిపల్లి జ్యోతి, వంగ ప్రియాంక ,మూడవత్ నవీన్, గొంది శ్రావణి, ఇర్రి స్వప్న, బొమ్మలపల్లి మల్లేష్,ఆర్వో హర్షద్, ఆర్ఐలు రాజేశ్వర్ రెడ్డి, గౌతమి, డీఈ స్ఫూర్తి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్ సింగ్, ఏటీపీవో సుభాష్ తదితర మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వరిధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి




కామారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) : వానకాలం (ఖరీఫ్) 2026-27 సీజన్‌కు సంబంధించి వరిధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు సకాలంలో మద్దతు ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన బోనస్‌కు అర్హత కలిగిన సన్న రకాల ధాన్యంపై కూడా కలెక్టర్ వివరించారు. ఏడు సన్న రకాల ధాన్యం సమాచారాన్ని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు పూర్తిగా తెలుసుకుని, రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. రైతులకు మద్దతు ధర, బోనస్‌కు సంబంధించిన నిబంధనలు, ధాన్యం నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించే విధంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్ఓ, డీఎంసీఎస్, ఎఫ్‌సీఐ మేనేజర్, డీసీఓ, పీడీ డీఆర్‌డీఏ, డీఎంఓ, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు 30 చివరి తేదీ




**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సార్వత్రిక అధ్యయన కేంద్రం ద్వారా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్, అధ్యయన కేంద్రం సమన్వయకర్త అంజయ్య తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంటర్మీడియట్, ఐటీఐ లేదా ఏదైనా రెండేళ్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీలో చేరేందుకు అర్హులని వారు తెలిపారు. ఉద్యోగాలు, ఇతర కారణాలతో చదువును కొనసాగించలేకపోయిన వారు, గృహిణులు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డిగ్రీలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న వారు నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7382929779 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి



**సూర్యాపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో టూరిజం కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ నేతృత్వంలో డిప్యూటీ కలెక్టర్లు, డీఈవో, డీఆర్వో లతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల స్థితిగతులను పరిశీలించి, వాటి అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ నివేదికను తయారు చేస్తుందని తెలిపారు. దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతర, మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం, జానపహాడ్ దర్గా ఉర్సు, పిల్లలమర్రి శివాలయం వంటి ఆధ్యాత్మిక ప్రసిద్ధి చెందిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. సెలవు దినాల్లో ప్రజలు సమయం గడిపేందుకు అనువుగా వల్లభాపురం, ఇతర సమీప చెరువుల వద్ద వికండ్ లేజర్ యాక్టివిటీస్, పిక్నిక్ స్పాట్లను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పర్యాటక విధానానికి అనుగుణంగా ప్రణాళికలు ఉండాలని, స్పష్టం చేశారు. అనంతరం డాక్యుమెంట్ ప్రదర్శన, విద్యార్థుల నృత్యాలు తిలకించి, విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విజేతలకు, కార్యక్రమ నిర్వహణకు కృషి చేసిన పర్యాటక, విద్యా శాఖ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ప్రేమ్ రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్స్ రవి తేజ, అనూష, డిసిహెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, డిఈఓ అశోక్ , డిఐఈఓ సులోచన రాణి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలి

- కలెక్టర్ దివాకర్ టీఎస్



**ఎర్రుపాలెం, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** ఎర్రుపాలెం మండలంలో రెవెన్యూ సమస్యలను జాతీయం లేకుండా పరిష్కరించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పేర్కొన్నారు. శనివారం ఎరుపాలెం మండలంలో పర్యటించి తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు.మొదటి విడుదలతో ఐదు గ్రామాలలో చేపడుతున్న భూ సర్వే పంచనామ పత్రాలు, కంప్యూటర్ డెటా ఎంట్రీ విధానంను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడుతూ, భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించాలని, రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమ పురోగతిపై ఆరా తీశారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానం, ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల కు ఎదురై సమస్యలను పరిషార్కంలో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు అందించే సేవల విషయంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల సంబంధించిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మండల కార్యాలయాలకు వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ ఎర్రుపాలెం మండల తహసీల్దార్ సునీత ఎలిజబెత్, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ, రవికుమార్,శిరీష, సర్వేయర్ రాజశేఖర్, పలువురు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రతిభావంతులకు అండగా లీగల్ ఎయిడ్ క్లినిక్

- కలెక్టరేట్‌లో న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం
- బాధితులు సద్వినియోగం చేసుకోవాలి




**సూర్యాపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** శారీరక, మానసిక, వైకల్యాలున్న ప్రత్యేక ప్రతిభావంతులకు చట్టపరమైన రక్షణ, ఉచిత న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ (న్యాయ సహాయ కేంద్రం) ఏర్పాటైంది.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు,స్కీమ్-2024 నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి డాక్టర్ పి.శివరామ్ ప్రసాద్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భవ్య కోవిలతో కలిసి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి డాక్టర్ పి.శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులు, మానసిక వైకల్యాలున్న వారికి అండగా నిలిచేందుకు ఈ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాధితులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాలు, సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు చట్టపరమైన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ కలెక్టరేట్ లోనే దివ్యాంగుల కోసం ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమన్నారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలున్నా బాధితులు సంకోచించకుండా ఈ క్లినిక్‌ను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా లభించే సేవలపై దివ్యాంగులు, సాధారణ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.హసన్, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్యానెల్ న్యాయవాది దావుల చిన్న వీరప్రసాద్, పారా లీగల్ వాలంటీర్ జయ, న్యాయ, సంక్షేమ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విపణి



## ఇ-ట్రోన్ సింగిల్ ఛార్జ్‌తో ఏకంగా 1338 కి.మీ ప్రయాణం..

### ఆడి గిన్నిస్ రికార్డు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడికి చెందిన ౦6 ఇ-ట్రోన్ అరుదైన మైలురాయిని అందుకుంది. సింగిల్ ఛార్జ్‌తోనే ఏకంగా 1,338 కిలోమీటర్లు ప్రయాణించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. డ్రైవర్ మికో మార్జిక్ ఈ ఘనత సాధించారు. 45 గంటల పాటు సాగిన ప్రయాణంలో ఆడి 1,338 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేసింది. ఈ లగ్జరీ కారు డబ్ల్యూఎల్‌టీపీ (చిబుఖ) రేటింగ్ ప్రకారం ఒక్కసారి ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 777 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తుంది. కానీ, డ్రైవర్ అదనంగా 561 కిలోమీటర్లు ప్రయాణించడం విశేషం. ఇది 5.4 సెకండ్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 367 హెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేసే ఈ కారు బ్యాటరీ సామర్థ్యం 94.9 ఎచిష్త.

## హైదరాబాద్‌లో ఓన్లీ సేవలు: ర్యాపిడో

**హైదరాబాద్:** రవాణా సేవలను అందించే ర్యాపిడో తన ఆహార డెలివరీ యాప్ 'ఓన్లీ' సేవలను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చింది. బెంగ ళూరు తర్వాత ఈ యాప్ సేవలు ప్రారంభమైన రెండో నగరం ఇది. ఈ ఏడాది అక్టోబరు-డిసెంబరు నుంచి దేశంలోని అన్ని ప్రధాన మెట్రో నగరాల కూ ఈ సేవలు విస్తరించనున్నట్లు ర్యాపిడో, ఓన్లీ సహ వ్యవస్థాపకుడు అరవిం ద్ తెలిపారు. బెంగళూరులో ప్రవేశ పెట్టిన రెస్టారెంట్ అనుకూల, జీరో కమిషన్ నమూనానే హైదరాబాద్‌లోనూ అమలు చేస్తున్నట్లు చెప్పారు. బెంగ ళూరులో 25,000కు పైగా రెస్టారెంట్ భాగస్వాములతో పనిచేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ర్యాపిడో సేవలకు మంచి ఆదరణ, విస్తృతమైన కెప్టెన్ నెట్‌వర్క్ ఉందని పేర్కొన్నారు. అందుకే, ఇక్కడ విస్తరించినట్లు తెలిపారు.

# బ్యాంకింగ్‌లో కొనుగోళ్ల బాజా

### ఫెడరల్ బ్యాంక్ చేతికి జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో మరో భారీ విలీనానికి రంగం సిద్ధమవుతోంది. బెంగళూరు కేంద్రం గా పనిచేస్తున్న జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్‌ఎ ఫ్‌బీ)ను కొనుగోలు చేసేందుకు కేరళలోని అలువా కేంద్రంగా పనిచేసే ఫెడరల్ బ్యాంక్ తుది దశ చర్చలు జరుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం షేర్ స్వాప్ (ఈక్విటీ షేర్ల మార్పిడి) పద్ధతిలో జరగనుంది. గతంలో కోటక్ మహీంద్రా బ్యాంక్- ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ (2015), ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్- ఫిన్‌కేర్ ఎస్‌ఎఫ్‌బీ (2023) విలీనాలు ఇదే తరహాలో జరిగాయి. ప్రస్తుతం ఫెడరల్ బ్యాంక్ మార్కెట్ విలువ దాదాపు రూ.82,000 కోట్లు కాగా, జన ఎస్‌ఎఫ్‌బీ మార్కెట్ విలువ రూ.5,600 కోట్లుగా ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం.. జన ఎస్‌ఎఫ్‌బీ షేరును రూ.620- 650 శ్రేణిలో, ఫెడరల్ బ్యాంక్ షేరును మార్కెట్ ధర కంటే కాస్త ఎక్కువగా దాదాపు రూ.350 వద్ద లెక్కకట్టి, స్వాప్ రేషియోను ఖరారు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి. బ్యాంకుగా రద్దు కానున్న జన ఎస్‌ఎఫ్‌బీ: ఈ కొనుగోలు పూర్తయ్యాక, జన ఎస్‌ఎఫ్‌బీకి చెందిన మొత్తం ఆస్తులు, రుణాలు ఫెడరల్ బ్యాంక్‌లో విలీనమవుతాయి. తద్వారా జన ఎస్‌ఎఫ్‌బీ స్వతంత్ర బ్యాంకుగా ఉనికి కోల్పోతుంది. ఈ బ్యాంకు హోల్డింగ్



కంపెనీ అయిన జన హోల్డింగ్స్‌లో ప్రధాన పెట్టుబడిదారు అయిన అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం టీపీజీ.. ఈ ఒప్పందం ద్వారా నిష్క్రమించనుంది. ఫెడరల్ బ్యాంక్‌కే ఎక్కువ ప్రయోజనం: ఆర్‌బీఐ నిర్దేశించిన ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యాలను చేరుకోవడానికి జన ఎస్‌ఎఫ్‌బీ మైక్రోఫైనాన్స్ పోర్ట్‌ఫోలియో, ఫెడరల్ బ్యాంక్‌కు దోహదపడనుంది. ఉత్తర, మధ్య భారత్‌లోని అట్టడుగు వర్గాలకు విస్తరించిన జన బ్యాంక్ ద్వారా ఫెడరల్ బ్యాంక్ లాభదాయకత పెరగడంతో పాటు సేవలూ విస్తరించనున్నాయి. కొన్ని చిక్కులు కూడా ఉన్నాయ్: 2026 జూన్‌కు ఫెడరల్ బ్యాంక్ రుణాల పోర్ట్‌ఫోలియో రూ.2.77 లక్షల కోట్లు కాగా, బ్యాంక్‌లో 17,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

కేవలం రూ.37,600 కోట్ల రుణాల పోర్ట్‌ఫోలియో కలిగిన జన ఎస్‌ఎఫ్‌బీలో 26,000 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది మైక్రోఫైనాన్స్ రికవరీ-క్షేత్రస్థాయి విధుల్లో ఉండే ఫీల్డ్ ఉద్యోగులే. ఇంత మంది ఉద్యోగులను ఫెడరల్ బ్యాంక్‌లోకి ఎలా తీసుకురావాలన్న దానిపై ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంది. ఐడీబీఐ బ్యాంకులో వ్యూహాత్మక వాటా కొనుగోలు కోసం వచ్చిన ఆర్థిక బిడ్‌లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ ప్రక్రియ స్థిర వేగంతో ముందుకు సాగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఐడీబీఐ బ్యాంక్‌లో 60.72% వాటా కొనుగోలు నిమిత్తం జులైలో ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్, దుబాయ్‌కు చెందిన ఎమిరేట్స్ ఎన్‌బీడీ సవరించిన బిడ్‌లు దాఖలు చేశాయి. ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌లో ప్రముఖ బిలియనీర్ ప్రేమ్ వాత్సాకు పెట్టుబడులు ఉన్నాయి. ఈ రెండు సంస్థలకు ఇప్పటికే భారత బ్యాంకింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టిన అనుభవం ఉంది. ఆర్‌బీఎల్ బ్యాంకులో ఎమిరేట్స్ ఎన్‌డీబీ మెజార్టీ వాటా కొనుగోలు చేయగా.. సీఎస్‌బీ బ్యాంకులో ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ 40% వాటా కలిగి ఉంది. ఈ రెండు సంస్థలు ఇప్పటికే హోం శాఖ నుంచి భద్రతా అనుమతులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి 'ఫిట్ అండ్ ప్రాపర్' మదింపును పొందాయి. ఐడీబీఐ బ్యాంకులో వాటా కొనుగోలుకు ఆసక్తిగల సంస్థలు, ఆర్థిక బిడ్‌లను దాఖలు చేయడం ఇది రెండో సారి. ఈ బ్యాంకులో ప్రభుత్వం, ఎల్‌ఐసీ కలిసి 60.72% వాటా విక్రయించాలని అనుకుంటున్నాయి.

## ఆడిటింగ్ పనులు ముందుగానే పూర్తి చేసుకోండి

### సీఏలకు ఐసీఏఐ సూచన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఈనెల 28-30 తేదీల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకుల సమ్మె జరుగుతున్న నేపథ్యంలో.. చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ) తమ ఆడిటింగ్ పనులను ముందే పూర్తి చేసుకోవాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సూచించింది. సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాల్సిన పనులకు ఆటంకం కలగకుండా, ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవాలని వివరిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఆడిట్‌లకు అవసరమైన బ్యాంకు సమాచా రం, ధ్రువీకరణ పత్రాలను త్వరగా సేకరించుకోవాలని ఐసీ ఏఐ



కోరింది. చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదురుకా కుండా, ఖాతాదారుల నుంచి అవసరమైన బ్యాంకింగ్ వివరాలను ముందే తెప్పించుకోవాలని సీఏలకు ఐసీఏఐ స్పష్టం చేసింది. ఆదివారం తమ శాఖలు తెరచి ఉంచుతు న్నందున, ఖాతాదార్లు తమ కార్యకలాపాలు నిర్వహించు కోవాలని ప్రభుత్వరంగ బ్యాంకులు కోరాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్‌బ్యాంక్, ఇండస్‌ఇండ్‌బ్యాంక్ 28-30 తేదీల్లో తమ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగించనున్నాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,62,254 (22 క్యారెట్లు) | ₹ 1,77,008 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)


హైదరాబాద్

₹ 2,50,000

## సమ్మె కాలంలో ఏటీఎం లావాదేవీలపై రుసుముల రద్దు

### ఎస్‌బీఐ సహా ప్రభుత్వరంగ బ్యాంకుల వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** వారంలో 5 రోజుల పని కావాలనే ప్రధాన డిమాండ్‌తో, ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగులు ఈనెల 28 నుంచి 30 వరకు సమ్మె చేస్తుండగా.. వారికి అటువంటి హామీ ఇవ్వలేదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఉద్యోగులకు సంబంధించి చాలా డిమాండ్లు పరిష్కరించినట్లు తెలిపింది. ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగం ఆఖరి 3 రోజులు బ్యాంకులు పనిచేయకపోతే ఇబ్బంది కనుక, ఈనెల 27న (ఆదివారం) బ్యాంకులు పనిచేయాలనీ ప్రభుత్వం ఆదేశించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో పాటు మిగిలిన ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ తమ ఖాతాదారులకు ఊరట కల్పించాయి. ఈ 3 రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా ఏ బ్యాంకు ఏటీఎంలో నగదు ఉపసంహరించుకున్నా, ఎలాంటి లావాదేవీ రుసుములూ ఉండవని తెలిపాయి. సమ్మె రోజుల్లో బ్యాంకింగ్ సేవలకు



అంతరాయం కలుగు తాయి కనుక, బ్యాంకు శాఖల ద్వారానే పూర్తి కావాల్సిన అత్యవసర పనులను.. ఆదివారం చేసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. ఇందుకోసమే తమ బ్యాంకు శాఖలు ఆదివారం (ఈనెల 27) పనిచేస్తాయని తెలిపాయి.. సమ్మెరోజుల్లో నగదు అవసరాల కోసం ఏటీఎంలు, కస్టమర్ సర్వీస్ పాయింట్లను వినియోగించుకోవాలని సూచించాయి. సాధారణ చెల్లింపులు, నగదు బదిలీ కోసం ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, వాట్సప్ బ్యాంకింగ్ సహా యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి డిజిటల్ మార్గాలను ఎంచుకోవాలని స్పష్టం చేశాయి. తన ఖాతాదారులు ఇతర బ్యాంకుల ఏటీఎం వాడకంపై అక్టోబరు 1 నుంచి కొత్త పరిమితులను ఎస్‌బీఐ తీసుకురానుంది. వేతన ఖాతా ఎస్‌బీఐలో ఉన్న వారికి, ఇతర బ్యాంకు ఏటీఎంలలో ప్రస్తుతం ఉన్న 10 ఉచిత లావాదేవీల పరిమితిని 5కు తగ్గించనుంది. ఆ పరిమితి దాటిన తర్వాత చేసే ప్రతి నగదు ఉపసంహరణకు రూ.23 ఛార్జీతో పాటు జీఎస్‌టీ; ఇతర లావాదేవీలకు రూ.11తో పాటు జీఎస్‌టీ వసూలు చేయనుంది.

# ఏఐతో మోసగించి..

### ఇటలీ బ్యాంకుకు రూ.1000కోట్ల కుచ్చుటోపి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కేటుగాళ్లు ఏఐని ఉపయోగించి.. ఓ బ్యాంకుకు రూ.వేల కోట్లు కుచ్చుటోపి వేశారు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించి రూ.1034 కోట్లు కొల్లగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ భారీ మోసం ఇటలీలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు ఇంటెసా శాన్‌పాలోలో చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..? ఇటలీలో అతిపెద్ద బ్యాంకు ఇంటెసా శాన్‌పాలో సంబంధిత విభాగమైన ఫిద్యూరమ్ మాజీ ఛైర్మన్ పావొలో మోలెసినిని ఫిబ్రవరిలో కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. ఇంటెసా శాన్‌పాలో సీఈఓ కార్లో మెస్సీనాలా నమ్మబలికి ఏఐ వాయిస్ క్లోనింగ్ సృష్టించి ఫోన్ కాల్ చేశారు. దీంతో మాజీ ఛైర్మన్ పావొలో ఇదంతా నిజమనుకొని.. విదేశీ ఖాతాల్లోని నిధులను ట్రాన్స్‌ఫర్ చేయాలని తన ఫైనాన్స్ విభాగాన్ని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలను ఫిద్యూరమ్ సంస్థ వెంటనే గుర్తించి.. తక్షణమే విదేశాల్లోని బ్యాంకులను, సిబ్బందిని అలర్ట్ చేసినట్లు సదరు కథనాలు తెలిపాయి. ఈ చర్యల వల్ల దాదాపు రూ.570 కోట్ల నగదును రికవరీ చేయగలిగారు. కానీ, మిగతా మొత్తం పలు విదేశీ ఖాతాల్లోకి బిట్‌కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీలుగా మారిపోవడంతో వాటిని గుర్తించలేకపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినప్పటి నుంచీ భారత్.. ఇంధన దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే భారత్ అవసరాల (ఎనిటతిజీబ ఇనివతీణఎ ఔవవటబ)కు తగ్గట్టు ఇంధనం సరఫరా చేయాలని ట్రంప్



యంత్రాంగం యోచిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు, ఇంధన ఆంక్షల విషయంలో అమెరికా కఠిన వైఖరి అనుసరిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో భారత్‌కు భారీగా ఇంధన అవసరాలు ఉన్నందున.. ఆ అవకాశాన్ని తాము వినియోగించుకోవాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. యుద్ధం వల్ల కొన్ని నెలలపాటు ఇరాన్, పశ్చిమాసియా దేశాల నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోవడంతో ప్రపంచ మార్కెట్‌లో ఇంధన లభ్యత పరిమితంగా ఉందని సదరు అధికారి పేర్కొన్నారు. అయితే వెనెజువెలాపై ట్రంప్ (ఆనీనిజీశ్రీట ంతీబీఎజూ) చేపట్టిన విజయవంతమై ఆపరేషన్‌తో ప్రస్తుతం అమెరికా వద్ద పెద్ద మొత్తంలో చమురు నిల్వలు ఉన్నాయన్నారు. భారత్ వంటి మిత్ర దేశాలకు చమురు విక్రయించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

**బ్యాంకింగ్‌లో కొనుగోళ్ల బాజా**

అమెరికా కాంగ్రెస్ ఇటీవల 'ద లిండ్సే గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్-2026' బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ సంతకం కూడా చేయడంతో ఇది చట్టరూపం దాల్చింది. రష్యా, ఇరాన్‌లపై రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం జరుపుతోన్న భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించేందుకు ఈ చట్టంతో ట్రంప్‌నకు అధికారం లభించినట్లయ్యింది. ఈ కొత్త చట్టం.. భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపైనా ప్రభావం చూపుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

## 22 కంపెనీలకు ఐఐటీల అల్టిమేటం



మనదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ విద్యా సంస్థలంటే ముందుండేవి ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లే. అక్కడ సీటు రావడంతోనే, విద్యార్థులు ఉద్యోగం వచ్చినంత సంబరాలు చేసుకుంటారు. ఎందుకంటే ఐఐటీలో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు కంపెనీలు అత్యుత్తమ ప్యాకేజీలు ప్రకటిస్తున్నందునే. అయితే తమ క్యాంపస్ నియామకాల్లో పాలుపంచుకోరాదని 22 కంపెనీలకు ఐఐటీలు అల్టిమేటం జారీ చేశాయి. ఇందులో దిగ్గజ కంపెనీ ఒరాకిల్ కూడా ఉండటం గమనార్హం. ఐఐటీల నిర్ణయానికి తగిన కారణం లేకపోలేదు. 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థులకు, ఆఫర్ లెటర్లు ఇచ్చినా.. ఉద్యోగాలివ్వడంలో ఆయా కంపెనీలు విఫలం కావడమే ఇందుకు నేపథ్యం. అందుకే మరో రెండు ప్లేస్‌మెంట్ సీజన్ల వరకు ఆయా కంపెనీలకు తాము సహకరించబోమని ఐఐటీలు కుండబద్దలు కొట్టాయి. సాధారణంగా ఇంజినీరింగ్ చివరి సంవత్సరం మధ్యలోనే కళాశాలల ప్రాంగణాల్లో కంపెనీలు ఎంపికలు జరిపి, ఆఫర్ లెటర్లు ఇస్తుంటాయి. ఇప్పుడు కూడా ఈ ప్రక్రియకు కంపెనీలు సిద్ధమవుతున్న తరుణంలో ఐఐటీలు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ నెల మొదట్లో ఐఐటీ గువాహటిలో జరిగిన సమావేశంలో ఆల్ ఐఐటీస్ ప్లేస్‌మెంట్ కమిటీ (ఏఐపీసీ) ఈ నిర్ణయం తీసుకుంది. అన్ని ఐఐటీలకు కలిపి ప్లేస్‌మెంట్లు, ఇంటర్న్‌షిప్‌నకు బాధ్యత వహించే ఏఐపీసీ, ఈ నెలాఖరులో అధికారికంగా తమ నిర్ణయం గురించి ఆయా కంపెనీలకు లేఖలు రాయనుందని సమాచారం. అయితే 'బ్లాక్‌లిస్టింగ్' పదానికి బదులుగా, 'నాన్ కోఆపరేషన్'ను ఎంచుకున్నట్లు తెలిసింది. 23 ఐఐటీల్లో 150కి పైగా ఉద్యోగ ఆఫర్ లెటర్లను ఈ కంపెనీలు, నెరవేర్చలేకపోవడమే ఇందుకు నేపథ్యం. కొన్ని కంపెనీలు 10-15 ఆఫర్లను ఉపసంహరించుకున్నట్లు ఏఐపీసీ కన్వీనర్ జాన్ జోస్ చెప్పినా, కంపెనీల పేర్లను వెల్లడించలేదు. క్యాంపస్ వర్గాల కథనం



ప్రకారం, అందులో అమెరికా సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఒరాకిల్ కూడా ఉంది. ఈ దిగ్గజ సంస్థ 40 ఉద్యోగ ఆఫర్లను గౌరవించడంలో విఫలమైందని సమాచారం. ఈ సంస్థ మనదేశంతో పాటు అంతర్జాతీయంగా వేలకొద్దీ లేఆఫ్‌లను ప్రకటిస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ప్రాంగణ ఎంపికల కోసం ఐఐటీలను ఒరాకిల్ సంప్రదించలేదనీ జోస్ తెలిపారు. ఐఐటీల 'నాన్ కోఆపరేషన్' జాబితాలో పలు అంకురాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆఫర్ లెటర్లు ఇచ్చి, ఉద్యోగాలు ఇవ్వని కంపెనీలను నేరుగా ఆయా ఐఐటీలు గతేడాది సంప్రదించాయి. 10-11 కంపెనీలు ఉద్యోగాలివ్వడంలో విఫలమయ్యాయని, ఈ ఏడాది మరిన్ని ఎక్కువ కంపెనీలు ఆ బాట పట్టడంతో అన్ని ఐఐటీలూ కలిసి ఏఐపీసీ ద్వారా సంప్రదింపులు చేపట్టాయని జోస్ వివరించారు. ఉద్యోగాలు రాకుండా ఉన్న విద్యార్థుల సీవీ (కరిక్యులమ్ విట)లను ఇతర కంపెనీలకు పంపామని, అందులో 20-30% మందికి ఉద్యోగాలు రావొచ్చని జోస్ చెబుతున్నారు. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల పూర్తి సమాచారం ఇంకా తమ వద్ద లేదన్నారు. కొంత మంది స్వతంత్రంగానే ఉద్యోగాలు దక్కించుకుని ఉంటారని పేర్కొన్నారు.

## రూ.1,279 కోట్ల రైట్స్ ఇష్యూ: నాట్కో ఫార్మా

హైదరాబాద్: ఔషధ సంస్థ నాట్కో ఫార్మా, రైట్స్ ఇష్యూ ద్వారా రూ.1,279.35 కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకు బోర్డు ఆమోదం లభించిందని శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. రూ.2 ముఖ విలువ కలిగిన 1,70,58,082 ఈక్విటీ షేర్లను, రూ.750 ఇష్యూ ధర వద్ద కేటాయించనున్నారు. అక్టోబరు 1ని ఇందుకు రికార్డు తేదీగా నిర్ణయించారు. ఈ తేదీ నాటికి చేతిలో ఉన్న ప్రతి 21 షేర్లకు 2 రైట్స్ షేర్లు పొందొచ్చు. అక్టోబరు 12 - 22 తేదీల్లో ఈ ఇష్యూ కొనసాగనుంది.

## సరికొత్త టాటా ఏరిస్

**దిల్లీ:** కాంపాక్ట్ సెడాన్ మోడల్ ఏరిస్‌లో సరికొత్త వెర్షన్‌ను టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ శుక్రవారం ఆవిష్కరించింది. వ్యక్తిగత వాహన కొనుగోలుదార్ల కోసమే ఈ మోడల్‌ను ప్రవేశ పెట్టినట్లు సంస్థ ప్రకటించింది. పెట్రోల్ మ్యాన్యువల్ కార్లు రూ.5.29-8.19 లక్షల శ్రేణిలో, ఏఎంటీ మోడళ్లు రూ.6.69 - 8.74 లక్షల శ్రేణిలో ఉంటాయి. ఐసీఎన్‌జీ మ్యాన్యువల్ కార్లు రూ.6.29-9.19 లక్షల శ్రేణిలో, ఏఎంటీ కార్లు రూ.7.69-9.74 లక్షల శ్రేణిలో లభిస్తాయి. ఈ కార్లకు బుకింగ్‌లు ప్రారంభమయ్యా యని, డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. టాటా కార్ల ధరలు మళ్లీ పెరిగే అవకాశం: కమొడిటీ ధరలు అంతకంతకూ పెరుగుతున్నందున, కార్ల ధరలను మళ్లీ పెంచే అంశాన్ని కంపెనీ పరిశీలిస్తోందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్ చంద్ర తెలిపారు. కమొడిటీ ధరల వల్ల ఆర్థిక భారాన్ని కంపెనీ భరిస్తున్నందున, మార్జిన్లపై ప్రభావం పడుతోందని



వివరించారు. వ్యయ నియంత్రణ చర్యలు తీసుకుంటూనే, ప్రతినెలా వాహన ధరలపై సమీక్ష చేస్తున్నామని పేర్కొన్నారు. ధరలను ఒకేసారి అధికంగా కాకుండా, క్రమంగా పెంచుతామని.. ఇందువల్ల గిరాకీపైనా ప్రతికూల ప్రభావం పడదని తెలిపారు. ఈ నెలలోనూ కార్ల ధరలు పెంచామని, అందువల్ల మళ్లీ ఎప్పుడు పెంచుతామో ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుందన్నారు. అయితే డిస్కౌంట్లు తగ్గుతాయని స్పష్టం చేశారు.

ఈసీ వివాదం..

## 30న 'ఇండియా కూటమి' నేతల భేటీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఒత్తిడి పెంచే దిశగా విపక్షాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఈ అంశంపై చేపట్టాల్సిన ఆందోళనలపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు ఈ నెల 30న దిల్లీలో భేటీ కానున్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తప్పించాలనే తమ డిమాండ్‌పై పరస్పరం సంప్రదింపులు జరిపి.. ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయంపై 29న కాంగ్రెస్ ప్రత్యేకంగా సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు మరోసారి పార్లమెంటు ఉభయ సభల్లో




నోటీసులు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 73 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన ప్రతిపక్ష కూటమి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ అభిశంసన నోటీసు ఇచ్చింది. అది రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. అది అలా ఉండగానే మరోసారి నోటీసు ఇవ్వాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. కాగా.. సర్ ప్రక్రియలో అవకతవకలు, ఇతర సమస్యలపై ఇప్పటికే 23 రాజకీయ పార్టీలు, ఓ స్వతంత్ర ఎంపీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను సంప్రదించారు. ఇదీ చదవండి: ఎమ్మెల్యేల రెండు పెళ్లిళ్లంటూ సీఎం వ్యాఖ్యలు.. పేర్లు చెప్పాలని భాజపా డిమాండ్

# సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

*సీఎం సభను విజయవంతం చేయాలి: మంత్రి తుమ్మల*

- సిరిసిల్ల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల పనులు
- చేనేత రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- భారీగా తరలిరావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు



**సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్లలోని మణికంఠ గార్డెన్స్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ సన్నాహక సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం సభా స్థలాన్ని పరిశీలించారు. సిరిసిల్లపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, రైతులు, నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తుమ్మల తెలిపారు. సిరిసిల్లలో యారన్ డిపో ఏర్పాటు, నేతన్నల రుణభారం తగ్గించే చర్యలు చేపట్టామని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సిరిసిల్ల నియోజక వర్గంలో సుమారు రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రైతు రుణమాఫీ, మద్దతు ధర, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సభకు గ్రామస్థాయి నుంచి ప్రణాళికాబద్ధంగా జనసమీకరణ చేయాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 33 నెలల ప్రజాపాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం సభ ద్వారా ప్రజలకు వివరిస్తారని తెలిపారు. వ్యవసాయం, మౌలిక వసతులు, సాగునీరు, విద్య, ఉపాధి తదితర రంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సిరిసిల్ల నియోజకవర్గానికి రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైందని తెలిపారు. సభకు సుమారు వెయ్యి బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణారావు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

*సీఎం పర్యటనలో స్పష్టమైన ప్రకటన చేయాలి : చల్మెడ లక్ష్మీ నరసింహారావు*

- 4,696 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలి
- సంకేపల్లిలో 45 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి
- రూ.270 కోట్ల నిధులపై లెక్కలు చెప్పాలి



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): మిడ్ మానేరు ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ముంపు గ్రామాల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. శనివారం వేములవాడ అర్బన్ మండలం కోడుముంజలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడ్ మానేరు నిర్వాసిత కుటుంబాలు 10,683 ఉండగా, ఇప్పటివరకు 5,987 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నాయని, మరో 4,696 కుటుంబాలకు ఇళ్లు అవసరమని తెలిపారు. గతంలో ఇళ్ల నిర్మాణానికి రూ.270 కోట్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, నిధుల విడుదల, వినియోగంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సంకేపల్లిలో 45 కుటుంబాలకు పునరావాసం, పౌర సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. 2023లో పునరావాసానికి సంబంధించిన జీవో జారీ చేసినా ఇప్పటివరకు అమలు కాలేదని ఆరోపించారు. ముంపు గ్రామాల్లో యువత, మహిళలకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, గ్రామపంచాయతీలు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెండింగ్ పరిహారం, పునరావాస సమస్యలను గ్రామాల వారీగా పరిష్కరించాలని కోరారు. సీఎం పర్యటనలో హామీలతో కాకుండా కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని చల్మెడ డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మేకల రవి, రేగులపాటి హరిచరణ్‌రావు, సర్పంచ్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే!

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని, సెప్టెంబర్ 26, (జనంసాక్షి) :** మహనీయుల స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆనాడు మహనీయుల ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన గుర్తు చేశారు. అనాడే ముందుచూపుతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అర్టికల్ 3 పొందుపర్చారని, అంబేద్కర్ అర్టికల్ 3 రాసి ఉండకపోతే తెలంగాణ వచ్చేది కాదనే విషయాన్ని గమనించిన కేసీఆర్ ప్రపంచంలోనే 125 అడుగుల అతిపెద్ద కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారని అన్నారు. మన బావితరాల గురించి వందల ఏండ్ల క్రితమే ఆలోచన చేసి పోరాటాలు చేసిన చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, కొమురంభీంలాంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని చాటుకుంటున్నామని, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారి విగ్రహాలను నెలకొల్పి స్మరించుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు నెహ్రూ, ఇందిరాగాంధీ పాలన నుంచి నేటి రేవంత్‌రెడ్డి పాలన వరకు మహనీయుల చరిత్రను తెలియకుండా చేసి అణిచివేస్తున్నారని అన్నారు. ఈనాడు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఇక్కడి విగ్రహానికి మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం పూలు వేయకపోవడం మహనీయులను అవమానపర్చడమేనన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాకలి ఐలమ్మను గొప్పగా గౌరవించుకుంటామని, ఎన్ని ఆటంకాలు పెట్టినా వాళ్ల చరిత్రనే చాటి చెప్తామన్నారు.



# దళిత యువకుడి పైసాచిక దాడి

**ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు**

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 26(జనంసాక్షి) :** సభ్య సమాజం తలదించుకునే విధంగా సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో దళిత యువ కుని పై విచక్షణ రహితంగా దాడి చేసిన సంఘటన సంచలనం సృష్టించింది. పోలీసులను ఆశ్రయించడంతో దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. వివరాలలోకి వెళితే సుల్తానాబాద్ పట్టణం పూసాల రోడ్డులో నివాసం ఉండే చిలుక ఉదయ్ గత పది సంవత్సరాలుగా పట్టణంలోని నందిని కాన్వ్యాక్చరరిలో కూలీగా పనిచేస్తున్నాడు. పనిచేస్తున్న సమయంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పట్టణానికి చెందిన మునిగంటి రంజిత్ మునిగంటి శ్రావణ్ గోపిడి ఓంకార్ అను ముగ్గురు వ్యక్తులు ఉదయ్‌ని కారులో ఎక్కించుకొని నీరుకుల్ల శివారులోని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి ఉదయ్ బట్టలు ఊడదీసి నగ్నంగా ఉంచి కర్రలు రాళ్లతో విచక్షణ రహితంగా తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. వెంటనే ఉదయ్ అన్న చిలుక శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

# ముల్కనూర్‌లో 2.5మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

- మరింత మెరుగుపడనున్న విద్యుత్ సరఫరా
- ప్రారంభోత్సవంలో కరీంనగర్ టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ విజేందర్ రెడ్డి



**చిగురుమామిడి సెప్టెంబర్ 26(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముల్కనూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 2.5మెగావాట్ల (ఎండబ్ల్యూ)సోలార్ పవర్ ప్లాంట్(పి ఎం కె యూ స్ యూఎం)ను శనివారం కరీంనగర్ టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎ.విజేందర్ రెడ్డి ముల్కనూర్ సబ్‌స్టేషన్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఈ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సోలార్ ప్లాంట్ గ్రిడ్‌కు అనుసంధానం కావడం వల్ల మండల పరిధిలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరాను అందించడానికి విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ (డిఈ) ఆపరేషన్ రూరల్ కరీంనగర్ ఎం. తిరుపతి, డీఈ ఎంఆర్‌టీ పి.చంద్రమౌళి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఏడీఈ నూస్తులాపూర్ ఎస్. నరేందర్,ఏడీఈ ఎంఆర్‌టీ సుధీర్ కుమార్, చిగురుమామిడి అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)కె. చంద్రశేఖర్, సబ్ ఇంజనీర్ ఎస్.దేవయాని, అలాగే సోలార్ ప్లాంట్ యజమానులు చాడ అశోక్ రెడ్డి,చాడ హనుమండ్లు, ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అట్టహాసంగా 'ఆగాజ్-2కె26' ఫ్రెషర్స్ పార్టీ

- నూతన విద్యార్థినులకు ఘన స్వాగతం
- మూడేళ్ల డిగ్రీ విద్య కీలకం : సతీష్‌కుమార్
- నైపుణ్యాలు, స్టార్టప్ ఆలోచనలపై దృష్టి
- నృత్యాంజలి విజేతలు, ఉద్యోగ విజేతలకు సత్కారం



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): ఆల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ-పీజీ కళాశాల ఆధ్వర్యంలో నూతన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ 'ఆగాజ్--2కె26' ఫ్రెషర్స్ పార్టీని శనివారం రేకుర్తి రాజశ్రీ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ వి.రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. పెద్దపల్లి సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ డిగ్రీలోని మూడేళ్లు విద్యార్థుల జీవితంలో కీలకమని, సమయపాలన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. చైర్మన్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రిత విద్యతో పాటు ఆక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాలలోని ఇంక్యుబేషన్ సెంటర్‌ను వినియోగించుకుని స్టార్టప్ ఆలోచనలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సిరిపురం ఈశ్వర్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు నాయకత్వం, లైఫ్‌స్కిల్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై విద్యార్థులు దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో కల్చరల్ క్లబ్‌ను ప్రారంభించడంతో పాటు ఆర్ట్స్-క్రాఫ్ట్స్ క్లబ్ స్టాల్స్, ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నాయి. 'నృత్యాంజలి-2026' విజేతలు, క్యాంపస్ ఉద్యోగ విజేతలను ఘనంగా సత్కరించారు. విద్యార్థినుల నృత్యాలు, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కవిత అలేటి, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సింగరేణిలో లాభాల వాటా వెంటనే ప్రకటించాలి

- గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి
- హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



**యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** సింగరేణి కార్మికులకు లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం 8 ఇంక్లైన్ కాలనీలోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా ఉన్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించాయని ఆరోపించారు. లాభాల వాటా, ప్రమోషన్లు, మెడికల్ అన్‌ఫిట్ తదితర అంశాల్లో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గనులు, సర్ఫేస్‌లో పనిచేసే అధికారుల వేతనాల్లో కోతలు లేకుండా కార్మికుల వేతనాల్లో తగ్గింపులు చేయడం సరికాదన్నారు. కార్మికులు, అధికారులకు వేర్వేరు నిబంధనలు ఉండకూడదని పేర్కొన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికలను లేబర్ కోడ్‌కు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధనకు హెచ్‌ఎంఎస్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు కొమ్ము మధునయ్య, శాంతిస్వరూప్, ఆరెల్లి పాశం, గౌసిక అశోక్, రత్నాకర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీకాంత్, నరేష్, అఖిల్, కిరణ్, రవి, అశోక్ పాల్గొన్నారు.


# తెలంగాణ ప్రాజెక్ట్ స్టేజి-2 పనులు ప్రారంభం

**గోదావరిఖని, జనంసాక్షి :** తెలంగాణ స్టేజ్-2కు భూమి పూజ ప్రధాన ప్లాంట్ యూనిట్-3 తవ్వకం పనులు శనివారం జరిగిన ప్రారంభోత్సవ పూజతో ఎన్‌టిపిసి తెలంగాణ స్టేజ్-2 యూనిట్-3 సివిల్ పనులు మొదలయ్యాయి. స్టేజ్-2 ప్రధాన ప్లాంట్ పనులను ప్రధాన ఈపీసీ వెండర్‌గా బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించగా, సివిల్ పనులను యూనిట్ల వారీగా చేపట్టారు. ఎన్‌టిపిసి తెలంగాణ స్టేజ్-2లో మూడు యూనిట్లు ఉన్నాయి యూనిట్-3, యూనిట్-4, యూనిట్-5 ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యంతో. ఈ మూడు యూనిట్లు కూడా సూపర్ క్రిటికల్ రకానికి చెందినవి. యూనిట్-3 సివిల్ పనుల ప్యాకేజీలో టీజీ మెయిన్ పవర్ హౌస్, బాయిలర్ ఫౌండేషన్, ఈఎస్‌పి సివిల్ పనులు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో ఎయిర్ కూల్డ్ కండెన్సర్ (ఏసీసీ) టెక్నాలజీని కూడా పొందుపరిచారు, ఇది ప్రధాన ప్లాంట్‌లో నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తుందని భావిస్తున్నారు. ఈ యూనిట్లను దశలవారీగా ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించారు, స్టేజ్-2 యూనిట్లను 2030 సెప్టెంబర్ నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

*ఇందిరమ్మ చీరలతో మహిళల ఆత్మగౌరవానికి ప్రాధాన్యం :ఎమ్మెల్యే విజయరమణరావు*

- 367 మందికి రూ.1.65 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు
- 91 మందికి రూ.91.10 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి ఆర్ఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో పట్టణ మహిళలకు ఇందిరమ్మ చీరలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పంపిణీ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడంతో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ బస్సులు, ఇందిరా మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పెద్దపల్లిలో రూ.5 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని చెప్పారు. అనంతరం పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన 367 మంది లబ్ధిదారులకు రూ.1,65,94,650 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పెద్దపల్లి మండలం, పట్టణానికి చెందిన 91 మంది లబ్ధిదారులకు రూ.91,10,556 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. పేదలకు వైద్య ఖర్చుల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక ఊరట లభిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నంద్యాల చైర్మన్ అన్నయ్య గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్కాన్ నాజ్-నేయిర్, కాంగ్రెస్ యువజన నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యాల నరేష్, కౌన్సిలర్లు, మార్కెట్, సింగిల్‌విండో చైర్మన్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గొర్రెలు, మేకలకు బీమా.. కేవలం రూ.13కే

- బీమా పథకాన్ని ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి
- గొల్ల కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రుణమాఫీకి చర్యలు తీసుకుంటాం : మంత్రి వాకిటి శ్రీహరి
- కులవృత్తిదారులకు 55 ఏళ్లకే పింఛన్‌పై ప్రతిపాదన



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** గొల్ల కురుమల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కరీంనగర్ పద్మనగర్‌లోని ఇందిరాగార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకల బీమా పథకం పోస్టర్లను ఆవిష్కరించి ప్రారంభించారు. ఒక్కో గొర్రె లేదా మేకకు ఏడాదికి రూ.13 చెల్లిస్తే బీమా కల్పిస్తామని, మిగతా ప్రీమియాన్ని ప్రభుత్వం భరిస్తుందని మంత్రి తెలిపారు. గొల్ల కురుమల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, గొర్రెల పెంపకందారుల రుణాల మాఫీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కులవృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కులవృత్తిదారులకు 55 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని తెలిపారు. ఎన్‌సీడీసీ రుణమాఫీ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కరీంనగర్‌లో హోల్‌సేల్ మాంసం మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను గొర్రెల పెంపకానికి సహకార సంఘాలకు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. గొర్రెలు, మేకల బీమాను ప్రతి పెంపకందారుడు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ కె.సరిత తిరుపతయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

**కంటి వైద్య పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్**

**బొంరాస్ పేట, సెప్టెంబర్ 26( జనం సాక్షి):** జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్ శనివారం మండల పరిధిలోని బొట్లవాని తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న కంటి వైద్య పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటిచూపు సమస్యలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, మంచి పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులపై ఉందని తెలిపారు. అనంతరం కిచెన్ షెడ్‌ను సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మొత్తం పాఠశాలలో 350 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి, 36 మంది విద్యార్థులకు కంటిచూపులోపం ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.ఆయన వెంట మండల వైద్యాధికారి హేమంత్ కుమార్,పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

# 28న కరీంనగర్‌లో శాతవాహన గ్రామీణ సంత

**వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**



**కరీంనగర్ కల్చరల్, (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా గ్రామ భారతి ఆధ్వర్యంలో ఈ నెల 28న కరీంనగర్‌లో నిర్వహించనున్న 'శాతవాహన గ్రామీణ సంత' వాల్‌పోస్టర్‌ను శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 28న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్‌లో సంత నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 60 స్టాళ్లను ఏర్పాటు చేసి, సుమారు 1,200 మంది వినియోగదారులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విషరహిత ఆహార ఉత్పత్తులు, గ్రామీణ చేతివృత్తుల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఉత్పత్తిదారులు, చేతివృత్తిదారులు, వినియోగదారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానం కల్పించడమే సంత ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీష్, శాతవాహన గ్రామీణ సంత రాష్ట్ర, జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలి
- ఏఐ ల్యాబ్‌లతో అధునాతన బోధన
- అంగన్‌వాడీల్లో పోషకాహారంపై పర్యవేక్షణ



**పెద్దపల్లి/ కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం కాల్వశ్రీరాంపూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. విద్య, తాగునీరు, పారిశుధ్యం, మహిళా శిశు సంక్షేమం, విద్యుత్, వ్యవసాయ రంగాలపై అధికారులకు సూచనలు చేశారు. అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, నీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. పేరెంట్స్--టీచర్స్ సమావేశాలు నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్‌ల ద్వారా అధునాతన బోధన అందిస్తున్నామని, తల్లిదండ్రులు పాఠశాలలను సందర్శించి వాటిని పరిశీలించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలని, ఆరోగ్యలక్ష్మి సేవలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్య సేవలు, సౌకర్యాలపై సూచనలు చేశారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శ్రీమాల, ఎంపీడీవో సురేందర్‌కుమార్, తహసీల్దార్ రాముడు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

**మహిళా శక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ**

వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి, భుక్తి, హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజహితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు, సేవలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఎం.రవీందర్, రజక సంఘం నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



# యూఆర్జేసీని తరలింపు యత్నానికి బ్రేక్..!

## ఎమ్మెల్యే జోక్యంతో నర్సాపూర్‌లోనే కొనసాగింపు

- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనతో స్పందించిన సునీత లక్ష్మారెడ్డి
- ఉద్యోగ భద్రత కోసమే తరలింపు కుట్ర జరిగిందా..?

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాలోని నర్సాపూర్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల యూఆర్‌జేసీ కళాశాలను కౌడిపల్లికి తరలించే ప్రయత్నంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జోక్యం చేసుకోవడంతో వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. నర్సాపూర్ యూఆర్‌జేసీ కళాశాలను నర్సాపూర్‌లోనే కొనసాగించాలని ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

**ఉద్యోగ భద్రత కోసమేనా?**

కౌడిపల్లిలో కొనసాగుతున్న యూఆర్‌జేసీ కళాశాలలో అడ్మిషన్లు లేకపోవడంతో దానిని మరో ప్రాంతానికి తరలించే పరిస్థితి ఏర్పడితే, ప్రస్తుతం అక్కడ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ప్రిన్సిపాల్ హోదాను కోల్పోయి మరోచోట కేవలం సబ్జెక్టు టీచర్‌గా పనిచేయాల్సి వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో నర్సాపూర్ యూఆర్‌జేసీ కళాశాలను కౌడిపల్లికి తీసుకువస్తే, అక్కడ ప్రస్తుతం ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వ్యక్తి ప్రిన్సిపాల్ హోదాలోనే కొనసాగేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే ఈ ప్రయత్నం జరిగిందని విద్యార్థులు, తల్లిదండ్రుల వర్గాల్లో ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో వ్యక్తిగత ఉద్యోగ ప్రయోజనాల కోసం సంబంధిత ఆర్‌సీఓతో కొందరు అధికారులు చేతులు కలిపి నర్సాపూర్ యూఆర్‌జేసీని కౌడిపల్లికి తరలించే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి.

**విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన**

నర్సాపూర్‌లో కొనసాగుతున్న యూఆర్‌జేసీ కళాశాలను మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నం జరుగుతోందన్న విషయం తెలియడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే నర్సాపూర్‌లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థులను మరో ప్రాంతానికి తరలించడం వల్ల వారి చదువులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలల నిర్వహణలో మార్పులు చేయాలంటే ముందుగా విద్యార్థుల భవిష్యత్తు, అడ్మిషన్ల పరిస్థితి, సిబ్బంది అవసరాలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు.

**ఎమ్మెల్యే జోక్యంతో తరలింపు యత్నానికి అడ్డుకట్ట:**

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన విషయం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆమె అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది. నర్సాపూర్ యూఆర్‌జేసీ కళాశాలను కౌడిపల్లికి తరలించే ఆలోచనను నిలిపివేసి, నర్సాపూర్ యూఆర్‌జేసీ కళాశాలను నర్సాపూర్‌లోనే యథావిధిగా కొనసాగించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, కేవలం కొందరి ప్రయోజనాల కోసం విద్యాసంస్థల నిర్వహణలో మార్పులు చేయవద్దని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.



**బట్టబయలైన అధికారుల తీరుపై ఆరోపణలు**

ఎమ్మెల్యే జోక్యంతో నర్సాపూర్ యూఆర్‌జేసీని నర్సాపూర్‌లోనే కొనసాగించే దిశగా స్పష్టత రావడంతో ఇప్పటివరకు జరిగిన పరిణామాలపై చర్చ మొదలైంది. అసలు కౌడిపల్లికి నర్సాపూర్ యూఆర్‌జేసీని తరలించే ప్రతిపాదన ఎందుకు వచ్చింది? దాని వెనుక విద్యార్థుల ప్రయోజనమా? లేక కొందరి ఉద్యోగ ప్రయోజనమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కౌడిపల్లి యూఆర్‌జేసీలో అడ్మిషన్లు లేకపోవడాన్ని సాకుగా చూపి నర్సాపూర్ యూఆర్‌జేసీని తరలించే ప్రయత్నం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్ణయం వెనుక ఉన్న వాస్తవాలను బయటపెట్టాలని వారు కోరుతున్నారు.

# పరిగిలో కానిస్టేబుల్‌పై కత్తిపోటు

- వినాయక నిమజ్జనం శోభాయాత్రలో ఘటన
- గొడవను అడ్డుకునేందుకు వెళ్లగా దాడి
- గచ్చిబౌలి ఆస్పత్రిలో చికిత్స.. పరిస్థితి నిలకడ
- పోలీసులపై దాడి చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** వినాయక నిమజ్జనం శోభాయాత్ర సందర్భంగా పరిగిలో పోలీస్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. శనివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో రెండు వర్గాల మధ్య గొడవ జరుగుతుండగా, పరిగి పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నర్సింలు గొడవను అదుపు చేసేందుకు వెళ్లారు. ఈ సమయంలో గొడవలో పాల్గొన్న తరుణ్ అనే వ్యక్తి కత్తితో ఆయన కడుపుపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన అనంతరం పరిగి ఎస్ఐ, సీఐ, డీఎస్పీ స్పందించి నర్సింలును పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గచ్చిబౌలిలోని కాంటినెంట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హైదరాబాద్‌కు చేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నర్సింలును పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఘటనపై పరిగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆధారాలు సేకరించి నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడి చేయడం, బెదిరించడం, విధులకు ఆటంకం కలిగించడం సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా గొడవలు చేయడం, ఆయుధాలతో తిరగడం, పోలీసులపై దాడులకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులపై రౌడీషీట్ ప్రారంభించే చర్యలు చేపడతామని తెలిపారు.

## బాసర బ్రిడ్జి వద్ద గణేష్ నిమజ్జనం బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26 జనం సాక్షి:** గణేష్ నిమజ్జనం సందర్భంగా బాసర బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు , భద్రతా ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి తరలివచ్చే గణేష్ విగ్రహాలు, భక్తులు మరియు వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చేపట్టిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ , భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అధికారులు మరియు సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

# ఔటర్‌పై టైర్ పేలి కూలీల వాహనం బోల్తా

**మరో 12 మందికి గాయాలు.. ఇద్దరు అక్కడికక్కడే మృతి**

- వెనుక టైరు పేలడంతో అదుపుతప్పిన వాహనం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కీసర పోలీసులు





**కీసర, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం వెనుక టైరు ఒక్కసారిగా పేలడంతో అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదం లో ఇద్దరు మృతి చెందగా.. మరో 12 మంది గాయపడ్డారు.
కీసర నుంచి శామీర్‌పేట వైపు కూలీలను తీసుకెళ్తున్న టీఎస్08 యూజే 9432 వాహనం ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఔటర్ రింగ్‌రోడ్డుపై వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వెనుక టైరు పేలడంతో డ్రైవర్ వాహనాన్ని నియంత్రించలేకపోయాడు. దీంతో వాహనం పల్టీలు కొడుతూ రోడ్డుపై బోల్తాపడింది. ప్రమాదంలో మంగీలాల్ (60), సురేఖ (40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంలో ఉన్న మరో 12 మంది గాయపడగా.. వారిలో డ్రైవర్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న కీసర పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద స్థలాన్ని మల్కాజిగిరి జోన్ డీసీపీ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించిన పోలీసులు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాహనం పరిస్థితి తదితర అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయాలి
- వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి);** సెప్టెంబర్ 30వ తేదీ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించా రు. అంతకు ముందు మంత్రులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛా లు అందజేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సెప్టెంబర్ 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా ఇంచార్జి మంత్రి, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, మంత్రులు శ్రీధర్ బాబు, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు, అలాగే సిరిసిల్ల రగుడు బై పాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

పోలీస్ అధికారులు ట్రాఫిక్, బందోబస్తు, భద్రతా చర్యలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించా రు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలు చిరకాలం గుర్తు పెట్టుకునేలా తమ సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసి,సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇట్టి సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఓన్లీ' ఫుడ్ డెలివరీ యాప్ ప్రారంభించిన ర్యాపిడో

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** ప్రముఖ మొబిలిటీ ప్లాట్‌ఫారమ్ ర్యాపిడో తన స్వతంత్ర ఫుడ్ డెలివరీ యాప్ 'ఓన్లీ'ను హైదరా బాద్‌లో ప్రారంభించినట్లు ర్యాపిడో, ఓన్లీ సహ–స్థాపకుడు అరవింద్ సంక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగ ళూరు తర్వాత ఓన్లీ సేవలు అందు బాటులోకి వచ్చిన రెండో నగరం హైదరాబాద్ అన్నారు. జీరో–కమిషన్ మోడల్‌లో పనిచేసే ఓన్లీ లో రెస్టారెంట్లకు కమిషన్ ఉండదని, వినియోగదారులు ఆహారం, డెలివరీకి మాత్ర మే చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు సూపర్ స్టార్ నాని పాల్గొని క్యాప్టెన్‌లతో ముచ్చటించారని చెప్పారు. హైదరాబాద్‌లో ఓన్లీ ప్రారంభంతో క్యాప్టెన్‌లకు అదనపు సంపాదన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.



# అభివృద్ధి పనులకు నిధులివ్వండి

- కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వజ్రెష్ యాదవ్ వినతి
- బోడుప్పల్, ఘట్కేసర్ సర్కిళ్లలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి



**బోడుప్పల్–జనంసాక్షి :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. బోడుప్పల్, ఘట్కేసర్ సర్కిళ్ల పరిధిలో రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, పార్కులు, ఓపెన్ జిమ్‌లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని వజ్రెష్ యాదవ్ కోరారు. పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వజ్రెష్ యాదవ్ తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు సమకూర్చి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని బోడుప్పల్, ఘట్కేసర్ సర్కిళ్ల పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, స్థానికంగా నెలకొన్న సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామల అమర్, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ చైర్మన్ మల్లి పావని జంగయ్య యాదవ్, విశ్వనాథం, ఉదయ్ కుమార్ రెడ్డి, జీవన్ రెడ్డి పాల్గొన్నారు.




## టూరిజం అభివృద్ధిలో మెదక్ జిల్లా కలెక్టర్‌కు అరుదైన గౌరవం

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 26 (జనం సాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవం (వరల్డ్ టూరిజం డే) పురస్కరించుకుని హైదరాబాద్ శిల్పారామం లోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్‌కు ప్రతిష్టాత్మక "ఉత్తమ పర్యాటక ప్రతిభ అవార్డు" లభించింది. రాష్ట్ర రాజధానిలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, జిల్లా కలెక్టర్‌కు ఈ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి, చారిత్రక కట్టడాల సంరక్షణకు, పర్యాటకులకు కల్పించిన మెరుగైన వసతుల విషయంలో జిల్లా యంత్రాంగం చూపిన అద్భుత ప్రతిభకుగానూ ఈ పురస్కారం దక్కింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

## 100 గిగావాట్ల లక్ష్యానికి విండర్జీ ఇండియా-26 ఊతం

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) :** 2030 నాటికి 100 గిగావాట్ల పవన విద్యుత్ సామర్థ్య లక్ష్యానికి ఊతమిచ్చేలా తయారీ, ఆఫ్‌షోర్ పవన విద్యుత్, రీపవరింగ్, నైపుణ్య మానవ వనరులపై 'విండర్జీ ఇండియా–2026' దృష్టి సారించనుంది. అక్టోబర్ 7–9 తేదీల్లో చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఎనిమిదో ఎడిషన్ జరగనుంది. 2026 ఆగస్టు 31 నాటికి దేశ పవన విద్యుత్ సామర్థ్యం 58.52 గిగావాట్లకు చేరగా, 2025–26లో రికార్డు స్థాయిలో 6.05 గిగా వాట్లు కొత్తగా జోడించారు. 2030 లక్ష్యానికి ఏటా సుమారు 10 గిగావాట్ల సామర్థ్యం అవసరం. దేశీ య టర్బైన్ తయారీ సామర్థ్యం 24 గిగావాట్లకు చేరగా, 2025–26లో పవన పరికరాల ఎగుమతు లు రూ.12 వేల కోట్లను దాటాయి. సరఫరా గొలు సు బలోపేతానికి ఎంఎన్‌ఆర్ఈ–ఐడబ్ల్యూటీఎంఏ కలిసి డబ్ల్యూటీ–మారుట్ పోర్టల్‌ను ప్రారంభించా యి. కేంద్ర ఎంఎన్‌ఆర్ఈ సంయుక్త కార్యదర్శి రాజేశ్ కుల్హరి, ఐడబ్ల్యూటీఎంఏ సీఈఓ ఆదిత్య ప్యాసి, వైస్ చైర్మన్, కార్యదర్శి డా.శరవణన్ మణిక్కం, గౌరవ కార్యదర్శి, సుజ్లాన్ ఎనర్జీ అధ్యక్షుడు దినేశ్ జగ్దాలే పవన రంగంలో దేశీయ తయారీ, సరఫరా గొలుసు, ఎగుమతులు, నైపుణ్యాభివృద్ధి అవసరాన్ని వివరించారు. గుజరాత్, తమిళనాడు తీరాల్లో 500 మెగావాట్ల చొప్పున 1 గిగావాట్ ఆఫ్‌షోర్ పవన విద్యుత్ పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇందుకు రూ.7,453 కోట్ల వీజీఎఫ్, ఓడరేవు మౌలిక వసతులకు రూ.600 కోట్లు కేటాయించారు. 2035 నాటికి 155 గిగావాట్ల లక్ష్యాన్ని కూడా పరిశ్రమ నిర్దేశించింది. విండర్జీ ఇండియా–26లో నార్డెక్స్, సుజ్లాన్, జెడ్ఎఫ్, ఆదిత్య బిర్లా సంస్థల నిపుణులతో ఇంజినీరింగ్ విద్యా ర్థులకు ప్రత్యేక అకాడెమియా సెషన్లు నిర్వహించనున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

**పోచారం, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** యంనంపేట బ్రిడ్జిపై ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో బీటెక్ విద్యార్థి కిషోర్ (20) మృతి చెందాడు. అతనితో ఉన్న విజయ అనే యువతి తీవ్రంగా గాయపడింది. ఆమెను మేడిపల్లిలోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిప్పారెడ్డిపల్లికి చెందిన కిషోర్ బి.ఎన్.రెడ్డినగర్‌లో ఉంటూ ఇబ్రహీంపట్నంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. పరీక్ష రాసేందుకు విజయను యంనంపేటకు తీసుకెళ్తుండగా ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫార్మా సిటీకి వ్యతిరేకంగా రైతుల సమరం

- 28న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి
- వేలాదిగా తరలిరావాలని రైతులకు పిలుపు
- భూసేకరణ నిలిపివేయాలని ప్రధాన డిమాండ్

**రంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** 'మాకు ఫార్మా సిటీ వద్దు.. మంచి భవిష్యత్తు కావాలి' అనే నినాదంతో ఇబ్రహీంపట్నం ప్రాంత రైతులు, కూలీలు, గ్రామస్థులు ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. కందుకూరు, యాచారం మండలాల్లోని ప్రభావిత గ్రామాల నుంచి రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కమిటీ కోరింది. ఫార్మా సిటీ పేరుతో భూసేకరణను నిలిపివేసి రైతుల భూములు, హక్కులను రక్షించాలని కమిటీ డిమాండ్ చేస్తోంది. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించాలని, భూసేకరణ, భూముల వినియోగం, పర్యావరణ ప్రభావాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతోంది. ప్రభావిత ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు న్యాయమైన పరిహారం, పునరావాసంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని పేర్కొంది.
గత శాసనసభ ఎన్నికల సమయంలో ఫార్మా సిటీని రద్దు చేసి భూములను రైతులకు తిరిగి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కమిటీ గుర్తుచేసింది. ప్రస్తుతం అదే ప్రాంతంలో 'ఫ్యూచర్ సిటీ' పేరుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ భూములను తిరిగి ఇవ్వకపోవడంపై రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం యాచారం, కందుకూరు మండలాల్లో సేకరించిన 19 వేల ఎకరాలకు పైగా భూములను రద్దు చేయకుండా, మరో 14 వేల ఎకరాలకు పైగా భూసేకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మా సిటీ రద్దుపై ప్రభుత్వం భిన్న ప్రకటనలు చేస్తోందని రైతు సంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. ప్రజల్లో ఒక రకంగా, న్యాయపరమైన అంశాల్లో మరో విధంగా వైఖరి కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28న జరిగే ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభావిత గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఘట్‌కేసర్‌లో దళిత రైతు భూమి ఆక్రమణ యత్నం

- కులం పేరుతో దూషిస్తూ బెదిరింపులు
- కోర్టు ఉత్తర్వులను తుంగలో తొక్కి దౌర్జన్యం
- కమిషనరేట్‌ను ఆశ్రయించిన దళిత కుటుంబం



**ఘట్కేసర్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి):**
హైకోర్టు 'యథాతథ స్థితి' ఉత్తర్వులు ఇచ్చినా ఖాతరు చేయకుండా, దళిత కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు వ్యక్తులు యత్నించిన ఘటన ఘట్‌కేసర్ మండలంలో వెలుగుచూసింది. అంతేకాకుండా అడ్డుకున్న వారిని కులం పేరుతో దూషిస్తూ, దాడికి పాల్పడ్డారని బాధితుడు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్ మండలం, మర్రిపల్లిగూడ గ్రామానికి చెందిన చిలుగూరి (గేటు) సత్యనారాయణ (53) దళిత ( ఎస్సీ మాదిగ) కుటుంబానికి చెందిన రైతు. మర్రిపల్లిగూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 13లో ఆయనకు 3 ఎకరాల 13 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని 1986లో ప్రభుత్వం ఆయన తండ్రి నర్సింహకు ఓ.ఆర్.సి. ఇచ్చిందని, 2010–2011లో పట్టాదారు పాస్ పుస్తకాలు (పట్టా నెం. 36, ఖాతా నెం. 239439) కూడా జారీ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి మరణానంతరం (15–01–1997) సత్యనారాయణ ఈ భూమిలోనే వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన కానుగంటి నవీన్, సయ్యద్ హమీద్ సైఫుద్దీన్ మరికొందరితో కలిసి నకిలీ పత్రాలు సృష్టించి తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితుడు తెలిపారు. వారి రాజకీయ బలం ముందు నిలబడలేక బాధితుడు హైకోర్టును ఆశ్రయించగా, గౌరవ హైకోర్టు ( డబ్ల్యూపి/16536/2026, తేదీ: 06–05–2026) ఈ భూమిపై ఎవరూ ప్రవేశించకుండా 'స్టేటస్ కో' ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ, వినాయక చవితి రోజున (21–09–2026) కానుగంటి నవీన్, సయ్యద్ హమీద్ సైఫుద్దీన్, వారి అనుచరులు అక్రమంగా భూమిలోకి ప్రవేశించి సరిహద్దు హద్దులను తొలగించి ట్రాక్టర్‌తో దున్నడం ప్రారంభించారు. దీనిని అడ్డుకోవడానికి వెళ్లిన సత్యనారాయణ అన్న కుమారుడు సుధాకర్, ఇతర కుటుంబ సభ్యులైన వంశీ, వికాస్‌లను సదరు వ్యక్తులు అసభ్య పదజాలంతో, కులం పేరుతో తీవ్రంగా దూషించడమే కాకుండా, "మాకు ఏ పోలీసులూ, కోర్టులూ ఏమీ చేయలేవు" అని బెదిరింపులకు దిగి దాడికి ప్రయత్నించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు భయాందోళనకు గురవడంతో గుండెపోటు రావడం జరిగింది. ఈ ఘటనపై 22న ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు తెలిపారు. ఆక్రమణదారులకు మద్దతుగా నిలుస్తూ తమను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ, సెప్టెంబర్ 24న మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు సమర్పించారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి, తమపై దాడికి యత్నించడమే కాకుండా కులం పేరుతో దూషించిన ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ పోలీసులను ఆదేశించాలని కోరారు.

## డీసీఎం ఢీకొని ఐదు గేదెలు మృతి

**మరో నాలుగు గేదెలకు తీవ్ర గాయాలు**

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** రాజీవ్ రహదారిపై డీసీఎం వ్యాన్ పశువులను ఢీకొట్టడంతో ఐదు గేదెలు మృతి చెందగా.. మరో నాలుగు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. శామీర్‌పేట్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన రైతు తుమ్మరాజు శనివారం సాయంత్రం పశువులను మేతకు తీసుకెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా జ్యోతిష్మతి కళాశాల ఎదుట ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గజ్వేల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి రహదారి దాటుతున్న పశువులను ఢీకొట్టినట్లు సమాచా రం. దీంతో ఐదు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో నాలుగు తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సమాచా రం అందుకున్న జినోమ్ వ్యాలీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పశు వైద్యులను పిలిపిం చి గాయపడిన గేదెలకు వైద్య పరీక్షలు, చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
27 సెప్టెంబర్ 2026

## వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ విద్యార్థులకు శుభవార్త

- టీజీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంపు!
- ఓయూ క్యాంపస్ నుంచి వీసీఐడబ్ల్యూయూకు మెరుగైన రవాణా సౌకర్యం



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) : విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఉస్మానియా యూని వర్సిటీ క్యాంపస్ మీదుగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, కోటి వరకు నడిచే బస్సుల ఫ్రీక్వెన్సీని పెంచింది. పెంచిన బస్సు సర్వీసులు సెప్టెంబర్ 27, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో నివసిస్తున్న పీజీ విద్యార్థులతో పాటు, వీసీఐడ బ్ల్యూయూకు రాకపోకలు సాగించే ఇతర విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి మరింత మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. రోజువారీ ప్రయాణంలో ఇబ్బందులు తగ్గడంతో పాటు విద్యార్థులు విద్యా, ఇతర విశ్వవిద్యాలయ కార్యకలాపాలకు సకాలంలో హాజరయ్యేందుకు ఈ సర్వీసులు దోహదపడనున్నాయి. వీసీఐడబ్ల్యూయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, యూనివర్సిటీ రవాణా అవసరాలపై సాను కూలంగా స్పందించి సహకరించిన గౌరవనీయులైన రోడ్లు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి. నాగి రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంచూరి శ్రీధర్, ఇతర అధికారులు అందించిన సహకారం, సానుకూల స్పందనకు ధన్యవాదాలు తెలిపారు.

వీసీఐడబ్ల్యూయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం మాట్లాడుతూ బస్సుల ఫ్రీక్వెన్సీ పెంపుతో విద్యార్థులు, సిబ్బంది రోజువారీ రాకపోకలు మరింత సులభతరం అవుతా యని, ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బం దులు తగ్గడంతో పాటు విద్యా, ఇతర యూని వర్సిటీ కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. యూనివ ర్సిటీ పరిపాలన టీజీఎస్ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, విద్యార్థులు, అధ్యాప కులు, సిబ్బంది పెంచిన బస్సు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించింది. ఉస్మానియా యూని వర్సిటీ క్యాంపస్–వీసీఐడబ్ల్యూయూ, కోటి మధ్య మెరుగైన బస్సు కనెక్టివిటీ విద్యార్థుల సౌకర్యం, భద్రత, సంక్షేమానికి మరింత దోహదపడుతుందని యూనివర్సిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.

## కాగ్నా నదిని మింగేస్తున్న ఇసుక రక్కసులు

- చెక్ డ్యామ్‌నే చెక్ పెట్టిన మాఫియా..
- పాత తాండూరులో పట్టపగలే ఇసుక లూటీ
- కాగ్నా గర్భాన్ని తోడేస్తున్న జేసీబీలు..
- కమీషన్ల కక్కుర్తిలో అధికారులు





తాండూరు సెప్టెంబర్ 26(జనంసాక్షి) : కాగ్నానదిలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా, అధికార యంత్రాంగం కళ్లు మూసుకున్న వేళ, పట్టపగలే కాగ్నా నదిని జేసీబీలతో తోడేస్తున్నారు. తాండూరు పట్టణ శివారులోని పాత తాండూరు చెక్ డ్యామ్ వద్ద శనివారం ఉదయం నుండి ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. భారీ జేసీబీ యంత్రాలు, టిప్పర్లతో నది గర్భంలోకి దిగి ఇసుకను తోడి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం చెక్ డ్యామ్ లు, వంతెనల సమీపంలో ఇసుక తవ్వకాలు నిషేధం. అయినా అక్కడే, అందరూ చూస్తుండగానే తవ్వకాలు జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై స్థానిక రైతులు, పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెక్ డ్యామ్ దగ్గర ఇసుక తీస్తే డ్యామ్ పునాది దెబ్బతిని, భవిష్యత్తులో నీటి నిల్వకు, భూగర్భ జలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అధికారులకు ఫోన్ చేసినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇది కచ్చితంగా మామూళ్ల మత్తులోనే జరుగుతోంది" అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని చెబుతుండగా, మరోవైపు తాండూరులో మాత్రం అధికారుల అండదండలతోనే ఈ అక్రమ దందా సాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పాత తాండూరు చెక్ డ్యామ్ వద్ద జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై దాడులు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రిఫరీపైనే అనుమానం వస్తే..
# ప్రజాస్వామ్యానికే ప్రమాదం

- ఎన్నికల సంఘం స్వతంత్రతపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి
- ఓటరు జాబితా ప్రభుత్వ ఆస్తి కాదు... ఓటు అధికార పార్టీ సొత్తు కాదు
- సాంకేతిక వ్యవస్థ పేరుతో ఒక్క అర్హుడి ఓటు హక్కును అడ్డుకున్నా అది ప్రజాస్వామ్యంపై దాడే
- ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై నిష్పాక్షిక విచారణ జరపాలి
- ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) : ఎన్నికల పోరులో అన్ని రాజకీయ పార్టీలూ ఆటగాళ్లయితే... ఎన్నికల సంఘం రిఫరీ. ఆ రిఫరీపైనే అనుమానం తలెత్తితే ఓడిపోయేది ఏదో ఒక రాజకీయ పార్టీ కాదు–మొత్తం ప్రజాస్వామ్యమేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. భారత ఎన్నికల సంఘం పనితీరుపై తాజాగా వెలుగులోకి వచ్చిన అంశాలు ఓటు విలువను గుర్తించే ప్రతి భారతీయుడినీ కలవరపరుస్తున్నాయని అన్నారు. స్వతంత్ర ఎన్నికల సంఘం అనేది అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే దయాదాక్షిణ్యం కాదని, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన రక్షణ కవచమని స్పష్టం చేశారు. ఆ సంస్థ స్వతంత్రంగా పనిచేస్తోందా లేదా అనే తీవ్రమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. నినాదాలు, మొండి ఖండనలు, గుడ్డిగా నమ్మాలనే ఆదేశాలతో అనుమానాలు తొలగిపోవని పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురితమైన దర్యాప్తు కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల వ్యవధిలో కనీసం 14 అంశాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు–పునరుద్ధరణ, అప్పీళ్ల పరిష్కారం, ఓటరు జాబితాల డేటాపై నియంత్రణ వంటి అత్యంత కీలకమైన అంశాలపై వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు ఆ కథనం పేర్కొందని తెలిపారు. "ఇవి కార్యాలయంలో జరిగే చిన్నచిన్న అభిప్రాయ భేదాలు కావు. ఎవరి పేరు ఓటరు జాబితాలో చేరాలి? ఎవరి పేరు తొలగించాలి? తప్పుగా తొలగించిన పేరును ఎవరు, ఎలా తిరిగి చేర్చాలి? ఓటరు డేటాపై అసలు నియంత్రణ ఎవరిది? అనే ప్రశ్నలు ఇవి. అంటే ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఓటు హక్కుతో ముడిపడిన అంశాలు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. చట్టబద్ధంగా బాధ్యతలు నిర్వహించే ఎన్నికల అధికారులకు తెలియకుండానే కీలక నిర్ణయాలు తీసుకున్నారా? ఓటరు డేటాబేస్‌ను పూర్తిగా కేంద్రీకరించడం ద్వారా క్షేత్రస్థాయి అధికారుల అధికారాలను పరిమితం చేశారా? కొత్త ఓటర్ల నమోదును ప్రభావితం చేసే మార్పులు ఎన్నికల కమిషనర్ల పూర్తి అవగాహన లేకుండానే జరిగాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉందన్నారు. గోవాలో వెలుగులోకి వచ్చినట్లు చెబుతున్న ఘటన మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. 97 మంది ఓటర్ల అర్హతను ఎన్నికల నమోదు అధికారులు పరిశీలించి నిర్ధారించినప్పటికీ, సాఫ్ట్‌వేర్‌లో వారి నిర్ణయాలను సకాలంలో నమోదు చేయలేకపోవడంతో ఆ పేర్లు తుది జాబితాలో చేరలేదని వచ్చిన కథనాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తొలగించిన వారిలో 22.21 లక్షల మంది తమ పేర్లను పునరుద్ధరించాలని అప్పీలు చేసుకున్నట్లు ఎన్నికల సంఘమే సుప్రీంకోర్టుకు తెలిపిందని గుర్తుచేశారు. ఈ గణాంకాల ఆధారంగా తొలగించిన ప్రతి పేరు తప్పేనని చెప్పలేమని, అయితే ఇంత భారీ స్థాయిలో పేర్లు తొలగించినప్పుడు పారదర్శకత, సమర్థమైన అప్పీల్ వ్యవస్థ, సకాలంలో తప్పులను సరిచేసే అవకాశం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. 'ఓటరు జాబితాలో జరిగిన తప్పును ఎన్నికల తర్వాత సరిచేస్తే ప్రయోజనం ఏమిటి? ఓటు వేసే రోజుకు ముందే న్యాయం జరగాలి. గడువు ముగిసిన తర్వాత పేరు చేర్చడం అంటే రైలు వెళ్లిపోయిన తర్వాత టికెట్ ఇవ్వడమే" అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం నియామక ప్రక్రియపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గతంలో వ్యక్తం చేసిన ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ప్రధానమంత్రి సూచించే కేంద్ర మంత్రిని సభ్యుడిగా చేర్చడం ద్వారా ఎంపికలో కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయాత్మక ఆధిపత్యం కల్పించారని ఆరోపించారు. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో విచారణ జరగనున్నందున, తీర్పు వచ్చే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకాన్ని వాయిదా వేయాలని రాహుల్ గాంధీ సూచించినప్పటికీ కేంద్రం పట్టించుకోలేదన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించే విషయంలో ప్రభుత్వం తొందరపడి ముందుకు వెళ్లిందని చెప్పారు. "నియామక విధానాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారు. ఎంపిక కమిటీలో తమకే మెజారిటీ ఉండేలా చేసుకుంటారు. ఆ తర్వాత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను ఎవరూ ప్రశ్నించకూడదంటారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యం? విశ్వాసం అడిగితే వచ్చేది కాదు... పారదర్శకతతో సంపాదించుకోవాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు లేవనెత్తినట్లు చెబుతున్న అభ్యంతరాలు మొత్తం పరిణామాల్లో ఒక భాగం మాత్రమేనని, చివరకు నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నామని ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణ సరిపోదన్నారు. 'ఏకగ్రీవం అని ఒక్క మాట చెబితే అభ్యంతరాలు మాయమైపోవు. అసలు అభ్యంతరాలు ఎందుకు వచ్చాయి? వివాదాస్పద నిర్ణయాలను ఎవరు అనుమతించారు? ఇద్దరు కమిషనర్లను ముందుగానే సంప్రదించారా? చట్టబద్ధ అధికారులకు ఓటరు డేటాబేస్‌పై స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఉందా? సాఫ్ట్‌వేర్ వైఫల్యంతో హక్కు కోల్పోయిన ఓటర్లకు ఏ రక్షణ కల్పించారు? ఈ ప్రశ్నలకు ఒక్కొక్కటిగా సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఎన్నికల స్వచ్ఛతను, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో దృఢంగా పోరాడుతుందని ప్రకటించారు. కమిషనర్లు సంధు, జోషి పేరుతో వెలుగులోకి వచ్చిన అభ్యంతరాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ బహిరంగంగా సమాధానం చెప్పాలని కోరారు. వివాదాస్పద నిర్ణయాలకు బాధ్యులెవరో వెల్లడించడంతోపాటు అర్హులైన ఓటర్లు పరిపాలనా లేదా సాంకేతిక అడ్డంకుల వల్ల జాబితా నుంచి తప్పిపోకుండా తీసుకుంటున్న చర్యలను దేశ ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నియామకంలో నిజమైన స్వతంత్రతను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వెలుగులోకి వచ్చిన అభ్యంతరాలతోపాటు ఓటరు జాబితాల నిర్వహణకు ఉపయోగిస్తున్న సాంకేతిక వ్యవస్థల పనితీరుపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'రాజ్యాంగ పదవికి గౌరవం కుర్చీ వల్ల రాదు... ప్రజల విశ్వాసం వల్ల వస్తుంది. ఆ విశ్వాసమే తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు బాధ్యత వహించాల్సిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలి. వెలుగులోకి వచ్చిన అంశాలన్నింటిపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరగాలి" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## హోటళ్ల లైసెన్సులు రద్దు

హైదరాబాద్(జనంసాక్షి) : హైదరాబాద్‌లోని మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి పరిధిలోని 20 ప్రముఖ రెస్టారెంట్లలో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ (టీజీ సేఫ్) ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. అపరిశుభ్రత, బొద్దింకలు, ఎలుకల సంచారం, గడువు ముగిసిన, పాడైపోయిన ఆహార పదార్థాల నిల్వలు వెలుగుచూశాయి. మోనాస్టరీ, అల్ సబా, లక్కీ రెస్టారెంట్, సాయిరామ్ మెస్, ఉడుపి ఉపహార్, అమ్ ఆహా, ఫ్యూజన్ 9 సహా మొత్తం 11 ప్రముఖ హోటళ్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేశారు.



## రైస్‌మిల్లర్ల బంద్ విజయవంతం

- రాతపూర్వక హామీతో బంద్ విరమణ.. గెలిచిన పోరాటం: సయ్యద్ రఫీ

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రైస్ మిల్లర్ల రాష్ట్రవ్యాప్త బంద్‌కు తెరపడింది. తమ 13 డిమాండ్లలో ప్రభుత్వం పరిష్కరించగల అంశాలపై సివిల్ సప్లయిస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాతపూర్వక హామీ ఇవ్వడంతో రైస్ మిల్లర్ల అసోసియేషన్ బంద్‌ను విరమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని రైస్ మిల్లులు వెంటనే కార్యకలాపాలు ప్రారంభించుకోవచ్చని అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేసి, సీఎంఆర్ ఒప్పందంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గత నెల రోజులుగా సీఎంఆర్ ఒప్పందంలోని అసమానతలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. తొలుత ధర్నా చౌక్‌లో ఆందోళన నిర్వహించామని, ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడంతో రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు.

బంద్ పిలుపు అనంతరం ప్రభుత్వం తరఫున ఉపసంఘం రైస్ మిల్లర్లతో చర్చలు జరిపిందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో చర్చలు జరిగాయని చెప్పారు. చర్చల్లో మౌఖికంగా హామీలు లభించినప్పటికీ, తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రాతపూర్వక హామీ ఇవ్వాలని పట్టుబట్టినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో శనివారం సివిల్ సప్లయిస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి 13 డిమాండ్లను మరోసారి వివరించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ప్రభుత్వం పరిష్కరించగల అంశాలను మంత్రి గుర్తించి, వాటిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత కమిషనర్‌కు సంతకంతో కూడిన సూచనలు ఇచ్చారని చెప్పారు. ఈ రాతపూర్వక హామీ ఆధారంగానే రాష్ట్రవ్యాప్త బంద్‌ను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

### హామీలు త్వరగా అమలు చేయాలి

ప్రభుత్వం రాతపూర్వకంగా స్పందించడం తమ ఉద్యమానికి లభించిన విజయమని సయ్యద్ రఫీ అన్నారు. అయితే కేవలం హామీలకే పరిమితం కాకుండా వాటిని త్వరగా ప్రభుత్వ ఉత్తర్వుల రూపంలో అమలు చేయాలని కోరారు. సీఎంఆర్ ఒప్పందంలోని సమస్యలను సవరించి, మిల్లర్లపై ఉన్న 'డిఫాల్టర్' ట్యాగ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. రైతులు, రైస్ మిల్లుల కార్మికులు, హమాలీలు ఇబ్బందులు ఎదుర్కోకుండా, ముఖ్యంగా రానున్న వరి పంటను దృష్టిలో పెట్టుకుని బంద్‌ను విరమించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును నిశితంగా పరిశీలిస్తామని, అవసరమైతే తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

### గౌరవ అధ్యక్షుడిగా రఫీ ప్రతిపాదన

ఈ సందర్భంగా తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గణపతి రెడ్డి, కార్యదర్శి వీరేశం తదితరులు మాట్లాడారు. సయ్యద్ రఫీని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా నియమించాలని ప్రతిపాదన వచ్చినట్లు తెలిపారు. అయితే ఈ అంశాన్ని జనరల్ బాడీ సమావేశంలో సభ్యుల ఆమోదానికి పెట్టి నిర్ణయం తీసుకోవాలని సయ్యద్ రఫీ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్ల బంద్ విరమించడంతో మిల్లుల కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలు ఎప్పటిలోగా అమల్లోకి వస్తాయి, సీఎంఆర్ ఒప్పందంలోని సమస్యలకు ఎలాంటి సవరణలు చేస్తారన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

## గ్రామీణాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- మంచినీటికి అత్యధిక ప్రాధాన్యత
- రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సమీక్షా సమావేశం
- రూ.3,382 కోట్లతో 1,013 గ్రామీణ రోడ్లు
- అక్టోబర్ 25 నుండి రోడ్డు పనుల ప్రారంభం




రంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) : రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మంచినీటి సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే కాలంలో వర్షాభావ పరిస్థితులు, మంచినీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాంతాల వారీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో 1,013 గ్రామీణ రహదారుల అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.3,382 కోట్లను వెచ్చించనున్నట్లు మంత్రి వెల్లడించారు. దసరా పండుగ అనంతరం అక్టోబర్ 25, 26వ తేదీ నుంచి ఈ రహదారుల నిర్మాణ పనులను ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

వర్షపాతం లోటు కారణంగా తలెత్తే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మంచినీటి సరఫరాకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. సింగూరు జలాశయంలో నీటి నిల్వలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ బోర్లు, బావులు, స్థానిక నీటి వనరులను వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించామన్నారు. రానున్న వేసవి వరకు ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ఉమ్మడి నాలుగు జిల్లాలకు సుమారు రూ.30 కోట్ల మేర నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం 'జలశ్రీ' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇంటికి ఇంకుడు గుంత, పంటకు పంట కుంట, ఊరికి ఊట కుంటల నిర్మాణంతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ నీటి సంరక్షణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు, డ్రైనేజీలు, సోక్‌పిట్లు, చెరువుల అభివృద్ధి వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

రాష్ట్రంలో అవసరమైన చోట గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఉన్న భవనాలతో పాటు మరో 1,800 కొత్త పంచాయతీ భవనాలు, 9,000కు పైగా మహిళా సంఘాల భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామానికి సమగ్ర ప్రణాళిక రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టేలా సర్పంచులకు శిక్షణ ఇస్తున్నామని, అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో అభివృద్ధి తీర్మానాలు చేయాలని సర్పంచ్లకు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370